సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

రబీ రైతుకు తెగుళ్ల దిగులు

- లక్షలాది ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు
- తీవ్ర వర్షాభావం, అకాల వర్షాలే కారణమంటున్న శాస్త్రవేత్తలు
- అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపడం లేదని మండిపడుతున్న రైతులు

సాక్షి, అమరావతి: సీజన్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావం, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో ఖరీఫ్‌లో కుదేలైన రైతు, రబీలోనైనా కాస్త కలిసొస్తుందని ఆశిస్తే పంటలపై దాడిచేస్తున్న చీడపీడలు రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రబీ సీజన్‌లో రాష్ట్రంలో సాగుచేసే ప్రధాన పంటలన్నీ తెగుళ్ల బారిన పడ్డాయి. దిగుబడి దెబ్బతీసే రసం పీల్చే పురుగు మొదలు రాత్రికి రాత్రి పంటను ఊడ్చిపెట్టే కత్తెర తెగులు వరకు వివిధ రకాల తెగుళ్లు పంటల్ని ఆశించాయి. దీంతో పంటలు ఏమైపోతాయోనని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. భారీ వర్షపాతం లోటు, అకాల వర్షాలు కారణంగా ఈ పరిస్థితి తలెత్తినట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. లక్షలాది ఎకరాల్లో పంటలు తెగుళ్ల బారిన పడి కకావికలమవుతున్నా అటు అధికారులు గానీ ఇటు శాస్త్రవేత్తలు గానీ పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.



పుంజుకోని సాగు...

రాష్ట్రంలో రబీ సీజన్‌లో 23.43 లక్షల హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా వ్యవసాయ శాఖ అధికారిక లెక్క ప్రకారం బుధవారం నాటికి 16.84 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. వర్షాభావం వెంటాడుతున్న నేపథ్యంలో సాగు ముందుకు సాగడం లేదు. నైరుతి రుతుపవనాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 18 శాతం ఉన్న వర్షపాతం లోటు నైరుతి ముగిసే నాటికి 58 శాతంగా ఉంది. గత పది రోజుల్లోనూ ఎక్కడా చుక్కవాన పడలేదు. ఏడు జిల్లాలు తీవ్ర లోటులో, ఆరు జిల్లాలు ఓ మాదిరి లోటు వర్షపాతంలో ఉన్నాయి.

పంటల పరిస్థితి ఇలా...

తీవ్ర వర్షాభావంతో రాయలసీమ జిల్లాల్లో చాలాచోట్ల పంటలు వాడుముఖం పట్టాయి. గోదావరి డెల్టాలో ఇప్పటికే పూర్తి కావాల్సిన వరి నాట్లు ఇంకా ఊపందుకోలేదు. కొట్టుడుకు రావాల్సిన పొగాకు ఇప్పుడిప్పుడే వస్తోంది. మిర్చి పూత దశలో ఉంది. శనగ వంటి మిగతా పంటలు పుష్పించే దశకు చేరుకున్నాయి. చెరకు మొక్క దశ దాటి గడ స్థితికి వస్తోంది.

తిత్లీ సాయం ఎక్కడ?

గత నెల 16, 18 తేదీల మధ్య కోస్తాను గడగడలాడించిన తిత్లీ తుపాను బాధితులకు ఇంతవరకు నష్టపరిహారం అందలేదు. ఈ తుపానులో 52,674.65 హెక్టార్లలో వరి, 1,113 హెక్టార్లలో మొక్కజొన్న, 228 ఎకరాల్లో వేరుశనగ, 87.71 హెక్టార్లలో పత్తి, 101.85 హెక్టార్లలో అపరాలు, 1,604.83 హెక్టార్లలో పొగాకు దెబ్బతిన్నట్టు అధికారులు లెక్కతేల్చినా అంతకుమించి నష్టం జరిగింది. నష్టపోయిన మేరకైనా పరిహారం ఇచ్చారా అంటే ఇంతవరకు దమ్మిడీ ఇచ్చిన పాపాన పోలేదని రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. తుపాను ప్రాంతాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ఆరోజు చెప్పిన ప్రకారం గత నెల 21నాటికే రైతుల ఖాతాలకు నేరుగా పరిహారం జమ కావాలి. కానీ ఇంతవరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఈ తెగుళ్ల నివారణకు దగ్గర్లోని వ్యవసాయాధికారులను సంప్రదించమని సలహా ఇస్తున్నారే తప్ప క్షేత్రస్థాయి పరిశీలనలు అసలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. తాము ఏది అడిగినా వ్యవసాయ విస్తరణ అధికారులను కలవమని ఉన్నతాధికారులు చెబుతున్నారని, విస్తరణాధికారులకు క్షేత్రస్థాయి పరిజ్ఞానం లేక పోవడంతో ఏదేదో చెబుతున్నారే తప్ప సరైన క్రిమిసంహారక మందుల్ని సూచించలేకపోతున్నారని వాపోతున్నారు.


చుట్టుముట్టిన తెగుళ్లు...

పంట	జిల్లా	తెగుళ్లు
వరి	చిత్తూరు, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్	ఆకు ముడత, కాండం తొలుచుపురుగు, పొడతెగులు
జొన్న	చిత్తూరు, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్	కత్తెర తెగులు
మొక్కజొన్న	చిత్తూరు, అనంతపురం, కృష్ణా, పశ్చిమ గోదావరి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం	కత్తెర తెగులు
శనగ	కృష్ణా, ప్రకాశం	రసం పీల్చుపురుగు
కంది	కర్నూలు	మరుకా మచ్చల పురుగు
పెసర	కృష్ణా, విజయనగరం	రసం పీల్చు పురుగు
మినుము	కృష్ణా, గుంటూరు	రసం పీల్చుపురుగు
వేరుశనగ	కృష్ణా, చిత్తూరు, అనంతపురం	రసం పీల్చే పురుగు, ఆకు మచ్చ
మిర్చి	కృష్ణా, కర్నూలు, చిత్తూరు, విజయనగరం	తుప్ప తెగులు (త్రిప్స్)

రిజర్వ్‌డ్ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీకి అనుమతించాల్సిందే...

- ఏపీపీఎస్సీకి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఆదేశం
- ఆయన ఆదేశాలు పాటించాల్సిన అవసరం లేదంటున్న కమిషన్
- జీవో రూపేణా ఉత్తర్వులు వస్తే పరిశీలిస్తాం: కమిషన్ చైర్మన్
- ఏపీపీఎస్సీ తీరుపై ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నిరసన

సాక్షి, అమరావతి: స్క్రీనింగ్ టెస్టు నుంచి ప్రత్యేక మినహాయింపుల ద్వారా మెయిన్స్‌కు ఎంపికయ్యే రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు వారి రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులకు మాత్రమే పరిమితం కావలసి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విధించిన నిబంధన వివాదాస్పదంగా మారుతోంది. దీనిపై ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడుతోంది. ఏపీపీఎస్సీ తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ కేటగిరీలకు చెందిన లక్షలాది మంది అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని చెబుతోంది. దీనిపై ఇప్పటికే ఆయా కేటగిరీల అభ్యర్థులతో పాటు ఈ గెజిటెడ్ అధికారుల సంఘం కూడా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. దీనిపై ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయబోతున్న ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు ఓపెన్ కేటగిరీలోనూ ప్రత్యేక మినహాయింపు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం కమిషన్‌ను ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఏపీపీఎస్సీకి లేఖరాశారు. అయితే ఈ ఆదేశాలను అమలు చేయడానికి ఏపీపీఎస్సీ ససేమిరా అంటోంది. గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే తాము వ్యవహరిస్తున్నామని, ఇప్పటికే నోటిఫికేషన్లు కూడా జారీచేసినందున వాటిలో మార్పులు చేయబోమని కరాఖండిగా చెబుతోంది.



ఏపీపీఎస్సీకి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పంపిన ఉత్తర్వులలో ఓ భాగం

ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఏపీపీఎస్సీకి బాస్ కాదు..: సాధారణ పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఆదేశాల గురించి ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్‌తో ప్రస్తావించగా 'ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఏపీపీఎస్సీకి బాసేం కాదు. ఆయన ఆదేశాలను అమలు చేయాల్సిన అవసరం మాకు లేదు. మేము అన్నీ ఆలోచించాకనే యూపీఎస్సీ విధానాలను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వం ఇంతకు ముందు ఇచ్చిన జీవోను అనుసరించి నోటిఫికేషన్లో రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ప్రత్యేక వెసులుబాటు ద్వారా స్క్రీనింగ్ టెస్టు నుంచి మెయిన్స్‌కు ఎంపికైతే వారు రిజర్వ్‌డ్‌పోస్టులకే పరిమితం అవుతారని పొందుపరిచాం. అన్ని నోటిఫికేషన్లకూ ఇదే విధానం అమల్లో ఉంటుంది.' అని స్పష్టంచేశారు. న్యాయ, ఆర్థిక సంబంధిత ఇతర శాఖల పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి చూసి, కేబినెట్ ఆమోదం పొందిన అనంతరం వచ్చే జీవోలు ప్రభుత్వ ఉత్తర్వులు అవుతాయి తప్ప ముఖ్యకార్యదర్శి లేఖ జీవో కాదన్నారు. ప్రభుత్వం నుంచి ఈమేరకు ఏమైనా జీవోలు వచ్చినా కమిషన్ వాటిని పూర్తిగా పరిశీలించాకనే ఏం చేయాలో తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టంచేశారు. కాగా ముఖ్య కార్యదర్శి ఆదేశాలనూ ఏపీపీఎస్సీ బేఖాతరంటుండడంతో ఇప్పడీ వ్యవహారం వివాదంగా మారుతోంది. ముఖ్యకార్యదర్శి ఆదేశాలను ఏపీపీఎస్సీ అమలు చేయకపోతుండడంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులతో పాటు ఆ వర్గాల గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వ ఆదేశాలను ఏపీపీఎస్సీ అమలు చేయాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి వీఎం.రవిశంకర్ డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఈనెల 23న ఏపీపీఎస్సీ సమావేశం కానుంది. దీనిలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి లేఖపైనా, వివిధ ఖాళీల భర్తీకి జారీచేయాల్సిన నోటిఫికేషన్ల పైనా చర్చించనుంది. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నుంచి ఆదేశాల లేఖ తమకు అందిందని, దాన్ని కమిషన్ ముందుంచుతామని, కమిషన్ తీసుకొనే నిర్ణయాన్ని అనుసరించి తాము చర్యలు చేపడతామని ఏపీపీఎస్సీ కార్యదర్శి ఏకే మౌర్య 'సాక్షి'కి వివరించారు.

కొత్త టారిఫ్ ఆర్డర్ ఇద్దామా.. వద్దా?!

- ఏపీఈఆర్‌సీ తర్జన భర్జన
- పబ్లిక్ హియరింగ్‌లో తీవ్ర నిరసన
- వాటికి జవాబు చెప్పలేకపోతున్న ప్రభుత్వం
- గతేడాది టారిఫ్ అమలు?

సాక్షి, అమరావతి: కొత్త టారిఫ్ ఆర్డర్ ఇచ్చే విషయంలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) తర్జన భర్జన పడుతోంది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేసే యోచనలో ఉంది. ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లువెత్తిన నిరసనే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. నిపుణుల నుంచి వచ్చిన విమర్శలకు ప్రభుత్వం సమాధానం జోడించకుండా టారిఫ్ ఆర్డర్ ఇవ్వడం సాధ్యం కాదని కమిషన్ వర్గాలంటున్నాయి.

ఎన్నికల వేళలో ఇబ్బందిగా మారతాయనే..: 2019–20 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ, అవసర నివేదికలను (ఏఆర్ఆర్) విద్యుత్ పంపిణీ సంస్థలు (ఏపీ డిస్కమ్‌లు) గతేడాది నవంబర్‌లో కమిషన్‌కు సమర్పించాయి. రెండు డిస్కమ్‌లకు దాదాపు రూ.8 వేల కోట్ల ఆర్థిక లోటు ఉన్నట్టు పేర్కొన్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీగా ఇవ్వకుంటే.. విద్యుత్ చార్జీల రూపంలో లోటును భర్తీ చేసే అవకాశం కల్పించాలని కోరాయి. ఏఆర్ఆర్‌లపై కమిషన్ ఇప్పటి వరకూ విశాఖ, విజయవాడ, తిరుపతిలో ప్రజాభిప్రాయ సేకరణ జరపగా.. విద్యుత్ రంగ నిపుణులు, వివిధ పార్టీల నేతలు, వినియోగదారులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన తర్వాత మూడు సార్లు అడ్డగోలుగా విద్యుత్ చార్జీల పెంపునకు కారణాలేంటని నిలదీశారు. ప్రభుత్వం ముడుపులు తీసుకుని ప్రైవేటు విద్యుత్‌ను ఇష్టానుసారం ప్రోత్సహించిందని ఆరోపించారు. మిగులు విద్యుత్ అంటూ కొనుగోలు చేయడం వెనుక అవకతవకలు జరిగాయని నిపుణులు పేర్కొన్నారు. వీటన్నింటిపైనా విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటికీ విద్యుత్ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. నిపుణుల అభిప్రాయాలతో పాటు, సంస్థల సమాధానం కూడా కమిషన్ రికార్డులో పొందుపరచాలి. దీనివల్ల అభ్యంతరాలను ఏ మేర పరిగణనలోకి తీసుకుందనేది స్పష్టమవుతోంది. ఇవన్నీ ఎన్నికల సమయంలో ఇబ్బందిగా ఉంటాయని, విపక్షాల చేతుల్లో విమర్శనాస్త్రాలవుతాయని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. కేంద్ర ప్రభుత్వ పథకం ఉజ్వల డిస్కమ్ అస్యూరెన్స్ యోజన (ఉదయ్)తో అప్పులన్నీ తీరినా.. మళ్లీ డిస్కమ్‌లు రూ.8 వేల కోట్ల వరకూ అప్పుల్లోకి వెళ్లడానికి ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేకపోతోంది. ఈ కారణంగా 2019–20 వార్షిక టారిఫ్ ఆర్డర్‌ను విడుదల చేసే అవకాశం లేదని తెలుస్తోంది. వాస్తవానికి ఏటా మార్చి నెలాఖరులోనే కొత్త టారిఫ్ ఆర్డర్ ఇవ్వడం ఆనవాయితీ. మొదట్లో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఆర్డరివ్వాలని భావించారు. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వీలుంది. దీన్ని సాకుగా చూపించి కొత్త టారిఫ్ ఆర్డర్‌ను వాయిదా వేయొచ్చని కమిషన్ వర్గాలంటున్నాయి. గతేడాది విద్యుత్ చార్జీలే 2019–20లోనూ వర్తింపజేసే వీలుందని తెలుస్తోంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 294

సోమవారం 14-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘ప్రతి రైతూ పట్టణ ప్రాంత వ్యక్తితో సమానంగా ఆదాయం పొందాలన్నదే నా అభిమతం’

కోడి పందేల వెల రూ.2 వేల కోట్లు



- ‘బరి’తెగిస్తున్న టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- వారి అండతో కోడి పందేలకు భారీ ఏర్పాట్లు
- గతేడాది హైకోర్టు నుంచి ఇక్కట్లు ఎదురైనా బేఖాతర్
- తోటల్లో నిర్వహణ.. అక్కడే సకల సౌకర్యాలు
- ఒక్కో పందెం కోడి ధర రూ.1.50 లక్షలు
- విదేశాలు, పలు రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్లు

2 లో



కోనసీమలో రంగవల్లులు వేస్తున్న యువతులు

పులకించిన పల్లె

- సంక్రాంతికి సొంతూళ్లకు పట్టణవాసులు
- గ్రామాల్లో సందడే సందడి..

4 లో



ముంచెత్తుతోన్న పొగమంచు

- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- కోస్తాంధ్రపై అధిక ప్రభావం

వివరాలు 2లో

నిందితుడు శ్రీనివాసరావుపై
ఎన్‌ఐఏ ప్రశ్నల వర్షం

- వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడి విచారణ
- విశాఖపట్నం విమానాశ్రయంలో క్రైం సీన్ రీకన్‌స్ట్రక్షన్
- నేరస్థలం, కత్తిని భద్రపరిచిన ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు
- అనంతరం హైదరాబాద్‌కు నిందితుడి తరలింపు
- ఎన్‌ఐఏ కార్యాలయంలో విచారణ



విశాఖ ఎయిర్‌పోర్టులోకి నిందితుడిని తీసుకెళ్తున్న ఎన్‌ఐఏ అధికారులు

సాక్షి, అమరావతి/విశాఖపట్నం /హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డ జనుపల్లి శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు ఆదివారం విశాఖపట్నంలో విచారించారు. అనంతరం విమానంలో హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి తరలించారు. విజయవాడ కోర్టు అనుమతితో శనివారం ఎన్‌ఐఏ సిబ్బంది శ్రీనివాసరావును తమ కస్టడీలోకి తీసుకున్న

మిగతా 2వ పేజీలో ▶

చంద్రబాబుపై కక్ష సాధించేందుకే..

- వైఎస్సార్‌సీపీకి టీఆర్‌ఎస్ మద్దతిస్తోందంటూ పవన్ వ్యాఖ్య
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ దశాబ్దాల పాటు పాలించవచ్చు.. నాకేం అభ్యంతరం లేదు
- తెనాలిలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న జనసేన అధ్యక్షుడు

7 లో

50 మంది సైనికులపై
వలపు వల

- భారత ఆర్మీకి సంబంధించిన కీలక వివరాలను సేకరించేందుకు పాకిస్తానీ మహిళ 50 మంది జవాన్లపై వల వేసింది. సున్నితమైన సమాచారాన్ని ఆమెతో పంచుకోవడంతో సోమ్‌వీర్ సింగ్ అనే సిపాయిని ఆర్మీ ఇప్పటికే అరెస్టు చేసింది.

8 లో

‘ఏపీ ఎన్జీవో’ అధ్యక్షుడిగా
చంద్రశేఖర్‌రెడ్డి

- ప్రధాన కార్యదర్శిగా బి. శ్రీనివాస్
- ప్రభుత్వ పెద్దలకు భంగపాటు
- విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యేలా పావులు
- ప్రభుత్వ పెద్దల ప్రతిపాదనను తిరస్కరించిన ప్రతినిధులు

7 లో

సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు

విజయవాడ: రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారికి ముఖ్యమంత్రి చంద్రబాబు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వాకిట వెలుగు ముగ్గులు వేసి మన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే సృజనాత్మక వేడుక సంక్రాంతి పండుగ అని చంద్రబాబు అన్నారు. రంగురంగుల రంగవల్లులు, వైవిధ్యమైన ముగ్గులు తెలుగింటి ఆడపడుచుల కళా సృజనకు నిదర్శనమని చెప్పారు. జీవన సమరంలో ఎక్కడో దూర తీరాల్లో ఉంటూ పండుగ వేళ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు కలుసుకుంటున్నారని, ఇది మన దేశ కుటుంబ వ్యవస్థ గొప్పదనమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

తెలుగు పల్లెలు సుఖ సంతోషాలతో తులతూగాలి

వైఎస్ జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శుభాకాంక్షలు తెలిపారు. సొంత గ్రామాలతో ప్రజలకున్న చెక్కు చెదరని ఆత్మీయతలు, అనుబంధాలకు సంక్రాంతి ప్రతీక అని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి అంటేనే రైతులు, పల్లెలు ప్రతి ఒక్కరికీ గుర్తుకొస్తాయని, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా... ప్రతి ఒక్కరి ఇల్లు ఆనందంగా ఉండాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, పైరు పచ్చల కళకళలు.. సంక్రాంతి పేరు చెబితే అందరికీ గుర్తుకొస్తాయన్నారు. అన్నపూర్ణగా పేరుగాంచిన తెలుగు నేల మీద రైతన్నలు, గ్రామీణ వృత్తులవారు సుఖసంతోషాలతో తులతూగాలని తాను కోరుకుంటున్నట్లు శుభాకాంక్షల సందేశంలో జగన్ పేర్కొన్నారు.

ముంచెత్తుతోన్న పొగమంచు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, హైదరాబాద్: కోస్తాంధ్రను పొగమంచు ముంచెత్తుతోంది. సూర్యాస్తమయం నుంచి మరుసటిరోజు సూర్యోదయం వరకు మంచు దట్టంగా అలముకుంటోంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కారణంగా రోడ్డుపై ఎదురుగా ఉన్న వాహనాలను కూడా గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్నాళ్లు ఏజెన్సీ ప్రాంతాల్లోనే మంచు ప్రభావం ఎక్కువగా ఉండేది. కానీ మారిన వాతావరణ పరిస్థితుల్లో ఇప్పుడు కోస్తాంధ్రలోని మైదాన ప్రాంతాల్లోనూ మంచు తీవ్రత అధికమవుతోంది. నాలుగు రోజుల నుంచి తూర్పు గాలులు వీయడం మొదలయ్యాయి. దీంతో ఉపరితలానికి కిలోమీటరు ఎత్తులో ఉష్ణోగ్రతలు తగ్గడానికి బదులు పెరుగుతున్నాయి. దీనివల్ల నీటి ఆవిరి పైకి పోకుండా ఉపరితలంలోనే ఉండిపోయి పొగమంచు ఏర్పడుతోంది. అదే సమయంలో బలమైన గాలులు కూడా లేకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణమని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి ఆర్.మురళీకృష్ణ 'సాక్షి'తో చెప్పారు. రానున్న రెండ్రోజులు కోస్తాంధ్రలో మంచు ఎక్కువగా కురుస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో పొగమంచు వల్ల ప్రజలు జలుబు, తలనొప్పితో పాటు గొంతు, శ్వాసకోశ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, సాధ్యమైనంత వరకు మంచు బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా హైదరాబాద్ నగరంలోనూ పొగ మంచు తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ నెల 17 వరకు రాత్రి వేళలతోపాటు ఉదయం 10 గంటల వరకు నగరంలో పొగమంచు తీవ్రత కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

చలి-పులి

ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆరోగ్యవరం	14
కళింగపట్నం	15
జంగమహేశ్వరపురం	16
తిరుపతి	16
అనంతపురం	17
విశాఖపట్నం	17
నంద్యాల	17
కడప	17
నందిగామ	17
అమరావతి	18
కావలి	19
కర్నూలు	19
హైదరాబాద్	17.5

కోడి పందేల వెల రూ.2వేల కోట్లు



కృష్ణాజిల్లా ఈడుపుగల్లులో బరి వద్ద సందడి

- గత ఏడాదికి ఇది రెట్టింపు
- 'బరి'తెగిస్తున్న టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- వారి అండతో కోడి పందేలకు భారీ ఏర్పాట్లు
- గతేడాది హైకోర్టు నుంచి ఇక్కట్లు ఎదురైనా బేఖాతర్
- తోటల్లో నిర్వహణ.. అక్కడే సకల సౌకర్యాలు
- ఒక్కో పందెం కోడి ధర రూ.1.50 లక్షలు
- విదేశాలతోపాటు పలు రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్ల రాక
- ఉభయ గోదావరి జిల్లాల్లో హోటళ్లు, రిసార్ట్స్ ఫుల్



పశ్చిమగోదావరి జిల్లాలో పందేలకు సిద్ధం చేసిన కోళ్లు

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్ : సంక్రాంతి పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా కోడిపందేల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఎన్ని ఆంక్షలు పెట్టినా రాజకీయ అండతో ఈసారి కూడా నిర్వాహకులు మరింతగా 'బరి'తెగిస్తున్నారు. రూ.రెండు వేల కోట్లకు పైగా ఈ ఏడాది పందేలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం ఎన్నికల ఏడాది కావడంతో ఇందుకు ఎంతో ముందు నుంచే వీటికి కసరత్తు జరిగింది. పోలీసులూ చూసీచూడనట్లు ఉండాలని వారికి లోపాయికారిగా సంకేతాలు అందాయి. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు మంత్రులు, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీఎత్తున కోడిపందాలను ప్రోత్సహిస్తున్నారు. కాగా, ఎప్పటిలాగే ఈసారి కూడా పశ్చిమ గోదావరి జిల్లా ఈ పందేలకు ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి పోటీలు అని చెప్పి బరులు పెద్దఎత్తున సిద్ధంచేశారు. పందేలు సోమవారం నుంచి ప్రారంభమవుతుండడంతో కోళ్ల గ్రేడింగ్ పూర్తిచేసి పందేలకు అర్హత కలిగిన పుంజులను ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఆయా ప్రాంతాలకు తరలించారు.

ఈసారి రూ.2వేల కోట్లు టార్గెట్

కోడి పందేలతో పాటు బరుల పక్కనే పెద్దఎత్తున జూదం జరుగుతుంటుంది. పేకాట, కోతాట, గుండాటల్లో పెద్ద మొత్తాల్లో చేతులు మారుతుంది. ఇలా గతేడాది దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర చేతులు మారినట్టు అంచనా. ఈసారి పెద్దగా పోలీసుల ఆంక్షలు లేకపోవడంతో ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాలకు కోడి పందేలు, జూదాన్ని బాగా విస్తరించారు. ప్రధానంగా ఒక్కో జిల్లాలో కనీసం భారీ పందేలు వేసేలా 15 పెద్ద బరులు, చిన్నపాటి పందేలు వేసుకునేలా 600 నుంచి 800 బరులు సిద్ధమయ్యాయి. చిన్నపాటి పందాల్లో కనీసం రూ.5 వేల నుంచి లక్ష వరకు పందెం ఒడ్డుతుంటారు. అదే భారీ పందేల్లో అయితే కనీసం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బెట్టింగ్ వేస్తుంటారు. దీనికితోడు పుంజులను బరిలో దింపిన వారు తమ పుంజు నెగ్గుతుందని నేరుగా బెట్టింగ్ వేస్తే.. చుట్టూ చేరిన వారు పైపందేలు కాస్తుంటారు. ఒక్కో పందెంలో నేరుగా రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకు పందెం వేస్తే దానికి పైపందేలు రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు జరుగుతుంటాయి. ఈ లెక్కన ఒక్కో బరిలో రోజుకు కనీసం 15 కోడి పందేలను వేస్తుంటారు. అదే సంక్రాంతి రోజైతే 24గంటలూ పందేలు వేస్తారు. దీంతో ఒక్కో బరిలో మూడు రోజుల్లో దాదాపు 60 పందేలు వేస్తుంటారు. దీనికితోడు పేకాట, కోతాట, గుండాట ఫలితాలు నిమిషాల్లో తేలిపోతుంటాయి. వాస్తవానికి కోడి పందాల కంటే జూదంలోనే పెద్దఎత్తున మొత్తాలు చేతులు మారుతుంటాయి. ఈ లెక్కన గతేడాది రాష్ట్రంలో దాదాపు రూ.వెయ్యి కోట్లు చేతులు మారితే ఈ ఏడాది రూ.1,500 నుంచి రూ.2 వేల కోట్లు మారుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

కోనసీమ పుంజులకు అత్యధిక ధర

కోడి పందేల్లో కోనసీమ పుంజులకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి వాతావరణంలో పెరిగిన పుంజులు పందేలలో రాణిస్తాయన్న నమ్మకం ఉంది. పెంపకం, తర్ఫీదు కూడా అదేస్థాయిలో ఉంటుంది. ప్రస్తుత సంక్రాంతికి పందెం రాయుళ్ళు కోనసీమ పుంజులపై అత్యధికంగా నగదు పెట్టారని సమాచారం. ఈసారి కోనసీమ పుంజు ఏకంగా రూ.1.50 లక్షల ధర పలికింది. ఈ ధరకు సుమారు 300లకుపైగా పందెం పుంజులు పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లినట్లు తెలిసింది. లక్షా యాభై వేలలోపు ధరలున్న పుంజులు కూడా అధికంగా అమ్ముడయ్యాయి.

గ్రేడింగ్ ఇలా..

పందేలకు ఇక ఒకరోజే సమయం ఉండడంతో పెంపకం స్థావరాల్లో కోడి పుంజులకు గ్రేడింగ్ పూర్తిచేసి పందెం బరులకు తరలించారు. తొలుత డింకీ పందెం వేస్తారు. అందులో పందెం పుంజు తన ప్రత్యర్థి పుంజుపై నిమిషానికి నాలుగుసార్లు చొప్పున దాడిచేసి వరుసగా రెండు డింకీ పందేలలో ప్రతిభ చూపితే ఆ పుంజు మొదటి శ్రేణి పుంజుగా పరిగణిస్తారు. ఈ రకం పుంజు ధర రూ.1.50 లక్షలు ఉంటుంది.

సర్కారు గ్రీన్‌సిగ్నల్

ఎన్నికల సంవత్సరం కావడంతో రాజకీయంగా రాణించాలంటే కోడి పందేలకు అడ్డంకులు చెప్పకూడదని పలు జిల్లాల నేతలు ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సర్కారు వీరికి లోపాయికారిగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గతేడాది కోడి పందాలు అడ్డుకుంటామంటూ నెలరోజుల ముందు నుంచే పోలీసులు హెచ్చరికలు చేయడంతోపాటు ముందస్తు దాడులు, కత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు పెట్టి కట్టడిచేసే ప్రయత్నాలు చేశారు. అయినా, పందేలు ఆగకపోవడంతో పోలీసులు, అధికారులు న్యాయస్థానానికి సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. వాటిని ఎందుకు అడ్డుకోలేకపోయారో వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర హైకోర్టు ఆదేశించడంతో డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోర్టుకు హాజరయ్యారు. తాజాగా, విజయవాడలో హైకోర్టు కార్యకలాపాలు మొదలవడంతో ఈ విషయంలో న్యాయస్థానం ఎలా స్పందిస్తుందోనని నిర్వాహకుల్లో టెన్షన్ నెలకొంది.

తోటల్లో బరులు.. అక్కడే అన్ని ఏర్పాట్లు

ఇదిలా ఉంటే.. కోడి పందేల నిర్వహణకు మామిడి తోటలు, కొబ్బరి తోటలు, ఇతర పండ్ల తోటలను నిర్వాహకులు లీజుకు తీసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, ఇతర ముఖ్యమైన వారి కోసం బరుల వద్దే మద్యం విక్రయాలు ఏర్పాటుచేస్తున్నారు. కోడి పందేల బరులకు ఆనుకుని పేకాట, కోతాట, గుండాట వంటి జూదాల నిర్వహణకు కూడా రంగం సిద్ధమైంది. ఈ జూదాల్లో కేవుల్ (నిర్వహణ వాటా) వల్ల పెద్ద మొత్తాల్లో ఆర్థిక లాభం ఉండటంతో వీటి నిర్వహణకు గ్రామ, పట్టణాల్లో తీవ్ర పోటీ నెలకొంది.

విదేశాల నుంచీ రాక

మరోవైపు.. సంక్రాంతి పండుగ కోసం అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో స్థిరపడిన వారు సైతం సొంతూళ్లకు వస్తుండగా పందేల్లో పాల్గొనేందుకు వారు ఇప్పటికే స్థానిక బ్యాంకుల్లోని తమ ఖాతాల్లోకి నగదును బదిలీ చేసేశారు. పురుషులకు తామేమీ తీసిపోమంటూ మహిళలు, యువతులు కూడా పందేలకు వస్తున్నారు. కోనసీమలోని దిండి పరిసర రిసార్ట్స్‌లతోపాటు పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని హోటళ్లు నెలరోజుల కిందటే బుక్ అయిపోయాయి. అమరావతి, విజయవాడ, రాయలసీమ ఉత్తరాంధ్రలతోపాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, నాగపూర్, భువనేశ్వర్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచీ కూడా పందెం రాయుళ్లు చేరుకుంటున్నారు. 'పశ్చిమ'లో అయితే పర్యాటక ఏజెంట్లు ప్రైవేటు నివాస గృహాలను కూడా సంప్రదిస్తున్నారు. ఒక మడత మంచం వేస్తే సాధారణ తాటాకు ఇల్లు కూడా స్టార్ హోటల్ రూమ్ ధర పలుకుతుందని ఒక పర్యాటక ఏజెంట్ 'సాక్షి'కి చెప్పారు.

మొక్కుబడిగా దాడులు..

కోడి పందాలకు కేంద్రంగా చెప్పుకునే ఉభయగోదావరి జిల్లాల్లో గడిచిన రెండు రోజులుగా పోలీసులు మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో బరులను ధ్వంసం చేసిన పోలీసులు కోడి పుంజులకు కత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు పెట్టారు. అయితే, రాజకీయ అండదండలున్న వారు పోలీసులకు ఎదురు తిరుగుతున్నారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా ఈ దాడులేంటని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలో ఒక పోలీసు అధికారిని నిర్వాహకులే నిలదీశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ నేతల అండదండలతో..

- రాష్ట్రంలో టీడీపీ ఎమ్మెల్యేల అండదండలతో అనేకచోట్ల బరులు సిద్ధంచేశారు.
- కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లులో అధికార పార్టీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుచరులు 10 ఎకరాలను చదును చేసి బరిని సిద్ధంచేశారు.
- ఇదే జిల్లా గొడవర్రు గ్రామంలో ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ అనుచరులు కూడా ఆరు ఎకరాల్లో బరిని ఏర్పాటుచేశారు.
- అలాగే, బాపులపాడు మండలం అంపాపురంలోనూ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు బరి ఏర్పాటుచేశారు. అంతేకాక, కొత్తూరు తాడేపల్లి, గుడివాడ, పామర్రు, కైకలూరు, మైలవరం మండలాల్లో అధికార పార్టీ నేతల అండదండలతో బరులు సిద్ధం చేశారు.
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనుచరులు ఐదు మండలాల్లో బరులను ఏర్పాటుచేస్తున్నారు.
- ఇక గుంటూరు జిల్లాలో ఆదివారం నుంచే పందేలకు తెరలేపారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో అనేక ప్రాంతాల్లో ఒక్కరోజే కోటికి పైగా చేతులు మారినట్లు సమాచారం. జిల్లాకు చెందిన ఓ టీడీపీ ఎంపీ డైరెక్షన్‌లో పెద్దఎత్తున బరులు ఏర్పాటుచేశారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆరిలోవలో టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మూడేళ్లుగా పందేలు నిర్వహిస్తున్నారు.
- తూర్పు గోదావరి జిల్లాలో హోంమంత్రి చినరాజప్ప సొంత ఇలాకా పెద్దాపురం నియోజకవర్గంలోనే భారీఎత్తున పందేలకు ఏర్పాట్లుచేశారు. అలాగే, ఆర్థికమంత్రి యనమల ఇలాకా తునిలోని తేటగుంటలో పెద్ద పందేలకు రంగం సిద్ధం చేశారు.

పెరుగుతున్న ప్రయాణ కష్టాలు

- ఏమాత్రం పట్టించుకోని సర్కారు
- రహదార్లపై పెరుగుతున్న వాహనాల రద్దీ
- రెగ్యులర్ సర్వీసుల్ని నిలిపివేసి ఆదాయం కోసం ప్రత్యేక సర్వీసులు తిప్పుతున్న ఆర్టీసీ
- సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల వెతలు వర్ణనాతీతం
- టోల్ చార్జీలు రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటన
- తమకు ఆదేశాలందలేదంటూ టోల్ బాదుతున్న నిర్వాహకులు



దండుకుంటున్న ప్రైవేటు ఆపరేటర్లు

సంక్రాంతి రద్దీ ప్రైవేటు ఆపరేటర్లకు వరంగా మారింది. విజయవాడ నుంచి ఏలూరుకు సాధారణ రోజుల్లో కారులో వెళితే రూ.70 వసూలు చేస్తారు. ఇప్పుడు రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. అదేమంటే ఇష్టమైతే రండి..లేకుంటే పొండి.. అని ప్రైవేటు ఆపరేటర్లు చెబుతున్నారని, చేసేదేమీ లేక అడిగినంత ఇవ్వాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

సాక్షి, అమరావతి: తెలుగు ప్రజల ముఖ్య పండుగ సంక్రాంతికి గత రెండ్రోజుల నుంచి ప్రయాణ కష్టాలు రెట్టింపవుతున్నాయి. రద్దీకి తగ్గట్లు ఆర్టీసీ, రైల్వే శాఖలు బస్సులు, రైళ్లు నడపకపోవడంతో సొంతూళ్లకు వెళ్లే వారిలో పండుగ ఉత్సాహం నీరుగారిపోతోంది. బస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు నిల్చొని పడిగాపులు కాస్తున్నారు. ప్రయాణికుల వెతలు సర్కారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు ఏ మూలకూ సరిపోవడం లేదు. 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తూ విజయవాడ సిటీలో తిరిగే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను సుదూర ప్రాంతాలైన రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నంలకు తిప్పుతున్నారు. వీటిలో సూపర్ లగ్జరీ బస్సుల్లో వసూలు చేసే చార్జీలను వసూలు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికోమారు వచ్చే పండుగకు ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు ఇవేనా? అంటూ ప్రయాణికులు మండిపడుతున్నారు. రెగ్యులర్ సర్వీసుల్ని నిలిపేసి ఆదాయం కోసం ప్రత్యేక బస్సులను తిప్పడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండ్లలో రిజర్వేషన్ కౌంటర్ల ముందు భారీ క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. ఆదివారం ఏలూరు, ఒంగోలు, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు నానాపాట్లు పడాల్సి వచ్చింది. వృద్ధులు, పిల్లలతో కలిసి సొంతూరికి వెళ్లే వారికి సీటు కోసం కష్టాలు తప్పలేదు. రద్దీకి తగ్గట్లు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడం లేదు. 15 నుంచి 20 కిలోమీటర్లు తిరిగే బస్సులను 200 కిలోమీటర్ల ప్రయాణానికి వినియోగిస్తూ రూ.200 నుంచి రూ.250 వరకు వసూలు చేయడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు కేవలం దూర ప్రాంత సర్వీసులపై దృష్టి కేంద్రీకరించారే తప్ప సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల్ని పట్టించుకోకపోవడంతో వారి ఇబ్బందులు వర్ణనాతీతమయ్యాయి. రైళ్లలో నిల్చొనేందుకు జాగా లేకపోవడంతో ప్రయాణం నరకంగా మారిందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రయాణ కష్టాలు ఈనెల 21 వరకు తప్పేలా లేవని ఆర్టీసీ వర్గాలు చెప్పడం గమనార్హం.

రహదార్లపై తగ్గని రద్దీ

హైదరాబాద్–విజయవాడ, విజయవాడ–చెన్నై జాతీయ రహదార్లపై ఆదివారం రద్దీ తగ్గలేదు. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. టోల్ రుసుం రద్దు చేశామని ప్రభుత్వం ప్రకటించినా.. తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని వాహనదారులతో నిర్వాహకులు చెబుతున్నారు. కనీసం అదనపు కౌంటర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు.

జన్ సాధారణ్ రైళ్లను ప్రకటించిన రైల్వే శాఖ

పండుగ రద్దీ దృష్ట్యా ఏడు జన్ సాధారణ్ ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ ప్రకటించింది. సాధారణ రైలు చార్జీలతో ఈ రైళ్లలోని ఏ బోగీలో అయినా కూర్చుని ప్రయాణించవచ్చు. ఈ రైళ్లలో సికింద్రాబాద్ నుంచి విజయవాడకు రూ.130, విజయవాడ నుంచి హైదరాబాద్ కు రూ.135, కాకినాడ నుంచి తిరుపతికి రూ.175, విజయనగరం, విజయవాడ మధ్య ప్రయాణానికి రూ.145 టికెట్ ధరను నిర్ణయించినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

శ్రీనివాసరావుపై ఎన్ఐఏ ప్రశ్నల వర్షం

▶ మొదటి పేజీ తరువాయి

సంగతి తెలిసిందే. విజయవాడ జైలు నుంచి అదేరోజు అర్ధరాత్రి దాటాక విశాఖపట్నం బక్కన్నపాలెంలోని ఏపీఎస్పీ బెటాలియన్‌కు తీసుకొచ్చారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు శ్రీనివాసరావును అతడి న్యాయవాది అబ్దుల్ సలీం సమక్షంలో విచారించారు. తర్వాత తెల్లచొక్కా, నల్ల ప్యాంటు ధరించిన నిందితుడిని అక్కడి నుంచి 3.45 గంటల సమయంలో ర్యాపిడ్ ఇంటర్వెన్షన్ వాహనంలో విశాఖపట్నం విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడ అతడికి ముసుగు వేసి ఎయిర్‌పోర్టులోకి తీసుకెళ్లారు. లోపలకు వెళ్లాక ముసుగు తొలగించారు. క్రైం సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగిన వీఐపీ లాంజ్‌లోకి శ్రీనివాసరావును వెంటబెట్టుకుని వెళ్లారు. అక్కడ అతడిని పలు అంశాలపై ప్రశ్నించారు. ఘటన జరిగిన తీరుతెన్నులను ఆరా తీశారు. ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లోని నేరస్థలం, కత్తిని భద్రపరిచిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరావు పనిచేసిన తెలుగుదేశం పార్టీ నేత హర్షవర్దన్ ప్రసాద్ చౌదరికి చెందిన ఎయిర్‌పోర్టులోని ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌కు తీసుకెళ్లారు. దాదాపు 20 నిమిషాలపాటు అక్కడ ఉన్నారు. రెస్టారెంట్‌లో నిందితుడు విధులు నిర్వహించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఏయే పనులు చేసేవాడివని ప్రశ్నించారు.

వారిద్దరూ అక్కడ లేరు

నిందితుడు శ్రీనివాసరావును విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో విచారణకు తీసుకొచ్చిన సమయంలో ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని, టీడీపీ నేత హర్షవర్దన్ ప్రసాద్ చౌదరి అక్కడ లేరు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎయిర్‌పోర్టు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వేణుగోపాల్ కూడా లేరు. నిందితుడిని ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చే సమయంలోనూ విశాఖపట్నం పోలీసు అధికారులెవరూ వెంట రాలేదు.

హైదరాబాద్‌కు తరలింపు

విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో శ్రీనివాసరావును దాదాపు రెండు గంటల పాటు ఎన్ఐఏ అధికారులు ప్రశ్నించారు. సాయంత్రం 6 గంటలకు విశాఖ నుంచి హైదరాబాద్ మీదుగా దుబాయ్ వెళ్లే ఎయిర్ ఇండియా విమానంలో నిందితుడిని వెంటబెట్టుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు. శ్రీనివాసరావు వెంట ఎన్ఐఏ అధికారులు సాజిద్ మహ్మద్, ప్రసాద్, మరో అధికారి ఉన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భారీ బందోబస్తు మధ్య శ్రీనివాసరావును మాదాపూర్‌లోని ఎన్ఐఏ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. వారంరోజుల పాటు నిందితుడిని కస్టడీకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం వెనుకున్న కారణాలు, సూత్రధారుల పాత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు మాదాపూర్ కార్యాలయంలోనే విచారణ జరుపనున్నట్టు తెలిసింది. ముందుగా అనుకున్నట్టు విజయవాడ లేదా విశాఖపట్నంలోనే నిందితుడిని విచారించాలని భావించారు. అయితే, అక్కడి పరిస్థితులు అనుకూలించకపోవడంతో తమ కార్యాలయంలోనే విచారించడం మంచిదని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. అందులో భాగంగా మాదాపూర్‌లోని కార్యాలయంలోనే మిగిలిన విచారణ కొనసాగించాలని యోచిస్తున్నారు.

నన్ను హైదరాబాద్‌కు రమ్మన్నారు

శ్రీనివాసరావును హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారిస్తామని, విచారణ సమయంలో అక్కడికి రావాలని అధికారులు తనకు చెప్పారని నిందితుడు శ్రీనివాసరావు తరపు న్యాయవాది అబ్దుల్ సలీం పేర్కొన్నారు. తాను సోమవారం ఉదయం హైదరాబాద్ పయనమవుతున్నానని తెలిపారు. ఆదివారం విశాఖ ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఎన్ఐఏ అధికారులు తన సమక్షంలో శ్రీనివాసరావును విచారించారని, ప్రతిపక్ష నేత జగన్‌ను హత్యచేయాలని ఎందుకు ప్రయత్నించావు, దీని వెనక ఎవరున్నారని ప్రశ్నించారని అబ్దుల్ సలీం చెప్పారు.

తప్పని 'టోల్' తిప్పలు

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు..
- ప్లాజాల వద్ద యథావిధిగా సిబ్బంది వసూళ్లు



కీసర టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

కీసర(కంచికచర్ల)/ సాక్షి, అమరావతి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న ప్రజలకు ఎటువంటి భారం పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 13 నుంచి 16 వరకు టోల్ టాక్స్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా.. ప్లాజా అధికారులు మాత్రం వాహనదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని కీసర టోల్ ప్లాజా అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, కర్ణాటక, ముంబై, ఇతర ప్రాంతాల నుంచి ఏపీకి కార్లు సహా ఇతర వాహనాల్లో భారీగా జనాలు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి 16వ తేదీ వరకు టోల్ టాక్స్‌లు రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. అయితే టోల్ ప్లాజా మేనేజర్ దగ్గరుండి మరీ వాహనదారుల నుంచి బిల్లులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం గురించి చీఫ్ ఆపరేషన్ మేనేజర్ హరిపాండురంగ స్వామిని వివరణ కోరగా తమకు నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదని అందుకే వసూలు చేస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వసూలు చేశారు. ఇదే సమయంలో ఎస్ఐ ఎ.మణికుమార్ పండుగ నిమిత్తం వచ్చే వాహనదారుల నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని గట్టిగా చెప్పటంతో వసూలు నిలిపివేశారు.

ప్రభుత్వ ఉత్వర్వులు ఖాతరు చేయరా: రామకృష్ణ

సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు బయల్దేరిన ప్రజల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు టోల్‌గేట్ పన్నులను రద్దు చేసినా వాటి నిర్వాహకులు పట్టించుకోకపోవడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వాల ఉత్తర్వులను ఖాతరు చేయకుండా ఫీజు వసూలు చేయడమేమిటని నిలదీశారు.

జగన్‌పై హత్యాయత్నం కుట్రలో బాబు పాత్ర

- అందుకే ఎన్ఐఏ విచారణ అంటేనే ఆయనకు చెమటలు పడుతున్నాయ్
- కుట్ర బయటపడుతుందనే కదా..
- చంద్రబాబు వ్యవహారశైలిపై బీజేపీ నేతల ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కుట్రలో సీఎం చంద్రబాబు పాత్ర ఉంది కాబట్టే.. ఎన్ఐఏ విచారణతో నిజాలు బయటపడతాయని ఆయనకు చెమటలు పడుతున్నాయని రాష్ట్ర బీజేపీ నేతలు ధ్వజమెత్తారు. ఘటన విశాఖ విమానాశ్రయంలో జరిగింది కాబట్టి.. అది కేంద్రం పరిధిలోదని చెప్పి కేసు విచారణతో తమకు సంబంధం లేదన్న చంద్రబాబు.. ఇప్పుడు కేసును ఎన్ఐఏ విచారిస్తుంటే ఎందుకు అంతలా ఉలికిపడుతున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కో ఇన్‌చార్జ్ సునీల్ దియోధర్, రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆదివారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్‌పై దాడి కేసును కేంద్రం ఎన్ఐఏకు అప్పగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రధానికి లేఖ రాసిన చంద్రబాబు వ్యవహారశైలిపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోమల హత్య కేసును ఎన్ఐఏకు అప్పగించినప్పుడు ఎన్ఐఏపై విశ్వాసం వ్యక్తం చేసిన బాబు.. జగన్ కేసు విచారణకొచ్చే సరికి రాష్ట్ర సంబంధాల్లో కేంద్రం జోక్యం ఎందుకు? అని అంటున్నారని ధ్వజమెత్తారు.

మానసిక వ్యాధితో బాధపడుతున్న బాబు : కన్నా

ఒకే విషయంపై రోజుకోరకంగా మాట్లాడుతున్న చంద్రబాబు పరిస్థితి చూస్తే ఆయన మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు అర్థమవుతోంది. జగన్‌పై దాడి కేసుతో తమకు సంబంధం లేదని ఘటన జరిగిన రోజు మీడియా ముందు చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు ఆ కేసు విచారణను ఎన్ఐఏకు అప్పగిస్తే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మానసిక వ్యాధితో బాధపడుతున్న చంద్రబాబు సీఎంగా ఉండడం ప్రమాదకరం. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. రాష్ట్రంలో 600 హామీలు ఇచ్చి అన్ని వర్గాలను మోసం చేశారు.

బీజేపీకి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్: సునీల్ దియోధర్

'కేంద్రం ఏపీకి ఏం చేయలేదంటూనే ఇప్పటి వరకు చేసిన మేలుపై పరోక్షంగా ప్రచారం కల్పిస్తున్న చంద్రబాబే ఏపీ బీజేపీకి బ్రాండ్ అంబాసిడర్. కేంద్రం ఇచ్చిన నిధులను జన్మభూమి కమిటీలోని దొంగలు దోచుకుంటూ.. గజదొంగైన చంద్రబాబుకు దోచిపెడుతున్నారు. అమిత్‌షా ఈ నెల 18 కడప, ఫిబ్రవరి ఒకటిన వైజాగ్‌లలో పర్యటించి పార్టీశ్రేణులతో సమావేశమవుతారు.

అప్పుడు మంచివి.. ఇప్పుడు చెడ్డవా? : జీవీఎల్

తన ప్రత్యర్థులపై ఎన్ఐఏ, సీబీఐలు కేసులు నమోదు చేస్తే దర్యాప్తు సంస్థలన్నీ బాగా పనిచేసినట్టు.. తన మనుషులపై కేసులు పెడితే మాత్రం బాబు సహించరు. ఏకంగా సీబీఐనే రాష్ట్రంలో నిషేధించారంటే చంద్రబాబు ఏ స్థాయిలో తప్పులు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇదం జగత్



అల్లుడికి బస్ దొరకలేదంటే ఇదే నిజమైన పండుగని అంటారేంటండీ!!



LOT
సంక్రాంతి సంబరాలు
LOT 150 STORES Across AP & TS
LOT EXCLUSIVE
ZERO COST ONE TIME SCREEN REPLACEMENT
ON SELECTED MOBILES
*Conditions Apply
SAMSUNG Galaxy J4+ NOW ₹8490/- Old Price ₹9990/-
vivo Y95 NOW ₹15990/- Old Price ₹16990/-
oppo F9 Pro INDUCTION STOVE FREE
NOKIA Connecting People 3.1+ NOW ₹9999/- Old Price ₹11499/-
motorola E5+ NOW ₹9999/- + ₹2000/- CASH BACK
సంక్రాంతి సంబరాలు SAMSUNG 10% Amazing Cashback*
Galaxy J6 Galaxy A7 Galaxy J6+
NOKIA 1 Connecting People WIRELESS BLUETOOTH SPEAKER FREE
honor HOLLY 4+ only @ ₹9999/- HOT DEAL
LAVA Z60S WIRELESS BLUETOOTH SPEAKER FREE
Spice V801 WIRELESS BLUETOOTH SPEAKER FREE
Karbonn JODI OFFER only @ ₹1499/-
0% DOWN PAYMENT
NEVER BEFORE PRICE
Xiaomi
Redmi 6 Pro 3+32 ₹10,299 ₹11,499 4+64 ₹12,499 ₹13,499
Redmi Note 5 Pro 4+64 ₹13,499 ₹15,999 6+64 ₹14,499 ₹17,999
Mi A2 4+64 ₹14,499 ₹17,499 6+128 ₹16,499 ₹20,500
Redmi Y2 3+32 ₹9,299 ₹10,499 4+64 ₹11,499 ₹13,499
Redmi 6 3+32 ₹8,299 ₹8,999 3+64 ₹9,299 ₹10,499
MANY MORE FREE GIFTS on mobile purchase
LOT
www.lotmobiles.com | Helpline: 1800 123 3567
Follow us on



TVS
గడపాలి ఘనంగా
నడపాలి ఘనంగా
TVS Radeon
www.tvsradeon.com/ tvsradeon/ 1800 315 7999
ఎక్స్ షోరూం ధర ₹49,540*
21 బెస్ట్ ఇన్ క్లాస్ ఫీచర్స్#
క్రోమ్ బెజల్ హెడ్‌ల్యాంప్
రిబ్డ్ థై ప్యాడ్స్‌తో కూడిన స్టైలిష్ పెట్రోల్ ట్యాంక్
పెద్ద కుషన్ సీట్**
కారులో ఉన్నటువంటి స్పీడోమీటర్
ఫుల్ క్రోమ్ మెటల్ ఎగ్జాస్ట్
సింక్రనైజ్డ్ బ్రేకింగ్ సాంకేతికత (SBT)
*T&C apply. Ex-showroom price Andhra Pradesh of TVS Radeon ES Mag BS IV Variant. Prices subject to change without prior notice. *For further details, please visit www.tvsradeon.com. **Largest Seat in Segment (Length & Width). ^5 year warranty without any additional charges. TVS Showrooms are open on all Sundays.
TVS 5 YEAR WARRANTY
SUPERIOR MILEAGE
FOR ALL BULK/INSTITUTIONAL REQUIREMENTS PLEASE MAIL: corporate.customersupport@tvsmotor.com గారపాటి టీవీఎస్, విజయవాడ: 9821394524, కాసా టీవీఎస్, విజయవాడ: 9821393087, కాసా టీవీఎస్, గుడివాడ: 9821394621, కాసా టీవీఎస్, కామారు: 9821404813, కాసా టీవీఎస్, మచిలీపట్నం: 9821405949, గారపాటి టీవీఎస్, భవానీపురం: 9821404918, ప్రతాప్ టీవీఎస్, జగ్గయ్యపేట: 9821390302, ప్రతాప్ టీవీఎస్, కంచికచర్ల: 9821403572, ప్రతాప్ టీవీఎస్, నందిగామ: 9821403024 వయసిర్ టీవీఎస్, గుంటూరు: 9821388620, వయసిర్ టీవీఎస్, అమరావతి రోడ్: 9821401907, విష్ణుప్రియ టీవీఎస్, ఒంగోలు: 9870259726, విష్ణు ప్రియ టీవీఎస్, చీరాల: 9870260422, లక్ష్మీప్రియ టీవీఎస్, నెల్లూరు: 9870261929, ప్రైమ్ టీవీఎస్, నెల్లూరు: 9121208759, ప్రైమ్ టీవీఎస్, గూడూరు: 9121208719, శ్రీ గోకుల్ టీవీఎస్, ఏలూరు: 9821377975, శ్రీ గోకుల్ టీవీఎస్, తాడేపల్లిగూడెం: 9821382145, వెంకట్ శ్రీ టీవీఎస్, భీమవరం: 8527368678, శ్రీ కృష్ణ టీవీఎస్, తణుకు: 9821375792, ఇందుబాల టీవీఎస్, పాలకొల్లు: 9821376620.


భృంగివాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న మల్లికార్జునస్వామి

భృంగివాహనంపై శ్రీశైలేశుడు

శ్రీశైలం: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రమణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 7.30 గంటలకు శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు విశేషవాహన, అలంకార సేవ నిర్వహించారు. ఆ తర్వాత ప్రధానాలయ రాజగోపురం నుంచి రథశాల వద్దకు చేరుకున్న ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం అంకాలమ్మగుడి, నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగి.. తిరిగి రాత్రి 9.30 గంటలకు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. ప్రధాన పురవీధుల్లో జరిగిన ఈ గ్రామోత్సవంలో భృంగి వాహనాధీశులైన స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు ఫలపుష్ప నారికేళాలను భక్తి పూర్వకంగా సమర్పించుకున్నారు.

ఏపీపీఎస్సీకి ఐఏఎస్‌ను చైర్మన్‌గా నియమించాలి

మంత్రి నక్కా ఆనందబాబుకు నిరుద్యోగ ఐక్యవేదిక విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీకి ఐఏఎస్ అధికారిని చైర్మన్‌గా నియమించాలని నిరుద్యోగ ఐక్య వేదిక సభ్యులు కోరారు. ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబును కలసి వారు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు మెరిట్‌లో సీటు సాధిస్తే మెరిట్ గానే పరిగణించాలని, ఏపీపీఎస్సీ పరీక్షల గరిష్ట వయోపరిమితి 44 ఏళ్లకు పెంచాలని కోరారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష తేదీని ఒక నెల పొడిగించాలని, బీఈడీ, జేఎల్ తదితర పోస్టుల సంఖ్యను పెంచాలని, ప్రస్తుత ఏపీపీఎస్సీ చైర్మన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలసిన వారిలో నిరుద్యోగ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ కొల్లికొండ వెంకట సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

అగ్రవర్ణ రిజర్వేషన్ల చట్టాన్ని సుప్రీంలో సవాల్ చేస్తాం

అఖిల భారత బీసీ ఫెడరేషన్ వెల్లడి


సమావేశంలో పాల్గొన్న బీసీ ఫెడరేషన్ నాయకులు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన 124వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేయాలని అఖిల భారత బీసీ ఫెడరేషన్ తీర్మానించింది. విజయవాడలో ఆదివారం అఖిల భారత బీసీ ఫెడరేషన్ సమావేశం జరిగింది. న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ..పేదరికం ముసుగులో అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. అఖిల భారత బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు, జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ..వివక్ష, అణచివేతలకు గురైన కులాలకు సామాజిక న్యాయం సమకూర్చేందుకు రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందని చెప్పారు. బీసీలను అణచివేసే ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై ఈ నెల 22న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న మహమూద్ అసద్ మదని

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లౌకిక వాదుల లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ ఐలాపురం హోటల్‌లో ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని, మత విశ్వాసాలను కాపాడాలనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న రాజ్యసభ మాజీ సభ్యుడు, జమీయతే ఉలమ ఏ హింద్ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమూద్ అసద్ మదని మాట్లాడుతూ..ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లిందన్నారు. మతోన్మాద శక్తులను ఈ దేశం నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ విజయవాడ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు మాట్లాడుతూ..జాతీయ సమగ్రతను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 31న అసెంబ్లీ ముట్టడి

ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల వెల్లడి



మాట్లాడుతున్న రామాంజనేయుల యాదవ్

సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్): సీపీఎస్‌ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 31న అసెంబ్లీని ముట్టడించడానికి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించాయి. విజయవాడలోని హిందీ సేవా సదన్‌లో ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులయాదవ్ మాట్లాడుతూ..సీపీఎస్ రద్దుకు ఈ నెల 26 వరకు ప్రభుత్వానికి అవకాశం ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం దీనిపై నిర్ణయం ప్రకటించని సమయంలో జనవరి 31న అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. వైఎస్సార్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఓబులపతి మాట్లాడుతూ..సీపీఎస్ రద్దుకు ఎన్ని పోరాటాలు చేసినా సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన వారానికే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ప్రకటించినందుకుగాను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏపీసీపీఎస్ఈఏ ప్రధాన కార్యదర్శి పఠాన్ బాజీ మాట్లాడుతూ..తెలంగాణ ఎన్నికల్లో 30 రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని టీడీపీ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిందని ఏపీలో మాత్రం ఈ అంశంపై కమిటీ వేసి కాలయాపన చేస్తుందని మండిపడ్డారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలో ఘటన



లింగాల: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వైఎస్సార్ జిల్లా లింగాల మండలం ఇంటిఓబాయపల్లె గ్రామంలో జరిగింది. రైతు అంకిరెడ్డి సూర్యనారాయణరెడ్డి (54) చీనీ పంట కోసం నాలుగు బోరుబావులు తవ్వించాడు. పెద్ద కుమార్తె సురేఖ వివాహానికి, తనకున్న 18ఎకరాల సాగుకు ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.7లక్షలు అప్పు చేశాడు. బలపనూరు స్టేట్ బ్యాంక్‌లో రూ.3లక్షలు, చిన్నకుడాల సింగిల్ విండోలో రూ.15వేలు పంట రుణాలు తీసుకున్నాడు. నాలుగు బోరుబావుల్లో రెండు ఎండిపోవడం, తీవ్ర వర్షాభావం కారణంగా పంట దిగుబడి సరిగా రాక పోవడంతో అప్పులు తీరే మార్గం కనిపించక మనస్తాపానికి గురై శనివారం రాత్రి చీనీ పంటకు పిచికారి చేసే పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు అతన్ని పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ బ్యాంక్ వడ్డీలకు కూడా సరిపడలేదని కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య అమరావతి, కుమార్తెలు సురేఖ, సుష్మిత ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


పార్టీ కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

- తోలుమందం ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి
- వైద్యమిత్రలు, హెల్త్ సిబ్బందికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా
- ఆదివారం రోజంతా బిజీగా గడిపిన ప్రతిపక్ష నేత
- పులివెందులకు భారీగా తరలి వచ్చిన అభిమానులు, ప్రజలు
- వైఎస్ జగన్‌ను కలిసిన పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు


పులివెందుల పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌ని కలిసి సమస్యను వివరిస్తున్న దివ్యాంగులు

సాక్షి ప్రతినిధి, కడప: ''అన్నా.. ఉద్యోగాలు కోల్పోతున్నాం.. మా కుటుంబాలు వీధిపాలు కానున్నాయి.. పదేళ్లు సేవ చేసినా ఫలితం లేకుండా పోతోంది..'' అంటూ చిరుద్యోగులు, ''రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వేతర రంగ సంస్థల్లో 3 శాతం రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉండగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మమ్మల్ని ప్రోత్సహించండి..'' అంటూ దివ్యాంగులు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదట వాపోయారు. వారి విన్నపాలకు స్పందించిన ప్రతిపక్షనేత.. 'అధైర్యపడొద్దు. అండగా ఉంటాం. తోలుమందం ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి. నిబ్బరంగా ఉండాలి' అని సూచించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందుల కార్యాలయంలో ఆయన విన్నపాలను స్వీకరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఉద్యోగులు, పీహెచ్‌సీ, నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యమిత్రలు, టీం లీడర్లు సంయుక్తంగా కలిసి వారి సమస్యను విన్నవించారు. ''పదేళ్ల పాటు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాం. తక్కువ వేతనాలతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాం. మమ్మల్ని తప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ఎత్తుగడలను ప్రదర్శిస్తోంది. హైకోర్టు అనుకూలమైన తీర్పు వెల్లడిస్తే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అర్హత పరీక్షలు నిర్వహించుకోవాలని సుప్రీం సలహా ఇస్తే ఎలాగైనా ఇంటికి పంపాలని సంబంధం లేని ప్రశ్నలతో పరీక్ష నిర్వహించారు. పూర్తిగా నష్టపోయి మేము, మా కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తోంది. ఇదివరకు పనిచేస్తున్న సిబ్బందినే కొనసాగించాలి'' అని జగన్‌కు విన్నవించుకున్నారు.

ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు..

వైద్య విధాన పరిషత్ కాంట్రాక్టు కార్మికులు మాట్లాడుతూ కేవలం రూ.3,500 వేతనంతో విధులు నిర్వర్తించామని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి 2009 జూన్ 15న విన్నవిస్తే రూ.2 వేలు జీతం పెంచారని, రెగ్యులర్ చేయాలని కోరగా ఏడాది తర్వాత చేస్తామన్నారని తెలిపారు. ఆయన మరణంతో తర్వాతి ప్రభుత్వాలు పట్టించుకోలేదని విన్నవించారు. అలాగే ప్రభుత్వేతర సంస్థలైన ఏపీఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఈబీల్లో దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్లు కేటాయించి, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయించేలా కృషి చేయాలని కారుణ్య డిజేబుల్, ఆర్ఫాన్స్ అండ్ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సభ్యులు కోరారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహక బహుమతిని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచాలని కోరారు. అదేవిధంగా పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇందిరప్రభ, జలసిరి పథకాలల్లో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న జియాలజిస్టులు తమకు రూ.10 వేలు జీతం తగ్గించారని వాపోయారు. బాధితుల ఆవేదనను ఓపిగ్గా విన్న తర్వాత ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని సముదాయించారు. ''రాబోవు రోజుల్లో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, మీకు అండగా నిలుస్తుంది. ఎలాంటి ఆవేదన పెట్టుకోవద్దు'' అని సూచించారు.

హైదరాబాద్‌కు వైఎస్ జగన్

కడప అగ్రికల్చర్: ప్రజా సంకల్పయాత్ర ముగించుకుని వైఎస్సార్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ఆదివారం రాత్రి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పులివెందులలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకుంటూ, సమస్యలు వింటూ బిజీ బిజీగా గడిపిన ప్రతిపక్షనేత.. రాత్రి కడప రైల్వే స్టేషన్‌కు చేరుకుని వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ బయల్దేరారు. రైల్వేస్టేషన్‌కు కడప ఎమ్మెల్యే అంజద్‌బాషా, మాజీ ఎంపీ అవినాష్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త దుగ్గాయపల్లె మల్లిఖార్జునరెడ్డి వచ్చారు.

బిజీ బిజీగా గడిపిన ప్రతిపక్షనేత

పులివెందులలో మూడోరోజు ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బిజీబిజీగా గడిపారు. తన కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచే కార్యకర్తలకు, ప్రజానీకానికి జగన్ అందుబాటులో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. కాగా, నేతలందరితో వైఎస్ జగన్ మమేకమయ్యారు. అనంతపురం, నెల్లూరు జిల్లాల నాయకులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడు నదీంఅహమ్మద్, మాజీ మంత్రులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి, మాజీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కలిశారు. ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, ఎస్‌బీ అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జమ్మలమడుగు సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌రెడ్డి తదితరులు వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు.

ఎమ్మెల్యే బోడెకు సీఎం చీవాట్లు!

- సబ్ కలెక్టర్‌తో దురుసుగా వ్యవహరించిన నేపథ్యం
- పార్టీ పరువు పోయిందని మండిపడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇప్పటికీ కేసు నమోదు చేయని పోలీసులు



పెనమలూరు: అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న సబ్ కలెక్టర్ మీషాసింగ్‌తో కృష్ణాజిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దురుసుగా వ్యవహరించటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు చీవాట్లు పెట్టారని తెలిసింది. అధికారుల పట్ల బోడె ప్రసాద్ ఓవరాక్షన్‌తో పార్టీ పరువు పోయిందని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆదివారం సీఎం కార్యాలయానికి వెళ్లగా సీఎం చాలా అసహనం వ్యక్తం చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే ప్రసాద్ సీఎం ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్రను కలవగా వివాదం సమసిపోవాలంటే జరిమానా కట్టాలని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక ఎమ్మెల్యే ప్రసాద్ విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తాను రైతుల పక్షాన రూ. లక్ష జరిమానా కట్టానని ప్రకటించారు.

వివాదానికి కారణం...

వణుకూరులో పుల్లేరు కట్టను టీడీపీ నేతలు ఆక్రమించి ప్రొక్లయినర్‌తో అక్రమంగా మట్టి తవ్వకాలు చేయటం వివాదంగా మారింది. ఈ తవ్వకాలను సబ్‌కలెక్టర్ మీషాసింగ్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు అడ్డుకోగా, అక్రమార్కులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అధికారులు సీజ్ చేసిన ప్రొక్లయినర్‌ను బలవంతంగా తీసుకు వెళ్లారు. సమాచారం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ మీషాసింగ్ సీజ్ చేసిన ప్రొక్లయినర్ అప్పగించాలని, రూ 2 లక్షల జరిమానా కట్టాలని అన్నారు. ఆమె శనివారం నేరుగా పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ప్రొక్లయినర్‌ను అప్పగించాలని అడిగారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే మహిళా ఐఏఎస్ అధికారిణితో దురుసుగా వ్యవహరించారు.

నాటకీయ పరిణామాలతో రాజీ..

ఎమ్మెల్యే బోడెప్రసాద్ వివాదంలో ప్రభుత్వం పరువు పోయే విధంగా ఉండటంతో పెద్దలు రాజీ చేశారు. ప్రొక్లయినర్ అప్పగించకుండానే రూ. 2 లక్షలకు బదులు రూ. లక్ష జరిమానా కట్టించారు. ఎమ్మెల్యే వైఖరిపై పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు కాకుండా చూశారు. టీడీపీ పరువు బజారున పడకుండా వివాదాన్ని ముగించారు. జరిమానా విషయమై తహసీల్దార్ మురళీకృష్ణను వివరణ కోరగా జరిమానా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చెల్లించినట్టు తనకు సమాచారం ఇచ్చారని అన్నారు.

రశీదులపై ప్రచారం పేరుతో భారీ దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఏజెన్సీకి రూ.11.32 కోట్ల చెల్లింపులు
- కమిషనర్ కనుసన్నల్లో అవినీతి జరిగిందంటున్న సమాచార శాఖ ఉద్యోగులు

సాక్షి, అమరావతి: ప్రచారం మాటున ప్రజాధనాన్ని టీడీపీ సర్కారు స్వాహా చేస్తోంది. ఈ–సేవ రశీదులపై ముఖ్యమంత్రి చంద్రబాబు బొమ్మ ముద్రించిన వ్యవహారంలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని సమాచార శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారం అంతా కేవలం కమిషనర్ ఒక్కరే నడిపారని, సంబంధిత ఫైళ్లపై ఆయన సంతకం ఒక్కటే ఉందని అంటున్నారు. మీ–సేవ కేంద్రాల్లో ఏపీ ఆన్‌లైన్ రశీదుల వెనుక సీఎం బొమ్మతోపాటు సంక్షేమ పథకాల సమాచారాన్ని ముద్రించి, ప్రచారం చేయాలని సమాచార శాఖ కమిషనర్ నిర్ణయించారు. వీటిని ముద్రించే పనిని వన్‌స్టాప్ అడ్వర్‌టైజ్‌మెంట్ ఏజెన్సీకి ఏకపక్షంగా అప్పగించారు. రాష్ట్రంలోని 2,271 మీ–సేవా కేంద్రాలకు సీఎం బొమ్మతో కూడిన రశీదులను పంపిణీ చేసేందుకు కేవలం ఐదు నెలలకు గాను ఏకంగా రూ.11.32 కోట్లను ప్రైవేట్ ఏజెన్సీకు అప్పగించేశారు. గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో సీఎం బొమ్మతో కూడిన రశీదులు ముద్రించి ఇచ్చినందుకు రూ.4.95 కోట్లు కమిషనర్ చెల్లించారు. నెలకు 120 లక్షల చొప్పున రెండు నెలల్లో 240 లక్షల రశీదులను ముద్రించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. అలాగే గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు గాను మరో రూ.6.37 కోట్లు చెల్లించేశారు. ఇక్కడ కూడా నెలకు 120 లక్షల రశీదులు చొప్పున మూడు నెలల్లో 360 రశీదులను ముద్రించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఔట్‌డోర్ పబ్లిసిటీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఈ రశీదుల ముద్రణను కమిషనర్ చేపట్టారని అధికారులు అంటున్నారు. కమిషనర్ ఏకపక్షంగా చేశారని, అసలు ఇన్ని లక్షల రశీదులు ముద్రించారా? లేదా? అనే తనిఖీ ఏమాత్రం జరగలేదని, సమాచార శాఖలో ఇందుకు సంబంధించిన ఫైళ్లను ఎవ్వరికీ పంపించకుండా అంతా కమిషనరే చూసుకున్నారని ఆ శాఖ ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందులో అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ రశీదుల ముద్రణలోనే సగానికి సగం సొమ్మును కమిషనర్ కాజేశారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వంలో ఏ పని చేయాలన్నా బిజినెస్ రూల్స్ మేరకు ఏదైనా దరఖాస్తు వచ్చినా ఏ పనినైనా ఎవ్వరికైనా అప్పగించాలన్నా అనేక దశల్లో ఫైళ్లు నడుస్తాయని, కానీ ఇందుకు సంబంధించిన ఫైళ్ళలో కేవలం కమిషనర్ సంతకం మాత్రమే ఉందని చెబుతున్నారు. ఈ రశీదుల ముద్రణలోనే సగానికి సగం సొమ్మును కమిషనర్ కాజేశారని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కమిషనర్ నిత్యం సీఎంవోలోనే ఉంటారని, ఈ వ్యవహారాలన్నీ అక్కడ నుంచే చక్కపెడుతున్నారని, ఎవ్వరూ ఏమీ అనలేని పరిస్థితి నెలకొందని ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

పల్లె పులకింత

ఎన్నాళ్ల నిరీక్షణో ఇది.. సంక్రాంతి రూపంలో ఫలించింది. బతుకుపోరులో సుదూరాలకు తరలి వెళ్లిన తన బిడ్డ పాదాన్ని పల్లెతల్లి మళ్లీ సుతారంగా ముద్దాడింది. ఏడాదికోసారి ఊరికి ఉత్సవాన్ని తెస్తున్న ఆ బిడ్డను చూసి పులకించిపోయింది. ఉద్వేగంతో గుండెలకు హత్తుకుంది. పుట్టి పెరిగిన నేలపైకి కాలుమోపగానే.. ఆ బిడ్డకూ ఏదో నూతనోత్తేజం. పైరగాలి తాకి తనువు పరవశించింది. పచ్చదనాన్ని పరుచుకున్న పొలాల్ని చూసి హృదయం ఉప్పొంగింది. ఓ వైపు.. పక్షుల కిలకిలారావాలు.. ఎక్కడో సుదూర తీరాన చెట్టుపై నుంచి లీలగా వినిపిస్తున్న కోయిలమ్మ కూనిరాగాలు. ఏహే... అంటూ ముల్లుగర్రతో ఎద్దును అదిలిస్తున్న రైతన్న కేకలు.. మరోవైపు.. ఇళ్ల ముందు రంగవల్లులు.. ఆ ముగ్గుల సిగలో గుమ్మడి పువ్వులతో ముస్తాబైన గొబ్బెమ్మలు.. పలుకే బంగారమాయెరా కోదండరామా.. అంటూ వీధుల్లో వీనుల విందుగా భక్తిపారవశ్యంలో తేలియాడిస్తున్న హరిదాసు కీర్తనలు.. లంగాఓణీల్లో పల్లె పడుచుల కేరింతలు.. పిండివంటల ఘుమఘుమలు.. పేక ముక్కల కోతలు.. కోడి పందేలు..

- సంక్రాంతికి సొంతూళ్లకు పట్టణవాసులు
- కుటుంబ సమేతంగా విదేశాల నుంచి కూడా రాక
- ఇళ్ల ముందు రంగవల్లులు, పూలతో ముస్తాబవుతున్న గొబ్బెమ్మలు
- గ్రామాల్లో సందడే సందడి..
- ఊపందుకుంటున్న కోడి పందాలు, ప్రభల తీర్థాలకు సిద్ధం
- బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ఇంకా కొనసాగుతున్న రద్దీ

అమలాపురం: గ్రామాల్లో ఎటు చూసినా సంక్రాంతి సందడే కనిపిస్తోంది. ఉపాధి, ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లినవారు... వేలాది రూపాయల ప్రయాణ భారాన్ని లెక్కచేయకుండా సొంత ప్రాంతాలకు తరలివస్తున్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో పట్టణవాసులు తమ సొంతూళ్లకు చేరుకున్నారు. చివరి నిమిషంలో బయలుదేరిన వారితో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ఇంకా కిటకిటలాడుతూనే ఉన్నాయి. బస్సులు, విమాన చార్జీలను ఒక్కసారిగా పెంచేయడంతో హైదరాబాద్, చెన్నై, విశాఖ వంటి నగరాల్లో ఉన్న వారు సొంతకార్లలో ఊళ్లకు చేరుకుంటున్నారు. ఆస్ట్రేలియా, అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాల్లో ఉన్న వారు సైతం కుటుంబ సమేతంగా సంక్రాంతి సంబరాలు జరుపుకొనేందుకు రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. విజయవాడ, గుంటూరు, తిరుపతి, అనంతపురం, రాజమహేంద్రవరం, విశాఖ.. ఇలా నగరాలు, పట్టణాలన్నీ నూతన వస్త్రాలు కొనుగోలు చేసేవారితో కిటకిటలాడుతుంటే సోమవారం భోగి పండుగ కావడంతో గ్రామాల్లో పండగ సందడి పతాక స్థాయికి చేరింది. ఆడపడుచులు ఇళ్ల ముంగిట ముగ్గులతో పోటీ పడుతుంటే మగవారి కోసం కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి.

ప్రభల తీర్థం ప్రత్యేకం


తూర్పుగోదావరి అనగానే గుర్తుకొచ్చేది ప్రభల తీర్థం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కోనసీమలో సంక్రాంతి పండుగ మూడురోజులూ పెద్ద ఎత్తున ప్రభల తీర్థాలు జరుగుతాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, కృష్ణా జిల్లా కైకలూరు వంటి ప్రాంతాల్లో అక్కడక్కడా చిన్న చిన్న తీర్థాలు జరిగినా.. ఒక్క కోనసీమలోనే 90 వరకు తీర్థాలు జరుగుతాయి. వీటి నిర్వహణలో కోనసీమ సంప్రదాయం ఉట్టిపడుతుంది. అంబాజీపేట మండలం జగ్గన్నతోట, కొత్తపేట, మామిడికుదురు మండలం కొర్లగుంటల్లో జరిగే ప్రభల తీర్థాలకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉంది. వేలాదిమంది భక్తులు తరలివస్తారు. ఎన్ఆర్ఐలు, ఇతర ప్రాంతాలకు వలసపోయిన వారు ఈ తీర్థాలకు తప్పనిసరిగా హాజరవుతుంటారు. 20 అడుగుల వెడల్పు, 42 అడుగుల ఎత్తున భారీ ప్రభలను తయారుచేసి కుల, మతాలకు అతీతంగా భక్తులు తీర్థాలకు తరలించుకొస్తారు. పంటపొలాలు, పంట బోదెలు, కౌశికలు దాటుకుని ప్రభలు వచ్చే తీరు అద్భుతంగా ఉంటుంది. కోడి పందేలు ఇప్పటికే జరుగుతుండగా.. పండుగ వేళ భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోడి పందేలకు అనుమతిచ్చేది లేదని పోలీసులు చేస్తున్న హెచ్చరికలను నిర్వాహకులు లెక్కచేయడం లేదు. బరులు సిద్ధం చేస్తున్నారు. కోడిపందేలతో పాటు పొట్టేలు పందేలు, గుండాటలకు సైతం రంగం సిద్ధమైంది.


తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురంలో సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న ప్రజలు.


రాజమహేంద్రవరంలో పల్లె పడుచుల సంక్రాంతి సందడి

అగ్రి బాధితుల వివరాలు తారుమారు చేసే పనిలో ప్రభుత్వం

- 19 లక్షల మంది బాధితులున్నారని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం
- 10 లక్షల మందేనని చెబుతున్న కుటుంబరావు
- త్వరలో గ్రామాల వారీగా బాధితుల వివరాలు సేకరిస్తాం
- అగ్రిగోల్డ్ బాధిత బాసట కమిటీ కోఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి



సాక్షి, గుంటూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారుల వివరాలు బయట పెట్టాలని వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం జాబితాను బయట పెట్టడం లేదని, పాలకుల తీరు చూస్తుంటే బాధితుల వివరాలు తారుమారు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు అనుమానాలున్నాయని అగ్రిగోల్డ్ బాధిత బాసట కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. గుంటూరు పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో 19 లక్షలకు పైగా అగ్రిగోల్డ్ బాధితులు రాష్ట్రంలో నమోదయ్యారని చెప్పారని, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు మాత్రం 10 లక్షల మంది బాధితులున్నారని చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచే బాధితుల వివరాల్లో స్పష్టత లేదని ఆరోపించారు. అధికారం ఉందని ప్రభుత్వం బాధితుల జాబితా తారుమారు చేయాలని చూస్తే వైఎస్సార్‌సీపీ ఊరుకోదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో గ్రామాల వారీగా అగ్రిగోల్డ్ బాధితుల జాబితాను త్వరలో తయారు చేస్తామన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో మనోధైర్యం నింపడానికి ఈనెల 20న రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో బాధితులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలోనే అగ్రిగోల్డ్ బాధిత బాసట కమిటీ సంఘాల పెద్దలందరూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో భేటీ నిర్వహిస్తామన్నారు.

'షార్'కు చేరుకున్న మైక్రోశాట్–ఆర్ ఉపగ్రహం


బెంగళూరు నుంచి షార్‌కు వెళుతున్న ఉపగ్రహం

శ్రీహరికోట(సూళ్లూరుపేట): నెల్లూరు జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈనెల 24న నిర్వహించనున్న పీఎస్ఎల్‌వీ సీ44 ప్రయోగానికి సంబంధించి మైక్రోశాట్–ఆర్ అనే ఉపగ్రహం ఆదివారం షార్‌కు చేరుకుంది. బెంగళూరులోని యూఆర్ శాటిలైట్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం బయల్దేరిన ఈ ఉపగ్రహం ఆదివారం సాయంత్రానికి షార్‌కి చేరుకుంది. మొదటి ప్రయోగవేదికపై పీఎస్ఎల్‌వీ సీ44 రాకెట్ అనుసంధానానికి సంబంధించి నాలుగుదశల పనులను పూర్తి చేశారు. ఈ వారంలోనే రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాన్ని అమర్చేందుకు సిద్ధమవుతున్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ

గూడూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు సబ్ జైల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రిమాండ్‌లో ఉన్న ఖైదీ పరారయ్యాడు. తడ మండలం కొండూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌పై తడ పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు నమోదైంది. గతేడాది డిసెంబర్‌లో రిమాండ్ నిమిత్తం అతడిని గూడూరు సబ్ జైలుకు తీసుకొచ్చారు. అయితే కొద్ది రోజులుగా జైల్ సూపరింటెండెంట్ రామారావు సెలవులో ఉన్నారు. ఈ క్రమంలో విజయ్‌కుమార్ జైలు నుంచి పరారయ్యాడు. దీంతో జైళ్ల శాఖ డీఎస్పీ హంసపాల్ గూడూరు సబ్ జైలుకు చేరుకుని ఖైదీ పరారీపై విచారణ చేపట్టారు. ఖైదీ సబ్ జైలు గేటు నుంచి పారిపోయే అవకాశం లేదని, అయితే జైలు నుంచి ఎలా తప్పించుకున్నాడో తెలియాల్సి ఉందన్నారు. జైలు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఖైదీ పరారయ్యాడని, ఆ సమయంలో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌తోపాటు, కానిస్టేబుల్ విజయపై సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిపారు.

మా దేవుడు వైఎస్సార్!

పెద్దల పండుగనాడు వైఎస్సార్‌కి బట్టలు పెట్టనున్న వృద్ధురాలు



వైఎస్సార్ చిత్రపటాన్ని శుభ్రం చేస్తున్న ధనమ్మ

అన్నమయ్య సర్కిల్: ఆ వృద్ధురాలు తన ఇంట్లో దేవుడి చిత్రపటాలతో పాటు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాన్ని ఉంచి నిత్యం పూజలు చేస్తుంటుంది. అంతేకాకుండా ప్రతి సంక్రాంతికి తన ఇంటి పెద్దలతో పాటు వైఎస్సార్‌కి కూడా కొత్త బట్టలు పెట్టి మొక్కుతుంటుంది. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వేనూతనపల్లి గ్రామానికి చెందిన ధనమ్మ (75) ఆదివారం తన నివాసం ముందు దేవుని పటాలతో పాటు వైఎస్సార్ చిత్ర పటాన్ని శుభ్రం చేస్తుండగా ఆమెను 'సాక్షి' పలకరించింది. 'మా ఇంటి దేవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి. మేము కూలీ చేసుకుని బతికేటోళ్లం. రెక్కాడితే కానీ ముద్ద దిగదు. నా భర్త మునుస్వామికి అనుకోకుండా మోకాళ్ల నొప్పులు రావడంతో మంచం పట్టాడు. ఆ సమయంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నాము. మాకు పింఛన్ మంజూరు చేసి దాంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కూడా ఇచ్చారు. ఆ దేవుడు ఇచ్చిన ఇంటిలో తలదాచుకుంటూ బతుకుతున్నాము. పదో తరగతి వరకు చదివిన నా కొడుకు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వైఎస్సార్ చనిపోయాక మళ్లీ మాకు కష్టాలు మొదలయ్యాయి. ఐదేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. మళ్లీ ఆ దేవుడు రూపంలో ఆయన కొడుకు వైఎస్.జగన్ వస్తే మా బతుకుల్లో వెలుగు వస్తుందని ఆశతో జీవిస్తున్నాం. ప్రతి సంక్రాంతికి మా పెద్దలతో పాటు వైఎస్ రాజశేఖరరెడ్డికి కొత్తబట్టలు పెట్టి మొక్కుతుంటాము. అందుకే ఆ దేవుడి ఫొటో శుభ్రం చేస్తున్నా'. అని ధనమ్మ తెలిపింది.

దుర్గమ్మ సేవలో జస్టిస్ శివశంకర్



జస్టిస్ శివశంకర్‌కు ఆలయ క్యాలెండర్‌ను అందచేస్తున్న వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం జస్టిస్ శివశంకర్‌కు వేద పండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ సూపరింటెండెంట్ హేమాంబ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి అమ్మవారి చిత్రపటం, క్యాలెండర్ అందచేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి



సంగం హైవే పక్కన మృతదేహాలు



విశాఖలో మృతి చెందిన యువకులు



పెద్ద దోర్నాలలో లోయలో పడ్డ బస్సు

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ముగ్గురు మృత్యువాత
- విశాఖలో ఇద్దరు యువకుల దుర్మరణం

సంగం/పెద్దదోర్నాల/ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): రాష్ట్రంలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాతపడ్డారు. లారీని బైక్ ఢీకొన్న ఘటనలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ముగ్గురు దుర్మరణం చెందగా..డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు విశాఖలో మృతి చెందారు. నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన పంచాయతీ మజారా గ్రామమైన జంగాలదొరువుకు చెందిన సంకె వెంకటేశ్వర్లు (30) హైదరాబాద్‌లో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తున్నాడు. భోగి పండగకు భార్య శిరీష, కుమార్తె కీర్తనతో కలిసి తన స్వగ్రామమైన జంగాలదొరువుకు వెంకటేశ్వర్లు ఇటీవల వచ్చాడు. ఆదివారం ఉదయం తన స్నేహితులైన విడవలూరు మండలం నార్తురాజుపాళేనికి చెందిన నన్నేసాహెబ్ (40), రాము (40)తో కలిసి బైక్‌పై వెంకటేశ్వర్లు నెల్లూరు వైపునకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొగ్గు లారీని ఢీ కొట్టాడు. ప్రమాదంలో వెంకటేశ్వర్లు, నన్నేసాహెబ్, రాములు అక్కడికక్కడే మృతి చెందారు. విశాఖ తీర ప్రాంతం రుషికొండ రోడ్డుపై స్పోర్ట్స్ బైక్‌పై అతివేగంగా వచ్చి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో విశాఖ జాలరి ఎండాడకు చెందిన దేశయ్య (18), అప్పుఘర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. జాలరిపేటకి చెందిన సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.

శ్రీశైలం ఘాట్‌లో తప్పిన పెను ప్రమాదం..

వేగంగా వెళ్తూ అదుపు తప్పిన ఓ ప్రైవేట్ స్లీపర్ కోచ్ బస్సు లోయలోకి దూసుకుపోయిన ఘటన శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని దెయ్యాల మలుపులో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో బస్సులో వెనుక కూర్చున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని పర్లి నుంచి 42 మంది యాత్రికులతో గత డిసెంబర్ 31న తీర్థయాత్రలకు బయలుదేరిన బస్సు తిరుపతి, మహానంది పుణ్యక్షేత్రాల పర్యటన అనంతరం ఆదివారం వేకువజామున శ్రీశైలానికి బయలుదేరింది. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రకాశం జిల్లా దోర్నాల–చిన్నారుట్ల మధ్య ఉన్న దయ్యాల మలుపులో బస్సు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. బస్సు ముందు భాగం లోయలోని కొండ అంచుకు తాకింది. రక్షణ గోడలు బస్సు వేగాన్ని నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

ద్వారకా తిరుమలలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

స్వాగతం పలికిన టీడీపీ జిల్లా కార్యదర్శి




పూజలు చేస్తున్న టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావు. వెనుక టీడీపీ జిల్లా కార్యదర్శి సోంబాబు

ద్వారకాతిరుమల: పశ్చిమగోదావరి జిల్లా చినతిరుపతికి ఆదివారం వచ్చిన కూకట్‌పల్లి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు టీడీపీ జిల్లా కార్యదర్శి సోంబాబు స్వాగతం పలకడం క్షేత్రంలో చర్చనీయాంశమైంది. గత ఎన్నికల్లో కూకట్‌పల్లి నుంచి టీడీపీ తరఫున నందమూరి సుహాసిని పోటీ చేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గాన్ని టీడీపీ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సుహాసినిని ఓడించిన టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావు చినతిరుపతికి వచ్చిన సందర్భంలో ఆయన వెంట ఉండి టీడీపీ నేత సోంబాబు దర్శనం చేయించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. తెలంగాణ ఎన్నికల్లో చంద్రబాబు టీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం, దాన్ని జీర్ణించుకోలేని కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబుపై నిప్పులు చెరగడం తెలిసిందే. టీడీపీ, టీఆర్‌ఎస్‌లు ఇలా ఒకరిపై ఒకరు భగ్గుమంటుంటే ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావుకు టీడీపీ జిల్లా నేత సోంబాబు అడుగులకు మడుగులొత్తడం ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అధిష్టానం, ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే సోంబాబు ఇలా టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

● ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏ దర్యాప్తు చేస్తుండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు భయం పట్టుకుందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్ బాషా అన్నారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే ముస్తఫాతో కలిసి ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు.

సాక్షి
సాహిత్యం
sakshisahityam@gmail.com
విజయవాడ । సోమవారం । జనవరి । 14 । 2019





ఫణీశ్వర్‌నాథ్ రేణు

ఫణీశ్వర్‌నాథ్ రేణు (1921-1977) హిందీ కథ 'సందేశ వాహకుడు' ఇది. 1962లో రాసిన దీన్ని తెలుగులోకి పి.విజయరాఘవ రెడ్డి అనువదించారు. ఫణీశ్వర్‌నాథ్ బిహార్‌లో జన్మించారు. ప్రేమ్‌చంద్ అనంతర హిందీ సాహిత్యంలో ప్రభావశీల రచయితగా గుర్తింపునొందారు. మైలా ఆంచల్ ఆయన ప్రసిద్ధ నవల. బాసు భట్టాచార్య 'తీస్రీ కసమ్' సినిమాకు రేణు కథ ఆధారం. సందేశ వాహకుడు సంక్షిప్తం: సాహిత్యం డెస్క్.

గాలి సందేశం

కథాసారం



ఈ కాలిబాటనే పెద్దకోడలు అమ్మోరింటికి వస్తుంది. మరి యెప్పటికీ తిరిగి రాదు! ఇక ఊళ్లో మిగిలిందేమిటి? గ్రామలక్ష్మియే గ్రామాన్ని విడిచి వెళ్లిపోతే! లక్ష్మీదేవి చేత కంటతడి పెట్టించే ఊరు ఒక ఊరేనా!

హరగోబిన్‌కు ఆశ్చర్యం కలిగింది– ఈ రోజుల్లో కూడా సందేశ వాహకుని అవసరం ఉందన్నమాట! నేడు పల్లెపల్లెకూ పోస్టాఫీసు ఉంది. సందేశ వాహకుని ద్వారా సందేశం పంపించాల్సిన పనేముంది?

హరగోబిన్ పెద్ద హవేలి విరిగిన ద్వారం దాటుకొని లోపలికెళ్లాడు. పరిస్థితిని పసిగట్టి సందేశం ఏమయివుంటుందో అంచనా వేసుకోగలిగాడు– జరూరుగా ఏదో గోపితమైన సందేశం తీసుకెళ్లాల్సి ఉంటుంది. సూర్య చంద్రాదులకు కూడా తెలియనట్టిది.

''కాల్ మొక్కతా పెదరాణీ గారూ!''

పెద్ద హవేలీ పెద్ద కోడలు హరగోబిన్‌ను చూసింది. కొంతసేపు కూర్చోమని సైగ చేసింది. పెద్ద హవేలి ఒకప్పుడు నౌకర్లూ– చాకర్లూ, కూలీ–నాలీ జనాలతో నిండి ఉండేది. ఈ రోజు పెద్దకోడలు తన చేతుల్తో చాటబట్టి ధాన్యం చెరుగుతూ ఉంది.

పెద్దన్నయ్య చచ్చిపోతూనే నాటకమే ముగిసింది. ముగ్గురు అన్నదమ్ముళ్ల మధ్య గొడవలు మొదలయ్యాయి. రైతులు దావావేసి భూమిని దఖలు పర్చుకున్నారు. ముగ్గురన్న దమ్ముళ్లూ ఊరు వదలి పట్నం చేరుకొన్నారు. మిగిలింది పెద్దకోడలే– పాపం! భగవంతుడు మంచివాళ్లకే కష్టాలు కలిగిస్తాడు. లేకపోతే జబ్బు సోకిన గంటలోనే పెద్దన్నయ్య ఎందుకు చనిపోతాడు? పెద్దకోడలు ఒంటిమీదున్న నగానట్రా లాగేసుకొని పంచుకొన్నారు. హరగోబిన్ తన కళ్లతో చూశాడు ద్రౌపదీ వస్త్రాపహరణ లీలను. బెనారసీ చీరను మూడు ముక్కలు చేసుకొన్నారు!

కిరాణాకొట్టు ముసల్ది ఎప్పుడు వచ్చి ఇంటి ముందు కూర్చుందో, ఏదోదో వాగేస్తుంది. ''అప్పు తీసుకొని తిన్న సరుకేమో తియ్యగా ఉంటుంది. డబ్బులివ్వాలంటే మాత్రం చేదు.''

పెద్దకోడలు బదులు మాట్లాడలేదు. హరగోబిన్ నిట్టూర్చాడు. కిరాణాకొట్టు ముసల్ది వరండా దాటేంతవరకు పెద్దకోడలు ఏమీ మాట్లాడదు. ఇక నోరు మూసుకొని ఉండలేకపోయాడు. ''పిన్నీ, బాకీ వసూలు చేయటంలో నీవు కాబూలీవాణ్ని కూడా తలదన్నగలవు.''

''నోర్ముయ్! పేడె మూతోడా... కాబూలీ పేరెత్తావంటే నీ నాలుక పీకేస్తా.''

హరగోబిన్ నాలుక చాచి చూపించాడు. ముసల్ది తిట్టుకుంటూ వెళ్లిపోయింది.

''హరగోబిన్ బాబూ, నీవు ఓ మాట చెప్పి రావాలి. ఈ రోజే. చెప్పు, వెళ్లగలవా?''

''ఎక్కడికి?''

''మా అమ్మ గారింటికి.''

కళ్లనీళ్లు నింపుకొన్న పెద్దకోడలి వైపే చూస్తూ– ''ఇంతకీ సందేశం ఏమిటి?''

సందేశం చెబుతూ పెద్దకోడలు వెక్కిళ్లు బెట్టి ఏడ్చింది. ''పెదరాణీ గారూ! గుండెను దిటవు చేసుకోండి.''

''ఇంకా ఎంత గట్టిపర్చుకోమంటావు? అమ్మతో చెప్పు నేను అన్నా వదినలకు సేవచేసి పొట్ట పోసుకుంటానని. పిల్లోళ్ల ఎంగిలి మెతుకులు తిని ఓ మూల పడివుంటాను. ఇంకా ఇక్కడే మాత్రం ఉండలేను. చెప్పు, అమ్మ నన్ను ఇక్కడి నుండి తీసుకెళ్లకపోతే ఏదో ఒకరోజు మెళ్లో నీళ్లకడవ తగిలించుకొని చెర్లో పడి చస్తానని చెప్పు. ఆకులు అలములు తిని ఎంతకాలం బతగ్గలను?''

మరుదులూ, తోటి కోడళ్లూ ఎంత కఠినాత్ములు. సరిగ్గా వరికోతల సమయానికి పట్నం నుండి దిగుతారు. పదిహేను రోజుల్లో అప్పులూ సప్పులూ లెక్కేసుకొని తిరిగి వెళ్లేప్పుడు రెండు రెండు మణుగుల బియ్యం, అటుకులు తీసుకెళ్తారు. ఇక తిరిగి చూస్తే ఒట్టు!

పెద్ద కోడలు కొంగుకు వేసిన ముడి విప్పి నలిగిన ఐదు రూపాయల నోటు తీసింది– ''కనీసం దారి ఖర్చుకయ్యే మాత్రమైనా జమ చేయలేకపోయాను. తిరిగి రావటానికయ్యే ఖర్చు అమ్మ నడిగి తీసుకో. వస్తే అన్నయ్య నీతో పాటే రావచ్చు.''

''పెదరాణీ గారూ! దారి ఖర్చులకు ఇవ్వాల్సిన అవసరం లేదు. నేను ఈ రోజు పదిగంటల బండికి వెళుతున్నా.''

పెద్దకోడలు చేతిలో నోటు పట్టుకొని శూన్యదృక్కులతో హరగోబిన్‌ను చూస్తుండిపోయింది.

సందేశాన్ని చేరవేసే కార్యాన్ని అందరూ చేయలేరు. మనిషి భగవంతుని ఇంటినుంచి సందేశ వాహకునిగా మారి వస్తాడు. చెప్పిన మాట పొల్లుపోకుండా మదిలో వుంచుకోవాలి.

బండి ఎక్కుతూనే హరగోబిన్‌కు సందేశంలోని ప్రతి మాట మనసులో గుచ్చుకుంటోంది. ఎవర్ని నమ్ముకొని ఇక్కడుండాలి?

హరగోబిన్ పక్కసీటులో వ్యక్తిని అడిగాడు– ''థానా బిహపూర్‌లో బండి ఆగుతుందా లేదా?''

''థానా బిహపూర్‌లో అన్ని బళ్లూ ఆగుతాయి'' విసుగ్గా సమాధానం చెప్పాడు. ఇతడితో బాతాఖానీ పనికి రాదు. మళ్లీ సందేశాన్ని తల్చుకొన్నాడు. మధ్య మధ్యలో ఎక్కడెక్కడేడ్చిందో తనూ ఏడ్వాలా?

బండి కటిహార్ జంక్షన్ చేరగానే మైకులో మాటలు విన్పిస్తున్నాయి. ''హరగోబిన్ బాబూ! అమ్మతో చెప్పు, దేవుడు చిన్నచూపు చూశాడని.''

అతడి కాళ్లు పల్లెవైపు సాగడం లేదు. ఈ కాలిబాటనే పెద్దకోడలు అమ్మోరింటికి వస్తుంది. మరి యెప్పటికీ తిరిగి రాదు! ఇక ఊళ్లో మిగిలిందేమిటి? గ్రామలక్ష్మియే గ్రామాన్ని విడిచి వెళ్లిపోతే! లక్ష్మీదేవి చేత కంటతడి పెట్టించే ఊరు ఒక ఊరేనా!

హరగోబిన్‌ను వూరి వాళ్లు గుర్తుపట్టారు– జలాలాగఢ్ వూరి సందేశవాహకుడు ఏ సందేశం తీసుకొచ్చాడో మరి!

''రామ్‌రామ్ భాయీ! చెప్పు అంతా క్షేమమే కదా? అటువైపు వానచినుకులు పడ్డాయా?''

కాళ్లు చేతులు కడుక్కున్న తర్వాత హరగోబిన్‌ను పిలిపించారు. అతడి గుండె వేగంగా కొట్టుకో సాగింది. ముసలి తల్లి అడిగింది – ''చెప్పు బాబూ, ఏదైనా సందేశం?''

''నేను నిన్న సరసియా గ్రామమొచ్చాను. ఇంత దూరం వచ్చాను కదా అని మీ దర్శనం చేసుకొని పోదామని.''

ముసలి తల్లి దిగులు చెందింది. ''నేను బాబుతో చెబుతూనే వున్నాను, వెళ్లి అక్కయ్యను తీసుకురా, ఇక్కడే వుంటుందీ అని. అక్కడ ఇంకా ఏం మిగిలింది?''

''లేదు తల్లీ! ఆస్తిపాస్తులకు కొదవేమీ లేదు. పోతే ఆర్భాటాలు లేవు. పెద్దకోడలికి ఊరంతా తన కుటుంబమే.''

ముసలి తల్లి టిఫిన్ తెచ్చి పెట్టింది. పప్పు, అన్నము, కూరలు, నెయ్యి, అప్పడం, ఊరగాయ...

''ఏమిటి బాబూ, భోంచెయ్యడం లేదు?''

''తల్లీ కడుపునిండా టిఫిన్ తిన్నానుగదా!''

''అరె, వయసులో వున్న మగాడికి, అయిదు సార్లు టిఫిన్ తిన్నా గిన్నెడు కూడు యేమాత్రం?''

సాధారణంగా సందేహ వాహకుడు కడుపారా తిని, కన్నారా నిద్రపోతాడు. తను ఇక్కడికి వచ్చిన పనేమిటి? తను అబద్ధ మాడటం దేనికి?

రాత్రంతా హరగోబిన్ కంటికి కునుకు లేదు. ఉదయాన్నే గుండెదిటవు పరుచుకున్నాడు. తను కేవలం సందేశ వాహకుడు. ఉన్నది ఉన్నట్లు చెప్పడమే తన పని. ముసలి తల్లి దగ్గరికెళ్లి కూర్చున్నాడు.

''అమ్మగారూ, నేను ఈ రోజే వెళ్లిపోతున్నా.''

''తొందరెందుకు, రెండ్రోజులుండి వెళ్లు.''

''లేదమ్మగారూ, ఈసారికి సెలవిప్పించండి. దసరాకు పెద్దకోడలితోపాటు నేనూ వస్తాను.''

''అంత త్వరగా వెళ్లాల్సివుంటే ఎందుకొచ్చినట్లు? కూతురికి పెరుగు–అటుకులు పంపిద్దామనుకున్నా. పెరుగు ఈరోజుకు దొరకదు. కొద్దిగా అటుకులున్నాయి, తీసుకెళ్లు.''

ముంగిలి దాటి వెళుతూంటే పెద్ద అన్నయ్య అడిగాడు– ''దారి ఖర్చులకు డబ్బుందా?''

''మీ ఆశీర్వాదాల వల్ల దేనికీ కొదవలేదు.''

స్టేషన్ చేరుకొని హరగోబిన్ లెక్కవేశాడు. కటిహార్ వరకు టికెట్టు కొనగలడు. ఒకవేళ పావలాకాసు చెల్లకపోతే సైమాపూర్ వరకే వెళ్లగలడు.

బండిలో కూర్చుంటూనే– తను ఎందుకు వచ్చినట్టు? ఏం చేసుకుని వెళుతున్నట్టు?

ఉదయం అయిదు గంటలకు కటిహార్ స్టేషనుకు చేరుకున్నాడు. జలాలాగఢ్! ఇరవై కోసులు! పెద్దకోడలు ఎదురు చూస్తుంటుంది.

మహా వీర విక్రమ బజరంగ్ నామం జపిస్తూ నడక సాగించాడు. ఓ పెద్ద గ్రామంలో ఆగి కడుపు నిండా నీళ్లు తాగాడు. చంకలో వున్న పొట్లాన్ని తీసి వాసన చూశాడు. అబ్బ! బాస్‌మతీ అటుకులు. కూతురి కోసం తల్లి కానుక. వద్దు, తాను ఇందులోంచి పిడికెడు కూడా తీసి తినలేడు. పెద్దకోడలికి ఏమని జవాబు చెప్పగలడు. పదిహేను కోసులు! అమ్మతో చెప్పు. ఇక బతకనని చెప్పు. జలాలాగఢ్ స్టేషన్ సిగ్నల్ కనిపిస్తోంది. తను ఆగిపోయాడా లేక నడుస్తున్నాడా?

''పెదరాణీ''

తాను పక్క మీద పడివున్నాడు.

''హరగోబిన్ బాబూ, నీ వంట్లో ఎలా ఉంది? గుటికెడు నీళ్లు తాగు... నోరు తెరు... ఆ... తాగు, తాగు!''

''మీరు వూరు విడిచి వెళ్లొద్దు. నేనే నీ కొడుకును. నీవే మా అమ్మవు.''

పెద్దకోడలు వేడిపాలలో పిడికెడు బాస్‌మతీ అటుకులు వేసి కలిపింది.

సందేశం పంపినప్పటినుండీ ఆమె తన తప్పును తెలుసుకొని పశ్చాత్తాపం చెందసాగింది.

అన్నంభట్టును ఇవతలకు తెండి!

సాహిత్య మరమరాలు



తర్కసంగ్రహం అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించిన 'మహామహోపాధ్యాయ' అన్నంభట్టు క్రీ.శ. 17వ శతాబ్దం ఉత్తరార్ధంలో జీవించాడు. ఆయన గొప్ప శాస్త్రకారుడు మాత్రమే కాదు, ఆచారపరుడు కూడా! ఆయన ఆ గ్రంథం మొత్తాన్నీ మడి కట్టుకొనే రచించాడు.

ఒకరోజున గ్రంథరచన పూర్తి ఐంది. కవి వివరాలను తెలిపే ముగింపు శ్లోకాన్ని వ్రాయవలసి ఉన్నది. ఆయనకు 'విదుషాన్నంభట్టేన'– పండితుడైన అన్నంభట్టుచే రచించబడిన అనే ఆలోచన వచ్చింది. బాగానే ఉన్నది కానీ అది అనుష్టుప్పు శ్లోకం కనుక, ప్రతి పాదంలోనూ ఎనిమిది అక్షరాలు ఉండాలి. అన్నంభట్టు వ్రాయాలనుకొన్న పాదంలో ఏడు అక్షరాలు మాత్రమే ఉన్నై. ఆ ఎనిమిదవ అక్షరం కోసం నానా తంటాలు పడుతున్నాడు. అంతటి మహాకవికి కూడా గంటలు గడుస్తున్నై కానీ సరియైన రీతి దొరకటం లేదు. ఇంట్లో ఆ పని మీద, ఈ పని మీద అటుగా వచ్చి వెళుతున్న అతని భార్య ఈ పరిస్థితిని చూసింది. 'సంగతేమిటండీ?' అని అడిగింది. చెప్పాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. 'దీని కింత ఆలోచన ఎందుకండి? ఆ వైపున ఉన్న అన్నంభట్టును ఈ వైపునకు తీసుకొనిరండి!' అన్నది. అన్నంభట్టు చూశాడు. తను వ్రాయాలనుకొన్న 'విదుషాన్నంభట్టేన' ఇప్పుడు 'అన్నంభట్టేన విదుషా' ఐంది. ఎనిమిది అక్షరాలూ సరిపోయినై. భార్య వైపు కృతజ్ఞతగా చూశాడు.

◆ డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

మృదుస్పర్శ ఎరిగినవాడు

గ్రేట్ రైటర్



డాజై ఒసాము

మనిషి స్వతహాగా బలహీనుడని నమ్ముతాడు డాజై ఒసాము (1909–1948). ఎదుటివాడి బలహీనతను ఎరిగి, మృదువుగా స్పందించడం ద్వారా వారికి సాంత్వన అందించగలమని చెబుతాడు. దీనికోసం ఆయన ఎన్నుకున్న ఒక మార్గం, జీవితపు కర్కశత్వానికి బలైపోయిన బలహీన పాత్రలను సృష్టించి, వాటిపట్ల పాఠకుల్లో ప్రగాఢమైన సానుభూతిని రేకెత్తించడం. ఈ మృదుస్పర్శ లేనివాడే ఆయన ఉద్దేశంలో దుష్టుడు. ఈ స్పర్శ లేదనిపించినప్పుడు ఆయన ఇతరుల రచనలను తిరగరాయడానికి కూడా వెనుకాడలేదు. అలాగే, రాయడం అంటే నిజాయితీ అని కూడా డాజై విశ్వాసం. వ్యక్తిగత జీవితాన్ని అత్యంత పారదర్శకంగా కనబరిచే ఆత్మకథాత్మక నవలలుగా ఆయన 'ద సెట్టింగ్ సన్', 'నో లాంగర్ హ్యూమన్' జపాన్‌లో కొనియాడబడుతున్నాయి. అప్రయత్నంగా రాసే రచయితగా, అతి చిన్న విషయాలను గురించి పట్టించుకునే రచయితగా కూడా ఆయనకు పేరు. అయితే, కేవలం వాస్తవాన్ని ప్రతిబింబించడం పట్ల కూడా డాజైకి అభ్యంతరాలున్నాయి. ఎదుటివారిలో ఆర్ద్రతను మేల్కొల్పని వాస్తవిక వాదాన్ని నిరసించాడు. వాస్తవం కన్నా సత్యం వైపు మొగ్గుచూపాడు. మనిషిగా బతకడంలో సంఘర్షణ ఎదుర్కొని, మద్యానికి బానిసై, అనారోగ్యం పాలై, సంబంధాలను చెడగొట్టుకుని, 39వ పుట్టినరోజు ఇంకా ఆరు రోజులుండగా సహచరితో కలిసి కాలువలో మునిగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికి ఆయన తలపెట్టి పూర్తిచేయకుండా వదిలేసిన నవలిక పేరు 'గుడ్‌బై'.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబినామ సంవత్సరం. దక్షిణాయనం, హేమంత ఋతువు. పుష్యమాసం. తిథి శు.అష్టమి రా.7.31 వరకు, తదుపరి నవమి. నక్షత్రం రేవతి ఉ.8.46 వరకు, తదుపరి అశ్వని. వర్జ్యం తె.5.32 నుంచి 6.32 వరకు (తెల్లవారితే మంగళవారం), దుర్ముహూర్తం ప.12.30 నుంచి 1.14 వరకు, తదుపరి ప.2.43 నుంచి 3.27 వరకు. అమృత ఘడియలు... ఉ.6.13 నుంచి 7.54 వరకు. **భోగి పండుగ.**

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.40
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు


నమాజ్ వేళలు
ఫజర్ : 5.33
జొహర్ : 12.25
అసర్ : 4.25
మగ్రీబ్ : 6.01
ఇషా : 7.17

రారండోయ్

- 'క్రాంతదర్శి: కందుకూరి' (వీరేశలింగం శత వర్ధంతి) ఆవిష్కరణ జనవరి 20న ఉదయం 10 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో జరగనుంది. ఆవిష్కర్త: జి.నాగేశ్వరరావు. నిర్వహణ: మొజాయిక్ సాహిత్య సంస్థ.
- సోమేపల్లి వెంకట సుబ్బయ్య 'చేను చెక్కిన శిల్పాలు' నానీలు, ఎస్.ఎం.సుభానీ 'సామాజిక నానీలు' ఆవిష్కరణ సభ జనవరి 20న ఉదయం 10:30కు గుంటూరులోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరగనుంది. ఆవిష్కర్త: ఎన్.గోపి. నిర్వహణ: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం.
- రమేష్ కార్తిక్ నాయక్ 'బల్దేర్ బండి' కవితా సంపుటి ఆవిష్కరణ జనవరి 20న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. ఆవిష్కర్త: సౌభాగ్య. వక్త: జి.లక్ష్మీ నరసయ్య.
- మల్లవరపు జాన్ సాహిత్య పురస్కారం–2018ని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య చల్లా శ్రీరామచంద్ర మూర్తికి జనవరి 27న ఒంగోలులో జరిగే సభలో ప్రదానం చేయనున్నారు. నిర్వహణ: మల్లవరపు జాన్ సాహిత్య పురస్కార కమిటి, ఒంగోలు.
- 'లేఖిని– గంగిశెట్టి రుక్మిణమ్మ సాహిత్య' పురస్కారానికి 2014–18 వరకు ప్రచురితమైన 'కవయిత్రుల' కవితా సంకలనాలను ఫిబ్రవరి 10 లోగా ఆహ్వానిస్తున్నారు స్వాతీ శ్రీపాద. పురస్కార విలువ రూ. 5,116. చిరునామా: 11/2 ఆర్‌టీ, మున్సిపల్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్–36. ఫోన్: 8297248988
- 'అంగవైకల్య' మహిళల కథలు, అనుభవాలతో తేనున్న పుస్తకానికి రచనలను ఆహ్వానిస్తున్నారు బి.అరుణ, పి.కృష్ణప్రియ. పంపాల్సిన చిరునామా: బి.అరుణ, రూమ్ నం. 129, లేడీస్ హాస్టల్–1, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్–46. ఫోన్: 9395532951
- కథానిలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా– 'గురజాడకు నివాళిగా కథానిలయానికి అభినందనగా' విజయనగరంలోని గురజాడ ఇంటినుండి శ్రీకాకుళంలోని కథానిలయం వరకు ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో 75 కిలోమీటర్ల కాలినడక యాత్ర– క్రియ, సాహితీ స్రవంతి, సహజ సాంస్కృతిక సంస్థ, కథానిలయం ఆధ్వర్యంలో జరగనుంది. ప్రవేశ రుసుము రూ.500. వివరాలకు: దాసరి అమరేంద్ర, ఫోన్: 9818982614
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 9, 10 తేదీల్లో తెలంగాణ సాహిత్య అకాడమీ, పాలమూరు సాహితి–మహిళా విభాగం ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ మహిళా సాహిత్య సదస్సు జరగనుంది. ఈ కవిసమ్మేళనంలో పాల్గొనే కవయిత్రులు జనవరి 31లోపు పేరు నమోదు చేసుకుని కవితను పంపాలి. వివరాలకు: రావూరి వనజ, ఫోన్: 9491486275

దైనందిన జీవితంలోని ఆశనిరాశలు

కొత్త బంగారం



డేనియల్ సల్దాన్యా పేరిస్

'ఎమంగ్ స్ట్రేంజ్ విక్టిమ్స్' నవల్లో, ప్రధాన పాత్ర అయిన రోడ్రీగో తెలివైనవాడు. కాకపోతే, మధ్యలోనే చదువు ఆపేస్తాడు. తనది కాదనిపించే జీవితాన్ని గడుపుతూ– మెక్సికోలో ఉన్న తన అపార్టుమెంట్లో, పెచ్చులూడుతున్న గోడలని చూడ్డంలోనే సంతృప్తి పొందుతుంటాడు. విమర్శించబడకుండా గడిపే నిదానమైన జీవితం అతడికి ఇష్టం. ఇంటి పక్కనున్న ఖాళీ స్థలంలో తిరగాడే కోడిని గంటల తరబడి చూస్తుంటాడు. 'నా జీవితంలో జడత్వం నిండి ఉంది. ఒక శనివారం తరువాత వచ్చే మరిన్ని శనివారాల పునరుక్తే అది' అనుకుంటాడు.

మ్యూజియమ్‌లో కాపీ ఎడిటరుగా ఉద్యోగం దొరికినప్పుడు అయిష్టంగానే చేరతాడు. 'నాలెడ్జ్ అడ్మినిస్ట్రేటర్' అని తనకు తాను నియమించుకున్న హోదాలో, 'ఎన్నో గంటలు– ప్రెస్ రిలీజులు, కరపత్రాలు' రాస్తుంటాడు. నాలుగు భాగాలుగా ఉండే ఈ నవల్లో, 'పెళ్ళి చేసుకోవడం మహాపరాధం' అని తల్లి ఏడెలా చెప్తుందని తెలిసిన తరువాత కూడా, యాదృచ్ఛికంగా సిసీలియాను పెళ్ళి చేసుకుంటాడు. 'సిసీలియాతో కలిసి జీవించడం నన్ను నేను పెట్టుకుంటున్న హింసే. నా పట్ల ఆమె తిరస్కారం వారం వారానికీ పెరుగుతోంది' అనుకుంటాడు.

ఆర్థిక సంక్షోభం వల్ల ఉద్యోగం పోయినప్పుడు, భార్యను తప్పించుకోడానికి తమ ఊర్లో ఉన్న తల్లి వద్దకి వెళ్తాడు. ఏడెలా పీహెచ్‌డీతో పాటు అనేకమైన డిగ్రీలు ఉన్న స్త్రీ. అక్కడ తల్లి ప్రేమికుడైన స్పెయిన్ దేశస్థుడు మార్సేల్లో కనిపించినప్పుడు, రోడ్రీగోకి 'ఆలస్యంగా నిద్రలేచి, లోబట్టలు మాత్రమే వేసుకుని, సీసానుండే నేరుగా చీదరపుట్టించే పాలు తాగడానికి వంటింట్లోకి వెళ్ళే సౌకర్యం' లేకుండా పోతుంది. తల్లికీ, మార్సేల్లోకీ మధ్య ఉన్న అన్యోన్యత చూసిన తరువాత, భార్య గుణాలని పునఃపరిశీలిస్తాడు రోడ్రిగో. సిసీలియా– జోనాథన్ లివింగ్ సెగల్ పుస్తకాలు చదవడం అతనికి కంపరం కలిగిస్తుంది. ఆమె నమ్మే స్వయం సహాయక గురూలు అతనికి నచ్చరు. మార్సేల్లో– రోడ్రీగోకి డ్రగ్స్, టెకిలా, హిప్నాటిజం లాంటివి పరిచయం చేసినప్పుడు, కథ విపరీత మలుపులు తిరుగుతుంది. వారిద్దరి స్నేహం, రోడ్రీగోను తనమీద తను జాలిపడ్డంనుంచి బయట పడేస్తుంది.

'ఒంటరితనం ఎప్పుడూ ఒక్కటే. ఒంటరివారు ఒకేలా ఉండరు. ఇతరుల ఎదుట బయటపడకుండా మనం నిగ్రహించుకునే మాటలని, ఎవరూ విననప్పుడు మనం బయటకి చెప్పుకున్నప్పుడు, దానికుండే విలువ భిన్నమైనది' అన్న నిశితమైన పరిశీలనలు పుస్తకం పట్ల కుతూహలాన్ని హెచ్చిస్తాయి. 'తన దైనందిన జీవితాన్నే గుచ్చిగుచ్చి పరిశీలించుకునే నిరాశావాది, దాన్ని ప్రేమించగలడా? జీవితాన్ని సంతోషంగా గడపడానికి అవసరం అయినది ఏది!' అన్న ప్రశ్నలు వేస్తుంది ఈ నవల.


నవల ముగింపు–బాగా చదువుకున్న, ఉన్నత వర్గాలకి చెందినవారి గురించిన మానసిక అధ్యయనంలా అనిపిస్తూ, కథకున్న పోగులన్నిటినీ కలిపి కడుతుంది. వీరు, తమలో గట్టిగా పాతుకుపోయున్న అభిప్రాయాల ప్రకారమే బతకడం వల్ల, ఆ మొండితనమే తమని అవిటివారిగా చేస్తోందని గుర్తించరంటారు మెక్సికన్ రచయిత డేనియల్ సల్దాన్యా పేరిస్. కోడిని ఖాళీ స్థలంలో చూడ్డం కూడా ఒక విధమైన భాగస్వామ్యమే అంటారు.

తనతో తానూ, ప్రపంచంతోనూ సంధానం కనుక్కోడానికి ప్రయత్నించే వ్యక్తి గురించిన హాస్య కథ ఇది. ఈ స్పానిష్ నవలని ఇంగ్లిష్‌లోకి అనువదించినవారు క్రిస్టీనా మెక్‌స్వీనీ. 2016లో 'బెస్ట్ ట్రాన్స్‌లేటెడ్ బుక్ అవార్డ్'కు లాంగ్‌లిస్టు అయిన ఈ నవలని ప్రచురించింది కాఫీ హౌస్ ప్రెస్.

◆ కృష్ణ వేణి

ఈవారం పుస్తకాలు

వేసవి వర్షం (కథలు)



రచన: ఆకునూరి హసన్; పేజీలు: 156; వెల: 150; ప్రతులకు: రచయిత, విజయలక్ష్మీపురం ఫస్ట్ లేన్, బాపట్ల, గుంటూరు జిల్లా. ఫోన్: 9849427699

రూపాయి చెప్పిన బేతాళ కథలు




రచన: అరిపిరాల సత్యప్రసాద్; పేజీలు: 252; వెల: 150; ప్రచురణ: 'జ్ఞ' ప్రచురణలు, ఫోన్: 7095559982; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

మరో కోణం (వ్యాసాలు)



రచన: డి.మార్కండేయ; పేజీలు: 208; వెల: 150; ప్రతులకు: మలుపు బుక్స్, 3-6-677/2, ఫ్లాట్ నం. 302, ఎం.ఎస్.కె. టవర్స్, స్ట్రీట్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్–29.

హస్బెండ్ స్టిచ్ (స్త్రీల లైంగిక విషాదగాథలు)



రచన: గీతాంజలి; పేజీలు: 168; వెల: 150; ప్రతులకు: మలుపు బుక్స్, హిమాయత్ నగర్, హైదరాబాద్–29. ఫోన్: 9866559868

అసమర్థురాలి అంతరంగం (కథలు)



రచన: రజనీ సుబ్రహ్మణ్యం; పేజీలు: 120; వెల: 150; రచయిత చిరునామా: 3266, హెచ్.ఎ.ఎల్. సెకండ్ స్టేజ్, ఫస్ట్ ఫ్లోర్, పదకొండో మెయిన్, ఇందిరానగర్, బెంగళూరు – 560008. ఫోన్: 7760933547. ప్రతులకు: 8096310140

తెలుగు సామెతలు (గల్పిక/కథా సంకలనం)




రచన: బిందుమాధవి మద్దూరి; పేజీలు: 296; వెల: 150; ప్రతులకు: రచయిత్రి, ఫ్లాట్ నం. 402, శ్రీముఖ రెసిడెన్సీ, ఇం.నం. 8-3-1027/2/ఎ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్–73. ఫోన్: 9491727272



నువ్వేన్నయినా చెప్పు గురూ, మీవంటి కథలు, నవళ్ళు రాసేవారే దయ్యాలు, భూతాలు వున్నాయంటారు. నాలాంటి కవిత్వం రాసేవాడు అసలు వాటిని నమ్మడు!

పదం పలికింది - పాట నిలిచింది

వసంతాలు పూచే నేటి రోజు



భలే మంచి రోజు పసందైన రోజు
వసంతాలు పూచే నేటి రోజు

గుండెలోని కోరికలన్ని గువ్వలుగా ఎగిసిన రోజు
గువ్వలైన ఆ కోరికలే గూటిలోన చేరిన రోజు
నింగిలోని అందాలన్ని ముంగిటిలోనె నిలిచిన రోజు

చందమామ అందిన రోజు బృందావని నవ్విన రోజు
తొలివలపులు చిలికిన రోజు కులదైవం పలికిన రోజు
కన్నతల్లి ఆశలన్ని సన్నజాజులై విరిసిన రోజు

వసంతాలు పూసే రోజు మంచి రోజు కాక ఇంకేమవుతుంది! గుండెలోని కోరికలు గువ్వలుగా ఎగిరితే, నింగిలోని చందమామ చేతికి అందితే... భలే భలే! 'జరిగిన కథ' చిత్రం కోసం డాక్టర్ సి.నారాయణ రెడ్డి కలం 'చిలికిన' ఒక 'పసందైన' పాట ఇది. పాడిందీ, సంగీతం సమకూర్చిందీ ఘంటసాల. 1969లో విడుదలైన ఈ చిత్రానికి దర్శకుడు కె.బాబూరావు. జగ్గయ్య, కృష్ణ, కాంచన నటీనటులు.

ప్రతిధ్వనించే పుస్తకం

దైవీయత కంటే మానవీయతకే ప్రాధాన్యం



'సాహిత్యశాస్త్రం ఇతర శాస్త్రాలతో సంబంధం లేని స్వయం సమగ్ర శాస్త్రంగా ఆలంకారికుల నుంచి ఆధునిక విమర్శకుల దాకా చాలామంది భావించారు. దీనివల్ల సాహిత్య శాస్త్ర పరిధి సంకుచితమై, అభివృద్ధి మందగించింది'. కానీ డాక్టర్ పాపినేని శివశంకర్ మాత్రం ఇతర సామాజిక శాస్త్రాల వెలుగులో సాహిత్యాన్ని పరిశీలించారు. తత్వశాస్త్రం, చరిత్ర, సామాజిక శాస్త్రం, మొదలైన శాస్త్ర సాధనాల్నీ, పరిభాషనీ గ్రహించి విలువైన ప్రతిపాదనలు చేశారు.

నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి పుస్తక రూపమే ఈ 'సాహిత్యం– మౌలిక భావనలు'.

ద్వితీయ వాస్తకవికత అంటే ఏమిటి? పరాయితనం ఎలా మొదలైంది? ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల మధ్య ఘర్షణ ఎలాంటిది? కళా వాస్తవికత, భావనా వాస్తవికతల మధ్య తేడాలేమిటి? ఈ క్రమంలో మనిషికి అసలు కళ ఎందుకు అవసరమైంది? అందులోంచి సాహిత్యం ఎలా పుట్టుకొచ్చింది? ఎలా విస్తరించింది? ఏయే పాయలుగా ప్రవహించింది? ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలను ఆసక్తికరంగా ఆవిష్కరిస్తారు.

జీవిత సాహిత్య దృక్పథం, స్థలకాల బద్ధత, చారిత్రక నియతి, సాహిత్య చలనం, వర్తమానత, గతాగత సంబంధం, అధిచారిత్రక లక్షణం, సాంతత, పాక్షికత్వం తదితర అంశాల ద్వారా 'సాహిత్య పరిధి'ని నిర్వచిస్తారు.

'సాహిత్యానికి కేంద్ర బిందువు'ను కనిపెట్టడంలో భాగంగా దైవ–మానవ శక్తుల, నమ్మకాల గురించి కూలంకషంగా చర్చించారు. సాహిత్యంలోగానీ, జీవితంలోగానీ తారసిల్లే దైవాంశని తిరస్కరించే వీలు లేదు. అయితే సాహిత్యంలో దైవీయత కంటే మానవీయతకే ప్రాధాన్యం ఉండాలని ప్రతిపాదిస్తారు. 'జీవితంలోని సాఫల్య వైఫల్యాలు, వినోద విషాదాలు, చీకటి వెలుగులు సాహిత్యంలో ఆవిష్కరించబడా'లంటారు.

రెండు దశాబ్దాల క్రితం ప్రచురితమైన ఈ అయిదు అధ్యాయాల పుస్తకంలో చాలాచోట్ల మార్క్స్ దృక్కోణం నుంచి చేసిన పరిశీలన సాహిత్యపు మూలాల్ని పట్టిస్తుంది.

◆ ఎమ్వీ రామిరెడ్డి

పింఛనుదారులపై పిడుగు

పదో పీఆర్సీ సిఫార్సుల్లో భారీగా కోత విధించిన ప్రభుత్వం

- 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు అరకొరగానే అదనపు పెన్షన్
- తొమ్మిదేళ్ల క్రితం పెంచిన దాంతో పోల్చితే అదనపు పెంపు సున్నా
- పెరిగిన జీవన వ్యయాలను పరిగణనలోకి తీసుకోని వైనం



సాక్షి, అమరావతి

పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరు విషయంలో పదో వేతన సవరణ సంఘం(పీఆర్సీ) చేసిన సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపించింది. పెరిగిన వైద్య ఖర్చులు, జీవన వ్యయాలను, పీఆర్సీ సిఫార్సులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా నామమాత్రంగానే అదనపు పెన్షన్ మంజూరు చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న (2010 ఏప్రిల్ 6న జారీ చేసిన జీవో నం.100) అదనపు పెన్షన్‌ను యథాతథంగా అమలు చేయాలని నిర్ణయించింది. 75 ఏళ్లు దాటిన పెన్షనర్లకు 2010 నుంచి ప్రభుత్వం ఒక్క శాతం అదనపు పెన్షన్ కూడా మంజూరు చేయలేదు. పదో పీఆర్సీ సిఫార్సుల అమలు పేరుతో తొమ్మిదేళ్ల క్రితం నుంచి అమల్లో ఉన్న అదనపు పెన్షన్‌నే అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ తాజాగా జీవో విడుదల చేసింది. 70 నుంచి 75 ఏళ్ల మధ్య వయసు గల పింఛనుదారులకు బేసిక్ పెన్షన్‌పై 15% అదనపు పెన్షన్ మంజూరు చేయాలని పదో పీఆర్సీ చైర్మన్ పీకే అగర్వాల్ సిఫార్సు చేయగా, కేవలం 10% మాత్రమే అదనపు పెన్షన్ మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. 75 ఏళ్లు దాటిన పెన్షనర్లు/ఫ్యామిలీ పెన్షనర్లకు పదో పీఆర్సీ చేసిన సిఫార్సుల్లో ఒక్కటి కూడా ప్రభుత్వం అమలు చేయలేదు. 2010 నాటి అదనపు పెన్షన్ ఉత్తర్వుల్లోని అంశాలనే యథాతథంగా అమలు చేస్తున్నట్లు జీవోలో పేర్కొంది.

అన్ని వయసుల వారికీ కోతలే

- పెన్షనర్లు/ ఫ్యామిలీ పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై అదనపు పెన్షన్ విషయంలో పదో పీఆర్సీ చేసిన సిఫార్సులను సర్కారు ఏ ఒక్కటీ అమలు చేయలేదు.
- 70–75 ఏళ్ల వయసుగల పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై 15 శాతం అదనపు పెన్షన్ అమలు చేయాలని పదో పీఆర్సీ సిఫార్సు చేయగా సర్కారు పదిశాతం మాత్రమే విదిల్చింది.
- 75–80 ఏళ్ల వారికి బేసిక్ పెన్షన్‌పై 25 శాతం అదనపు పెన్షన్‌ను పీఆర్సీ సిఫార్సు చేయగా సర్కారు 15 శాతం మాత్రమే మంజూరు చేసింది.
- 80–85 ఏళ్ల వయసువారికి 35 శాతం అదనపు పెన్షన్‌ను పీఆర్సీ సిఫార్సు చేయగా ప్రభుత్వం 20 శాతం మాత్రమే విదిల్చింది.
- 85–90 ఏళ్ల వయసు పెన్షనర్లు/ ఫ్యామిలీ పెన్షనర్లకు 45 శాతం అదనపు పెన్షన్ ఇవ్వాలని పదో పీఆర్సీ సూచించగా ప్రభుత్వం 20 శాతం కత్తెర వేసి 25 శాతమే ఇచ్చింది.
- 90–95 ఏళ్ల వయసు వారికి బేసిక్ పెన్షన్‌పై 55 శాతం అదనపు పెన్షన్ ఇవ్వాలని పీఆర్సీ సిఫార్సు చేయగా ప్రభుత్వం 25 శాతం కోత వేసి 30 శాతమే విదిల్చింది.
- 95–100 సంవత్సరాల వయసు వారికి అదనపు పెన్షన్ 65 శాతం ఇవ్వాలని పీఆర్సీ సిఫార్సు చేయగా ప్రభుత్వం 35 శాతమే ఇచ్చింది. అనగా 30 శాతం కోత విధించింది.
- వందేళ్లు దాటిన పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై 75% అదనపు పింఛను పీఆర్సీ సిఫార్సు చేయగా ప్రభుత్వం 50% మాత్రమే మంజూరు చేసింది. పీఆర్సీ సిఫార్సులో 25% కోత విధించింది.

55 నెలల బకాయిలు ఎగవేత

2013 జులై 1వ తేదీ నుంచి పదో పీఆర్సీ సిఫార్సులు అమలు కావాలి. ఈ ప్రకారమైతే పెన్షనర్లకు 66 నెలల అదనపు పెన్షన్ బకాయిలు రావాలి. అయితే ప్రభుత్వం ఉద్యోగులకు సైతం బేసిక్ వేతనంపై 43% ఫిట్‌మెంట్‌ను 2013 జులై 1 నుంచి అమలు చేయకుండా 2014 జులై రెండో తేదీ (రాష్ట్ర విభజన తేదీ) వరకూ 11 నెలలపాటు నోషనల్ పేరుతో ఎగవేసింది. 2014 జూన్ రెండో తేదీ నుంచి మాత్రమే పెరిగిన వేతనాలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీని ప్రకారం చూసినా 2014 జులై రెండో తేదీ నుంచి 2018 డిసెంబరు వరకూ 55 నెలల అదనపు పింఛను బకాయిలను పెన్షనర్లు/ ఫ్యామిలీ పెన్షనర్లకు సర్కారు చెల్లించాల్సి ఉంది. ఉదాహరణకు 80–85 ఏళ్ల వయసున్న పింఛనుదారుకు రూ.15,000 నెలసరి బేసిక్ పింఛను అనుకుంటే 20% అదనపు పెన్షన్ కింద రూ.3,000 అదనంగా ఇవ్వాలి. నెలకు రూ.3000 లెక్కన 55 నెలలకు రూ.1,65,000 చెల్లించాలి. అయితే ప్రభుత్వం జీవోలో ఎక్కడా అదనపు పెన్షన్ బకాయిల విషయాన్ని ప్రస్తావించలేదు. బకాయిలు ఇవ్వాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే ఆమేరకు జీవోలో స్పష్టంగా పేర్కొనేది. ఇలా ప్రస్తావించకపోతే జీవో జారీ అయిన తేదీ నుంచే అదనపు పింఛను పెంపు వర్తిస్తుందని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలోని సుమారు 4 లక్షల మంది పెన్షనర్లకు ప్రభుత్వం 55 నెలల అదనపు పెన్షన్ బకాయిలను ఎగవేసినట్లేనని స్పష్టమవుతోంది.

పదో పీఆర్సీ సిఫార్సు చేసిన అదనపు పెన్షన్(శాతాల్లో)

పెన్షనర్ల వయసు	2010లో అమలు	పదో పీఆర్సీ సిఫార్సు	ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు పెన్షన్
70 -75	లేదు	15	10
75- 80	15	25	15
80- 85	20	35	20
85 -90	25	45	25
90- 95	30	55	30
95 -100	35	65	35
వందేళ్లు దాటిన వారికి	50	75	50

ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

- ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీనివాస్
- ఏకగ్రీవంగా ఎన్నిక
- ప్రభుత్వ పెద్దలకు భంగపాటు



విలేకరులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో అశోక్‌బాబు తదితరులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘానికి కొత్త నాయకత్వం వచ్చింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, బండి శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా కొనసాగిన అశోక్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణ చేయడంతో ఈ పదవికి ఖాళీ ఏర్పడింది. దీన్ని భర్తీ చేసేందుకు ఆదివారం ఉదయం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా విభాగం అధ్యక్షురాలు, కన్వీనర్లు హాజరయ్యారు. రాష్ట్ర సంఘానికి ఇన్‌చార్జి అధ్యక్షునిగా ఉన్న సీహెచ్ పురుషోత్తంనాయుడు అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి, బండి శ్రీనివాస్‌లను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి 1985 నుంచి ఏపీ ఎన్జీవో సంఘంలో వివిధ పదవులు నిర్వహించారు. ఐదున్నరేళ్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బండి శ్రీనివాస్ ప్రకాశం జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షునిగా, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం..

ఈ సందర్భంగా విలేకరులతో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఐదు లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు, నాలుగు లక్షలమంది పెన్షనర్ల సంక్షేమమే లక్ష్యంగా వారి న్యాయమైన కోర్కెల సాధనకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం నుంచి 35 శాతం మధ్యంతర భృతి మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణాలకు స్థలాలిప్పించే విషయంలో ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ పదేళ్లపాటు ఎన్జీవో సంఘ నాయకునిగా క్రియాశీల పాత్ర పోషించానని, తనకు సహకరించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పెద్దలకు భంగపాటు

ఇదిలా ఉండగా, రాష్ట్ర ఎన్జీవో సంఘ ఎన్నికల్లో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని భంగపాటుకు గురయ్యారు. పశ్చిమ కృష్ణా ఎన్జీవో సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ.విద్యాసాగర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేసేందుకు ప్రభుత్వ పెద్దలు అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు పోలీసు శాఖ ద్వారా కొన్ని జిల్లాల సంఘ నాయకులను బెదిరించినట్టు ఉద్యోగులు చెబుతున్నారు. అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఎన్జీవో సంఘం ప్రభుత్వానికి సానుకూలంగా వ్యవహరించిందని, రానున్న ఎన్నికల నేపథ్యంలో అటువంటి కార్యవర్గమే ఉంటే అటు ప్రభుత్వానికి, ఇటు ఉద్యోగులకు మంచిదనే అభిప్రాయాన్ని ఉద్యోగ సంఘ నాయకులకు వివరించినట్టు తెలుస్తోంది. విద్యాసాగర్‌ను ప్రధాన కార్యదర్శిగా చేసేందుకు సహకరించాలని అశోక్‌బాబు కూడా పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే 11 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించడంతో సీఎం చంద్రబాబు వద్ద పంచాయతీ పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆదివారం ఉదయం 9 గంటల్లోపు సీఎంతో అపాయింట్‌మెంట్ ఇప్పిస్తామని, ఆయనతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని కొందరు ముఖ్య నాయకుల్ని అధికారులు కోరారు. అయితే వారంతా ఈ ప్రతిపాదనను వ్యతిరేకించి ఎన్నికను నిర్వహించారు.



కృష్ణా జిల్లా నాగాయలంకలో రాష్ట్ర పర్యాటక శాఖ, స్వచ్ఛ నాగాయలంక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సంప్రదాయ పడవల పోటీలను ప్రారంభించారు. కోలపడవల విభాగంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 16 జట్లు పోటీపడ్డాయి. గత మూడేళ్లుగా ఇక్కడ పడవల పోటీలను నిర్వహిస్తున్నారు. *- నాగాయలంక (అవనిగడ్డ)*

చంద్రబాబుపై కక్ష సాధించేందుకే..

- వైఎస్సార్‌సీపీకి టీఆర్‌ఎస్ మద్దతిస్తోందంటూ పవన్ వ్యాఖ్య
- తెనాలిలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న జనసేన అధ్యక్షుడు

తెనాలి రూరల్: ''ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిపై కక్ష సాధించేందుకే టీఆర్‌ఎస్ నాయకులు ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు తెలుపుతున్నారు'' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆరోపించారు. మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి మండలం పెదరావూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పవన్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదరావూరు– కూచిపూడి మార్గంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో



బహిరంగసభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, వేదికపై మాజీ స్పీకర్ మనోహర్ తదితరులు

ఆయన మాట్లాడుతూ ఈ ఆరోపణ చేశారు. గతంలో టీఆర్‌ఎస్ నాయకులు జగన్‌ను తెలంగాణలో అడుగు పెట్టనివ్వబోమని అన్నారని, వారే ఇప్పుడు చంద్రబాబు గారిపై కక్ష సాధించేందుకు జగన్‌కు మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు పట్ల పవన్‌కున్న సానుకూలతను ఆయన తాజా వ్యాఖ్యలు సూచిస్తున్నాయని విశ్లేషకులు అంటుండడం గమనార్హం.

దోపిడీ లేని పాలన అందిస్తే అభ్యంతరం లేదు

వైఎస్సార్‌సీపీ, టీడీపీ దశాబ్దాలపాటు పాలించవచ్చని, తనకేం అభ్యంతరం లేదని, అయితే ఇసుక మాఫియా లేని, ప్రజాధన దోపిడీ లేని పాలనను అందించాలని పవన్ అన్నారు. వైఎస్ జగన్ 30 ఏళ్లు సీఎంగా చేయాలని ఉందని తనకెవరో తెలియజేశారని, అలాగే బాబు(చంద్రబాబు) రావాలి, వాళ్ల బాబు (లోకేష్) రావాలని వీళ్లు కోరుకుంటున్నారని, ఎవరు వచ్చినా, అవినీతి లేని పాలన అందించాలన్నారు. 30, 40 ఏళ్లక్రితం నాయకులు చేసిన తప్పులకు ఇప్పుడు రాష్ట్రం విడిపోయి, ఆ తప్పులకు మనం బాధ్యత వహించాలా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికలు తమకు ఆఖరు ఎన్నికలు కాదని, ప్రారంభం మాత్రమేనని జనసేన నాయకులకు చెప్పినట్టు ఆయన తెలిపారు. 25 కిలోల బియ్యం బస్తా కాదు... 25 ఏళ్ల భవిష్యత్తు కావాలన్నదే యువత నినాదమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్తోపాటు ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు, మాజీ మంత్రి పి.బాలరాజు, తోట చంద్రశేఖర్, మాదాసు గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

రైతులు, మహిళలు, విద్యార్థుల అసహనం..

సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు వచ్చే పవన్ బహిరంగసభ అనంతరం వ్యవసాయక్షేత్రంలో విద్యార్థులు, రైతులు, మహిళలతో ప్రత్యేకంగా సమావేశమవుతారంటూ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. అయితే సాయంత్రం 5.25 గంటలకు బహిరంగసభలో ప్రసంగించిన పవన్ సంక్రాంతి సంబరాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. భోగి మంటలు వేసిన తర్వాత రాత్రి 7.13 గంటలకు అక్కడినుంచి వెళ్లిపోయారు. దీంతో మధ్యాహ్నం నుంచి అన్నం నీళ్లు లేకుండా ఆయనకోసం నిరీక్షించిన విద్యార్థులు, మహిళలు, రైతులు తీవ్ర అసహనానికి, ఆవేదనకు గురయ్యారు.



వేర్పాటువాద ఉద్యమ ఖైదీల్ని తమ ఇళ్ల సమీపంలోని జైళ్లలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ స్పెయిన్‌లోని బిల్బావ్ పట్టణంలో శనివారం ర్యాలీ చేపట్టిన వేలాది మంది నిరసనకారులు. ఆ దేశంలో ఖైదీలను వారి సొంతూళ్లకు వందలాది కిలోమీటర్ల దూరంలో నిర్బంధించే విధానాలు అమల్లో ఉన్నాయి.

చైనా గనిలో ప్రమాదం: 21 మంది మృతి

బీజింగ్: చైనాలో బొగ్గు గని పైకప్పు కూలి 21 మంది కార్మికులు మృతిచెందారు. మరో 66 మంది గాయపడ్డారు. వాయవ్య చైనాలోని షాంగ్జి ప్రావిన్స్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ గనిలో 87 మంది పనిచేస్తున్నట్లు తెలిసింది. తొలుత 66 మంది చనిపోయారని విపత్తు నిర్వహణ అధికారులు ప్రకటించగా, ఆదివారం చేపట్టిన సహాయక చర్యల్లో మరో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. బైజీ మైనింగ్ అనే సంస్థ నిర్వహణలోని ఈ గనిలో ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న చైనాలో గనుల్లో ప్రమాదాలు జరగడం సాధారణమే. అయితే ఇటీవల ఇలాంటి ఘటనల్లో మృతిచెందిన వారి సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టింది.

నిర్మల స్థానంలో పురుషుడున్నా అదే చెబుతా



దుబాయ్: ప్రధాని మోదీ, రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌పై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ స్పందించారు. 'రఫేల్ ఒప్పందంపై జవాబు చెప్పలేక మోదీ ఓ మహిళ(సీతారామన్) వెనుక దాక్కున్నార'ని రాహుల్ ఇంతకుముందు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయమై దుబాయ్‌లో మీడియాతో మాట్లాడుతూ..'అనిల్ అంబానీ రూ.30 వేల కోట్లు దొంగిలించేందుకు మోదీ సాయం చేశారు. ఈ విషయంలో లోక్‌సభకు జవాబు చెప్పలేక తనకు బదులుగా మరొక మహిళ(సీతారామన్)ను పంపారు. ఆమె స్థానంలో పురుషుడు ఉన్నా నేను ఇదే తరహాలో మాట్లాడేవాడిని' అని రాహుల్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో రాహుల్‌కు జాతీయ మహిళ కమిషన్ ఇప్పటికే నోటీసులు జారీచేసింది.

ఆపరేషన్ థియేటర్‌లో ముద్దు..

ఉజ్జయిని: ఆపరేషన్ థియేటర్‌లో విధులను మరిచి మహిళను ముద్దాడినందుకు ఓ ప్రభుత్వ వైద్యుడు తన ఉద్యోగాన్ని పోగొట్టు కున్నాడు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వాసుపత్రి సివిల్ సర్జన్(49) అక్కడే పనిచేస్తున్న మహిళా నర్సును ముద్దుపెట్టుకున్నాడు. ఆపరేషన్ థియేటర్లో వీరిద్దరూ సన్నిహితంగా ఉన్న ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో జిల్లా కలెక్టర్ శశాంక్ మిశ్రా ఆ వైద్యుడిని విధుల నుంచి తొలగించారు.

కశ్మీర్‌లో అల్-బదర్ చీఫ్ కమాండర్ హతం

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా కాత్పోరా ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అల్–బదర్ ఉగ్రవాద సంస్థ చీఫ్ కమాండర్ జీనత్–ఉల్–ఇస్లాం సహా ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని పోలీసులు ఆదివారం చెప్పారు. ఇస్లాంతోపాటు షకీల్ అహ్మద్ దర్ అనే మరో ఉగ్రవాది కూడా మరణించాడనీ, ఇస్లాం ఏ++ కేటగిరీ ఉగ్రవాది. 2006లో అల్–బదర్ ఉగ్రవాద సంస్థలో చేరి తర్వాత అరెస్టయ్యాడు. విడుదలైన అనంతరం 2016లో హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరాడు. హిజ్బుల్, అల్–బదర్‌ల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా గతేడాది ఇస్లాం అల్–బదర్‌కు వెళ్లాడు. కాత్పోరా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం రావడంతో శనివారం సాయంత్రం భద్రతా దళాలు ఆ ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి సోదాలు నిర్వహిస్తుండగా ముష్కరులు కాల్పులు జరిపారనీ, ఆ తర్వాత భద్రతా దళ సిబ్బంది కూడా కాల్పులు ప్రారంభించారని పోలీసులు తెలిపారు. ఆ కాల్పుల్లో ఇస్లాం, షీకల్ చనిపోయారన్నారు.

మరోసారి ట్రిపుల్ తలాక్, ఎంసీఐ ఆర్డినెన్స్‌లు

న్యూఢిల్లీ: గతవారం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ట్రిపుల్ తలాక్, ఎంసీఐ ఆర్డినెన్స్‌లను కేంద్రం శనివారం మరోసారి జారీ చేసింది. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణిస్తూ, ఆ పద్ధతిలో విడాకులు ఇచ్చే వారికి శిక్ష విధిస్తూ కేంద్రం బిల్లు తీసుకురాగా, దానికి లోక్‌సభలో ఆమోదం లభించినా రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. అలాగే భారతీయ వైద్య మండలి (ఎంసీఐ)లో కుంభకోణాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో దాని పాలనను చూడడం కోసం తాత్కాలికంగా కేంద్రం గతంలో ఓ పాలకమండలిని నియమించింది. ఎంసీఐ స్థానంలో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)ని తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన బిల్లుకు కూడా పార్లమెంటు ఆమోదం లభించలేదు. దీంతో వీటికి సంబంధించిన ఆర్డినెన్స్‌లను కేంద్రం మరోసారి జారీ చేసింది.

'దృశ్యం' సినిమా చూపించారు!

ఇండోర్: సినిమాల ప్రభావం జనంపై ఉంటుందా అన్న ప్రశ్నకు ఇదొక ఉదాహరణ. దృశ్యం సినిమాను రియల్ లైఫ్‌లో దించేశారు. ట్వింకిల్ దగ్రే (22) అనే మహిళ రెండేళ్ల కింద కనిపించడం లేదని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కేసు నమోదైంది. ఆమె హత్యకు గురైనట్లు పోలీసులు ఇటీవల గుర్తించారు. ఈ కేసులో నిందితులు బీజేపీ మాజీ కార్పొరేటర్ జగదీశ్ కరొటియా (65), అతని ముగ్గురు కుమారులు అజయ్(38), విజయ్ (36), వినయ్ (31)తో పాటు వీరి సహాయకుడు నీలేశ్ కశ్యప్(28)ని అరెస్టు చేసినట్లు ఇండోర్ డీఐజీ హరినారాయణచారి మిశ్రా వెల్లడించారు. దృశ్యం సినిమా ప్రేరణతో వారు ఈ హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు.

వివాహేతర సంబంధమే: కరొటియాకు ట్వింకిల్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో ఆమె అతనితోనే ఉంటానని పట్టుబట్టడంతో కరొటియా ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. దీంతో ఆమె అడ్డు తప్పించాలని భావించిన కరొటియా..తన ముగ్గురు కొడుకులతో కలసి హత్యకు పథకం వేశాడు.

దారి మళ్లించారిలా..

- ఐదుగురు కలసి 2016 అక్టోబర్ 16న ట్వింకిల్ గొంతు నులిమి చంపి..కరొటియా స్థలంలోనే మృతదేహాన్ని కాల్చేశారు.
- ట్వింకిల్‌ను ఆమె తల్లిదండ్రులే హత్య చేశారని నమ్మించడానికి హత్యకు ముందురోజు నిందితుడు అజయ్ ట్వింకిల్ మొబైల్ తీసుకుని 'నా తల్లిదండ్రుల నుంచి నాకు ప్రాణహాని ఉంది. నన్ను కాపాడు'అంటూ వాట్సప్ నుంచి తన తండ్రికి సందేశాలు పంపించుకున్నాడు.
- హత్య చేసిన రోజే ఓ కుక్కను చంపి ఆమెను కాల్చిన ప్రదేశానికి 100 మీటర్ల దూరంలో పూడ్చిపెట్టారు.
- అదే రోజు ట్వింకిల్ మొబైల్ లొకేషన్ మార్చి బాదన్వర్ సమీపంలో పూడ్చిపెట్టారు.
- అనంతరం 4 నెలలకు తన భూమిలో ఎవర్నో చంపి పూడ్చి పెట్టారని, కొలతలను బట్టి చూస్తుంటే అది ట్వింకిల్ మృతదేహం లాగే ఉందని స్థానికంగా వదంతులు సృష్టించి చర్చనీయంశం చేశాడు. అనంతరం 2 నెలలకు ఈ విషయాన్ని తన సహాయకుడి ద్వారా పోలీసులకు చేరవేశాడు.
- అక్కడ తవ్వి చూసిన పోలీసులకు దృశ్యం సినిమా మాదిరి కుక్క కళేబరం బయటపడింది. ఇది దర్యాప్తును పక్కదారి పట్టించింది.
- కరొటియా సూచనల మేరకు అంతకు ముందే ట్వింకిల్ తన తల్లిదండ్రులతో ప్రాణహాని ఉందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదు చేసింది. ఇది ఆమె తల్లిదండ్రులే హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసుల్ని దారి మళ్లించింది.

సాక్ష్యులూ..ఆధారాలతో..

కొన్నాళ్లకు మృతదేహాన్ని కాల్చిన ప్రదేశంలో ట్వింకిల్‌కు సంబంధించిన ఒక జత మెట్టెలు, ఓ బ్రాస్‌లెట్, అస్థికలు, ఆమెను చంపడానికి ఉపయోగించిన తాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరొటియాపై అనుమానంతో దర్యాప్తు ప్రారంభించారు. అక్టోబర్ 16న కార్‌లో ఓ మృతదేహం తెచ్చారని, దాని గురించి అడిగితే కార్పొరేటర్ కుక్క చనిపోయిందని, దాన్ని పూడ్చిపెట్టడానికి తీసుకెళ్తున్నట్లు కరొటియా సహాయకుడు సూర్యవంశీ ద్వారా పోలీసులు రాబట్టారు. అంతకు ముందు రోజు ట్వింకిల్ ఆ ఇంటికి వచ్చినట్లు కూడా అతను చెప్పాడు. చనిపోయిన కుక్కకోసం తమను 5 అడుగుల గొయ్యి తవ్వమన్నారని ఐఎంసీ కార్మికులు పోలీసులకు చెప్పడంతో వారి అనుమానం నిజమైంది.



పోలీసుల అదుపులో నిందితులు

బయటపడింది ఇలా..

ఈ కేసుకోసం ఇండోర్‌లోనే తొలిసారి నిందితునికి బ్రెయిన్ ఎలక్ట్రికల్ ఆసిలేషన్ సిగ్నేచర్ (బీఈఓఎస్) పద్ధతిలో దర్యాప్తు చేశారు. గుజరాత్ లాబొరేటరీలో కరొటియా, అతని ఇద్దరి కుమారులకు ఈ బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్ష నిర్వహించారు. న్యూరో సైకలాజికల్ టెక్నిక్ వల్ల దోషులు దొరికిపోవడంతో కథ పూర్తయింది.

బీజేపీ అవకాశాలకు దెబ్బ!

- యూపీలో ఎస్పీ, బీఎస్పీ కూటమి ప్రభావం ఎక్కువే
- దేశవ్యాప్తంగా కమలనాథులకు తగ్గిపోనున్న ప్రత్యామ్నాయాలు
- 'ఒకే నినాదం, ఒకే ఎజెండా' అమలుకు కాలం చెల్లినట్లే
- 2019 ఎన్నికలు మోదీ పాలనకు రిఫరెండం కాదని భావించే పరిస్థితి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు వైరి పక్షాలైన ఎస్పీ, బీఎస్పీలు రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం చేతులు కలపడంతో బీజేపీ ముందున్న ప్రత్యామ్నాయాలు తగ్గిపోయే అవకాశాలున్నాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికల్ని ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీల మధ్య పోరుగా చిత్రీకరించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అందుకే విపక్షాలనన్నింటిని కలిపి మహాకూటమిగా అభివర్ణిస్తూ, ఎన్నికల్ని మోదీ పాలనపై రిఫరెండంగా ప్రచారం చేయాలనుకుంటోంది. అదే జరిగితే మోదీకి తిరుగుండదని, ప్రజాదరణలో మోదీని ఓడించడం కష్టమని కాషాయ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కానీ ఎస్పీ–బీఎస్పీ కూటమితో బీజేపీకి కొత్త తలనొప్పులు తలెత్తే పరిస్థితి ఉంది. ఎందుకంటే గతంలో సార్వత్రిక ఎన్నికలకు ఏదో ఒకే అంశాన్ని ప్రచారాస్త్రంగా ఎంచుకుని బరిలోకి దిగేవారు. కానీ ఇప్పుడు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రాథమ్యాలు మారిపోయాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ఎజెండా, ప్రచారాస్త్రంతో పోటీకి దిగడం జాతీయ పార్టీకి కత్తిమీద సాముగా మారింది. అసలే దక్షిణాదిలో బీజేపీ కేడర్ అంతంత మాత్రమే. ఎస్పీ–బీఎస్పీ బాటలోనే ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు కూడా నడిస్తే బీజేపీ అవకాశాలు మరింత కుంచించుకుపోతాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్ని మోదీ పాలనకు రిఫరెండంగా భావించే పరిస్థితి కూడా ఉండదు.

అప్పుడలా..ఇప్పుడిలా..

కాగితంపై చూస్తే ఎస్పీ–బీఎస్పీ కూటమికి బీసీలు, దళితులు, ముస్లింలు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2014లో ఈ రెండు పార్టీలు విడివిడిగా పోటీచేయడంతో ఓట్ల చీలికతో బీజేపీ లబ్ధి పొందిందన్నది కాదనలేని వాస్తవం. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో జతకట్టిన ఎస్పీ–బీఎస్పీలు అప్పటికే బలోపేతమైన బీజేపీని ఓడించిన సంగతి ఇక్కడ ప్రస్తావనార్హం. ఇక 2014 లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి పరిస్థితులు మారిపోయాయి. ఎస్పీ, బీఎస్పీల ఉమ్మడి ఓటు షేరు 42.1 శాతం కాగా, బీజేపీకి 42.6 శాతం ఓట్లు దక్కాయి. ప్రస్తుతం బీజేపీ ఓట్ల శాతం ఒకటో, రెండో పాయింట్లు పడిపోయి ఉంటుందని అంచనావేస్తున్నారు. తన ఓట్లను ఎస్పీకి బదిలీచేయగలనని గతేడాది జరిగిన ఉపఎన్నికలో బీఎస్పీ నిరూపించింది. మాయావతి ప్రధాని అభ్యర్థిత్వానికి అఖిలేశ్ మద్దతుపలకడం, ఆమెను అవమానిస్తే తననూ అవమానించినట్లేనని పార్టీ కార్యకర్తలకు సూచించడం ద్వారా ఎస్పీ, బీఎస్పీ కార్యకర్తలు కలసి పనిచేసేలా ప్రోత్సహించారు.



'వర్ణ' రాజకీయాలే కీలకం: 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో అధిక సీట్లు గెలుచుకోవడమే బీజేపీకి మొదటి సవాల్. ఇందుకోసం ఆ పార్టీ వేర్వేరు వ్యూహాలు అనుసరించాల్సి ఉంటుంది. దళితులు, అధిక సంఖ్యాక ఓబీసీల్లో పార్టీ పట్ల ఉన్న వ్యతిరేక భావాన్ని ఎదుర్కోవడం ప్రధానమైంది. కానీ, యోగి ఆదిత్యనాథ్ సీఎం అయ్యాక బీజేపీలోనే ఓబీసీ రాజకీయాలు చాపకింద నీరులా పెరిగిపోవడం అసలు సమస్యగా మారింది. అగ్రవర్ణాల్లో ఉన్న పార్టీ వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నంలో భాగంగా మోదీ నిరుపేదలకు 10 శాతం కోటా తీసుకువచ్చారు. అయోధ్యలో రామాలయాన్ని బీజేపీ నిర్మించనుందనే అంచనాలు హిందుత్వ ఓటర్లలో పెరిగిపోయాయి. కుంభమేళా సందర్భంగా జరిగే ధర్మ సంసద్‌లో హిందుత్వవాదులు తమ గళాన్ని మరింత తీవ్రంగా వినిపించే అవకాశాలున్నాయి. అదే జరిగితే బీజేపీ వైఖరికి, హిందుత్వ అతివాదానికి మధ్య మోదీ సయోధ్య ఎలా కుదుర్చుతారో వేచి చూడాలి.

తగ్గనున్న కాంగ్రెస్ స్థాయి

ఎస్పీ, బీఎస్పీ కూటమి నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒకే నినాదం, ఒకే అజెండాతో ప్రజల ముందుకు వచ్చే అవకాశాలు తగ్గిపోయాయి. మాయావతి, అఖిలేశ్ కలిసి కాంగ్రెస్‌ను కూటమిలో చోటివ్వక పోవడం ద్వారా ఈ ప్రయత్నాన్ని అడ్డుకున్నట్లయింది. మిగతా ప్రాంతీయ పార్టీల నేతలు కూడా ఇదే బాటను అనుసరిస్తూ కాంగ్రెస్‌ను పక్కనబెట్టడమో లేదా ఇష్టం లేకున్నా రాష్ట్ర స్థాయిలో పొత్తులు పెట్టుకోవడమో చేసేందుకు ఈ పరిణామం దోహదపడింది. అఖిలేశ్, మాయావతి కలయిక.. మోదీని ఓడించేందుకు కాంగ్రెస్ వంటి జాతీయ స్థాయి ప్రత్యామ్నాయం అక్కర్లేదు.. రాష్ట్ర స్థాయిలో ఏకమైతే చాలనే సందేశాన్ని మిగతా పార్టీలకు పంపింది.

'కామన్‌వెల్త్' పదవికి జస్టిస్ సిక్రి నో

- తొలుత అంగీకరించి తరువాత వద్దన్న వైనం
- సీబీఐ పరిణామాలతో కలతచెందే నిర్ణయం!



న్యూఢిల్లీ: లండన్ కేంద్రంగా పనిచేస్తున్న కామన్‌వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్(సీశాట్) అధ్యక్షుడు/సభ్యుడిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఏకే సిక్రి పేరును కేంద్రం ప్రతిపాదించింది. అయితే ఆ పదవి చేపట్టేందుకు ఆయన తిరస్కరించారు. ఇటీవల సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మను తొలగించిన హైపవర్డ్ కమిటీలో జస్టిస్ సిక్రి కూడా సభ్యుడే అన్న సంగతి తెలిసిందే. వర్మపై వేటుకు సిక్రి మద్దతుపలకడం, ఆ తరువాత వచ్చిన విమర్శలతో ఆయన కలతచెందినట్లు తెలుస్తోంది. ఈ పదవిని వద్దనుకుంటున్నానని, తన పేరును ఇకపై పరిగణించొద్దని కోరుతూ ఆయన కేంద్రానికి లేఖ పంపారు. సీశాట్ పదవికి జస్టిస్ సిక్రి పేరును కేంద్రం గత నెలలోనే నామినేట్ చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ సీశాట్‌కు వర్తమానం పంపింది. మార్చి 6న రిటైర్ అయిన తరువాత ఆయన ఈ పదవి చేపట్టాల్సి ఉంది. తొలుత ఈ ఆఫర్‌కు అంగీకరించిన జస్టిస్ సిక్రి..సీబీఐ పరిణామాల నేపథ్యంలో మనసు మార్చుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. 'కామన్‌వెల్త్ పదవిని ఆఫర్ చేస్తూ ప్రభుత్వం గత నెలలోనే జస్టిస్ సిక్రిని సంప్రదించింది. దీనికి ఆయన అంగీకరించారు. ఎలాంటి జీతభత్యాలు లేని ఈ పదవిలో భాగంగా ఏడాదికి రెండు, మూడు విచారణలకు హాజరుకావాల్సి ఉంది' అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జస్టిస్ సిక్రిని సీశాట్ పదవికి నామినేట్ చేయడంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ డిమాండ్ చేశారు. భయంతోనే ప్రధాని మోదీ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఆరోపించారు. న్యాయ ప్రక్రియలో ఇతరులు వేలుపెడితే, అరాచకం రాజ్యమేలుతుందని ట్వీట్ చేశారు. కామన్‌వెల్త్ కూటమిలోని 53 దేశాల మధ్య తలెత్తే వివాదాల్ని పరిష్కరించే అత్యున్నత మధ్యవర్తి సంస్థే సీశాట్. 1965లో ఈ సంస్థ ప్రారంభమైంది.

మేఘాలయలో తేలని కార్మికుల జాడ

- సహాయక చర్యల్లో హైదరాబాదీ పరిశోధక సంస్థ
- బొగ్గుగనిలో తగ్గని నీటిమట్టం

షిల్లాంగ్: మేఘాలయలోని తూర్పు జైంతియా జిల్లాలో ఓ అక్రమ బొగ్గు గనిలో చిక్కుకున్న 15 మంది కార్మి కుల జాడ ఇంకా తెలియరావడం లేదు. అధికారులు శక్తిమంతమైన మోటార్ల సాయంతో ఇప్పటికే కోటి లీటర్ల నీటిని తోడేసినప్పటికీ 370 అడుగుల లోతున్న ఈ గనిలో నీటి మట్టం కొంచెం కూడా తగ్గలేదు. దీంతో పక్కనే ఉన్న గనుల నుంచి నీళ్లు వస్తుంటాయన్న అనుమానంతో వాటి నుంచి మరో 2 కోట్ల లీటర్ల నీటిని తోడేశారు. అయినప్పటికీ ఫలితం కనిపించలేదు. గతేడాది డిసెంబర్ 13న పక్కనే ఉన్న లైటన్‌నదిలోని నీరు గనిలోకి ఒక్కసారిగా పోటెత్తడంతో 15 మంది లోపల చిక్కుకు పోయారు. తాజాగా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సహాయక చర్యలు సాగుతున్నాయి. మరోవైపు కార్మికుల జాడను గుర్తించేందుకు హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), గ్రావిటీ అండ్ మాగ్నటిక్ గ్రూప్‌కు చెందిన నిపుణులు ఆదివారం గని వద్దకు చేరుకున్నారు. వీరికి అదనంగా చెన్నైకు చెందిన నీటిలో ప్రయాణించే రిమోట్ కంట్రోల్ వాహనంతో పాటు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఈ విషయమై సీఎస్ఐఆర్ నిపుణుడు దేవాశిష్ కుమార్ మాట్లాడుతూ.. డిసెంబర్ 20 నుంచి గనిలో నీటిని తోడేస్తున్నప్పటికీ నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో తమకు అంతుపట్టడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్ సహా వేర్వేరు విభాగాలకు చెందిన 200 మంది నిపుణులు, సిబ్బంది కార్మికుల జాడ కనుగొనేందుకు అవిశ్రాంతంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

చైనా సరిహద్దుల్లో 44 కీలక రోడ్లు

నిర్మాణానికి కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ: డోక్లాం ప్రతిష్టంభన, పాక్ సరిహద్దుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. భారత్– చైనా సరిహద్దుల వెంబడి వ్యూహాత్మకమైన 44 రోడ్ల నిర్మాణం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. అదేవిధంగా, పాకిస్తాన్‌తో సరిహద్దు వెంబడి పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాల పరిధిలో 2,100 కిలోమీటర్ల పొడవైన అంతర్గత, అనుసంధాన రహదారులను నిర్మించాలని యోచిస్తోంది. చైనాతో సరిహద్దుల్లో సంక్షోభం తలెత్తిన సందర్భాల్లో బలగాల తరలింపు వేగంగా జరిగేలా వ్యూహాత్మకంగా కీలకమైన 44 రోడ్లను నిర్మించాల్సి ఉందని కేంద్ర ప్రజా పనుల విభాగం (సీపీడబ్ల్యూడీ) వార్షిక నివేదిక పేర్కొంది. సరిహద్దుల్లో రహదారుల నిర్మాణం బాధ్యతలను ఈ సంస్థ చూసుకుంటుంది. సీపీడబ్ల్యూడీ పంపిన ప్రతిపాదనలు కేబినెట్ కమిటీ ఆమోదించే అవకాశాలున్నాయి. జమ్మూకశ్మీర్ మొదలుకొని అరుణాచల్ ప్రదేశ్ వరకు భారత్–చైనాల మధ్య 4 వేల కిలోమీటర్ల మేర వాస్తవ నియంత్రణ రేఖ ఉంది. ఎంతో కీలకమైన ఈ ప్రాంతంలో 44 రోడ్ల నిర్మాణానికి రూ.21వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. దీంతోపాటు రాజస్తాన్, పంజాబ్‌లలోని భారత్– పాక్ సరిహద్దు వెంబడి అంతర్గత, అనుసంధాన రహదారుల నిర్మాణానికి రూ.5,400 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

50 మంది సైనికులపై వలపు వల

- ఫేస్‌బుక్ ద్వారా సంభాషించిన పాకిస్తానీ మహిళ
- రాజస్తాన్‌లో ఓ జవాన్ అరెస్టు



న్యూఢిల్లీ: భారత ఆర్మీకి సంబంధించిన కీలక వివరాలను సేకరించేందుకు పాకిస్తానీ మహిళ 50 మంది జవాన్లపై వల వేసిన సంగతి తాజాగా వెలుగులోకి వచ్చింది. సున్నితమైన సమాచారాన్ని ఆమెతో పంచుకోవడంతో సోమ్‌వీర్ సింగ్ అనే సిపాయిని ఆర్మీ ఇప్పటికే అరెస్టు చేసింది. ఫేస్‌బుక్‌లో అనికా చోప్రా పేరుతో ఖాతా తెరిచి, ఆకుపచ్చ రంగు చీర కట్టుకున్న ఫొటోను ప్రొఫైల్‌కు పెట్టి సదరు మహిళ జవాన్లకు వలపు వల విసిరింది. మిలిటరీ నర్సింగ్ విభాగంలో ఆర్మీ కెప్టెన్‌గా పనిచేస్తున్నట్లు చెప్పుకుంది. సోమ్‌వీర్‌ను అరెస్టు చేయడంతోపాటు మిగతా జవాన్లను కూడా ఆర్మీ ప్రస్తుతం విచారిస్తోంది. రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సోమ్‌వీర్‌కు 2016లో ఈ మహిళ స్నేహ అభ్యర్థనను పంపి సంభాషించడం మొదలుపెట్టింది. త్వరలోనే వారి మాటలు హద్దులు దాటాయి. ఓ దశలో సోమ్‌వీర్ తన భార్యకు విడాకులివ్వాలని కూడా నిర్ణయించుకున్నాడు. అయితే, ఐదు నెలలుగా జమ్మూ నుంచి సోమ్‌వీర్‌కు ఎక్కువగా ఫోన్‌కాల్స్ వస్తుండటంతో ఆర్మీకి అనుమానం వచ్చి అతని సామాజిక మాధ్యమ ఖాతాలపై ఓ కన్నేసింది. ఫేస్‌బుక్‌లో సదరు మహిళతో అతని చాటింగ్‌ను ఓ కంట కనిపెడుతూనే ఉంది. ఆమె పాకిస్తాన్ నుంచి ఫేస్‌బుక్‌ను వాడుతున్నట్లుగా నిర్ధారించుకుంది. సంభాషణల్లో తొలుత నీ పోస్టింగ్ ఎక్కడ లాంటి ప్రశ్నలతో మొదలుపెట్టి ట్యాంక్ ఫొటోలు పంపించమని ఆమె అడిగిందనీ, ఇది ఆమె పన్నిన వల అని తెలియని సోమ్‌వీర్ కొన్ని వివరాలు ఆమెకు తెలిపాడని అధికారులు చెప్పారు. అనంతరం ఆమె సోమ్‌వీర్‌ను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించిందనీ, ఆ తర్వాత సమాచారం ఇచ్చినందుకు బదులుగా సోమ్‌వీర్ డబ్బు తీసుకుంటున్నాడని తెలిపారు. ఇలా మొత్తం 50 మంది జవాన్లపై పాక్ మహిళ ఫేస్‌బుక్ ద్వారా వల వేసింది. ఒక్కో జవాన్‌కు ఒక్కో సమయాన్ని కేటాయించి, ఆ సమయంలోనే ఆమె మాట్లాడేదని దర్యాప్తులో వెల్లడయింది.

వారసత్వ పార్టీలు.. అవకాశ కూటములు

- ప్రతిపక్షాలపై మోదీ ధ్వజం
- బీజేపీ ప్రజల సాధికారత కోసం పనిచేస్తోందని వ్యాఖ్య
- తమిళ కార్యర్తలతో కాన్ఫరెన్స్

చెన్నై / న్యూఢిల్లీ: జాతీయస్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి పేరుతో జతకట్టేందుకు యత్నిస్తున్న విపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం విరుచుకుపడ్డారు. దేశానికి అన్నివిధాలుగా సేవ చేసేందుకే తాము రాజకీయాల్లోకి వచ్చామనీ, ఓటు బ్యాంకు, విభజన రాజకీయాలు చేసేందుకు కాదని వ్యాఖ్యానించారు. 'మేరా బూత్–సబ్‌సే మజ్‌బూత్' కార్యక్రమంలో భాగంగా తమిళనాడులోని మైలదుతురై, శివగంగ, పెరంబలూర్, తేని, విరుధునగర్ పార్లమెంటరీ నియోజవర్గాల్లోని బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ముచ్చటించారు.

సరికొత్త శిఖరాలకు అభివృద్ధి..

'ఓవైపు అభివృద్ధి ఎజెండాతో మేం ఉంటే, మరోవైపు వారసత్వ పార్టీలు, అవకాశవాద పొత్తులు ఉన్నాయి. అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు 2019 లోక్‌సభ ఎన్నికలు మనకు గొప్ప అవకాశం. 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' స్ఫూర్తితో మనం ప్రజలకు సాధికారత కల్పించేందుకు పనిచేస్తుంటే, వారసత్వ పార్టీలు మాత్రం అవకాశవాద పొత్తులతో సొంత సామ్రాజ్యాలను ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్నాయి. బీజేపీలో ఎదుగుదలకు ఓ కుటుంబానికి విధేయత చూపడం, గొప్ప వంశంలో పుట్టడం, ధనవంతులుగా ఉండాల్సిన పనిలేదు. కేవలం పార్టీ కోసం కష్టపడగలిగితే చాలు' అని మోదీ తెలిపారు.



నాణెం విడుదల చేస్తున్న మోదీ, పక్కనే మన్మోహన్

విపక్షాలవి తాత్కాలిక పొత్తులే..

ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. ''బీజేపీ విజయం ప్రతీకూల రాజకీయాలు చేసే కొందరికి ఆగ్రహం తెప్పిస్తోంది. అందుకే వాళ్లు నన్ను, పార్టీని దూషిస్తున్నారు. మన విపక్ష మిత్రులు కూడా అయోమయంలో ఉన్నారు. అందుకే 'మోదీ చెడ్డవాడు' 'ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయడం లేదు' 'ప్రజలు బీజేపీని ఇష్టపడటం లేదు' అని చెబుతున్నారు. కానీ మోదీ నిజంగానే చెడ్డవాడు అయితే, బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయకుంటే విపక్షాలు ఎందుకు పొత్తులు కుదుర్చుకుంటున్నాయి?' అని ప్రశ్నించారు.

కర్తార్‌పూర్ విషయంలో కాంగ్రెస్ విఫలం

దేశవిభజన సమయంలో సిక్కులకు పవిత్రమైన కర్తార్‌పూర్ సాహిబ్‌ను భారత్‌లో చేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని ప్రధాని మోదీ విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం నిర్మించిన కర్తార్‌పూర్ కారిడార్ వల్ల వీసా అవసరం లేకుండానే భక్తులు పాకిస్తాన్‌లోని గురునానక్ అంతిమ విడిదిని సందర్శించుకోవచ్చని తెలిపారు. సిక్కుల 10వ గురువు గోబింద్ సింగ్ 350వ జయంతి వేడుకల సందర్భంగా ఢిల్లీలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో రూ.350 విలువైన వెండి స్మారక నాణేన్ని మోదీ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గురునానక్ 550వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ సీజేఐ జస్టిస్ జేఎస్ ఖేహర్‌తో పాటు పలువురు సిక్కు నేతలు హాజరయ్యారు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
14-1-2019

రాప్టర్స్ రాకింగ్

పీబీఎల్ చాంపియన్ బెంగళూరు • రసవత్తర ఫైనల్లో 4-3తో ముంబైపై గెలుపు


బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్-4) నాలుగో సీజన్‌లో బెంగళూరు రాప్టర్స్ రాకింగ్ ప్రదర్శనతో టైటిల్ పట్టేసింది. ఆదివారం జరిగిన రసవత్తర టైటిల్ పోరాటంలో బెంగళూరు 4-3తో ముంబై రాకెట్స్‌ను కంగుతినిపించింది. మొదట జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌ను 'ట్రంప్'గా ఎంచుకున్న ముంబై రాకెట్స్ ఇందులో గెలిచి శుభారంభం చేసింది. కిమ్ జీ జాంగ్-బెర్నడెత్ (ముంబై) జంట 15-8, 15-14తో మార్కస్ ఎలిస్-లారెన్ స్మిత్ (బెంగళూరు) జోడీపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో తెలుగు తేజం కిడాంబి శ్రీకాంత్ (బెంగళూరు) 15-7, 15-10తో ఆంటోన్సెన్ (ముంబై)పై నెగ్గి 1-2తో రాకెట్స్ ఆధిక్యాన్ని తగ్గించాడు. బెంగళూరుకు 'ట్రంప్' అయిన మహిళల సింగిల్స్‌లో తి ట్రంగ్ వు 15-8, 15-9తో శ్రియాన్షి పరదేశి (ముంబై)ని ఓడించింది. దీంతో 3-2తో బెంగళూరు పైచేయి సాధించింది. అయితే రెండో పురుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్ భమిడిపాటి సాయిప్రణీత్ (బెంగళూరు) 15-7, 12-15, 3-15తో సమీర్ వర్మ (ముంబై) చేతిలో కంగుతిన్నాడు. దీంతో ఇరు జట్లు 3-3తో సమవుజ్జీగా నిలిచాయి. నిర్ణాయక పురుషుల డబుల్స్‌లో మొహమ్మద్ అహ్‌సాన్-హెంద్ర సెతియవాన్ (బెంగళూరు) ద్వయం 15-13, 15-10తో కిమ్ జీ జాంగ్-లీ యంగ్ డే (ముంబై) జంటపై గెలువడంతో రాప్టర్ నాలుగో సీజన్ విజేతగా అవతరించింది. విజేతగా నిలిచిన బెంగళూరు రాప్టర్స్‌కు రూ. 3 కోట్ల ప్రైజ్‌మనీ లభించింది.




పాకిస్తాన్ లక్ష్యం 381

దక్షిణాఫ్రికాతో చివరి టెస్టు

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో పాకిస్తాన్ కొంత పోరాటపటిమ కనబరుస్తోంది. 381 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 153 పరుగులు చేసింది. ఇమామ్ ఉల్ హఖ్ (35), మసూద్ (37), అజహర్ (15) ఔట్ కాగా... అసద్ షఫీఖ్ (48 బ్యాటింగ్), బాబర్ ఆజమ్ (17 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. చేతిలో 7 వికెట్లు ఉన్న ఆ జట్టు మరో 228 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 135/5తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు ఆలౌటైంది. క్వింటన్ డి కాక్ (138 బంతుల్లో 129; 18 ఫోర్లు, సిక్స్) సెంచరీ సాధించగా, హాషిం ఆమ్లా (71; 14 ఫోర్లు) రాణించాడు. షాదాబ్, ఫహీమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు తీసిన స్టెయిన్ (433) అత్యధిక వికెట్ల బౌలర్ల జాబితాలో ఎనిమిదో స్థానానికి చేరాడు.


డి కాక్



ఫెడరర్‌ను ఆపేదెవరు!

పట్టుదలకు తోడు ఫిట్‌నెస్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా అద్భుతాలు చేయడం సాధ్యమేనని నిరూపించిన స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ మరో రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా 20వ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొంటున్న అతను ఈసారి గెలిస్తే ఈ టోర్నీని అత్యధికంగా ఏడుసార్లు నెగ్గిన తొలి క్రీడాకారుడిగా చరిత్ర పుటల్లోకి ఎక్కుతాడు. అంతేకాకుండా తన ఖాతాలో 100వ టైటిల్‌ను జమ చేసుకుంటాడు. గత రెండేళ్లుగా ఈ టోర్నీలో విజేతగా నిలుస్తోన్న ఫెడరర్‌కు ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), మాజీ చాంపియన్ రాఫెల్ నాదల్ (స్పెయిన్) నుంచి గట్టిపోటీ లభించనుంది.


నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ
- 21వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై స్విస్ స్టార్ గురి
- జొకోవిచ్, నాదల్ నుంచి గట్టిపోటీ
- చివరిసారి ఆడనున్న ఆండీ ముర్రే

ఉదయం గం. 5.30 నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-2లలో ప్రత్యక్ష ప్రసారం

మెల్‌బోర్న్: వరుసగా మూడో ఏడాది కొత్త సీజన్‌ను గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌తో మొదలు పెట్టాలనే లక్ష్యంతో స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగనున్నాడు. ఇదే వేదికపై 2017, 2018లలో విజేతగా నిలిచిన అతను నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో డెనిస్ ఇస్టోమిన్ (ఉజ్బెకిస్తాన్)తో ఆడనున్నాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో ఇప్పటికే అత్యధికంగా 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ఫెడరర్‌కు ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా), మాజీ విజేత రాఫెల్ నాదల్ (స్పెయిన్) నుంచి సవాల్ ఎదురయ్యే అవకాశముంది. 'ప్రస్తుతం బాగా ఆడుతున్నాను. నన్ను ఓడించాలంటే నా ప్రత్యర్థులు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించాల్సి ఉంటుంది' అని 37 ఏళ్ల ఫెడరర్ వ్యాఖ్యానించాడు. ఫెడరర్‌తోపాటు ఇప్పటికే ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన జొకోవిచ్ కూడా రికార్డుస్థాయిలో ఏడో టైటిల్‌పై గురి పెట్టాడు. ఈ ఇద్దరిలో


జొకోవిచ్


నాదల్


ఆండీ ముర్రే

టైటిల్ సాధించినవారు ఎమర్సన్ (ఆస్ట్రేలియా-6 సార్లు) పేరిట ఉన్న రికార్డును అధిగమిస్తారు. గతేడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్ టైటిల్స్ గెలిచి ఫామ్‌లోకి వచ్చిన జొకోవిచ్ మంగళవారం తన తొలి రౌండ్ మ్యాచ్‌ను క్వాలిఫయర్ క్రుగెర్ (అమెరికా)తో ఆడనున్నాడు. ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ గెలిస్తే రెండో రౌండ్‌లో 2008 రన్నరప్ జో విల్‌ఫ్రైడ్ సోంగా (ఫ్రాన్స్) రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురయ్యే అవకాశముంది. '2008లో ఆస్ట్రేలియన్ ఓపెన్ రూపంలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాను. నాటి విజయం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కెరీర్‌లో నేనూ గొప్ప టైటిల్స్ సాధించగలననే నమ్మకం ఇచ్చింది' అని 31 ఏళ్ల జొకోవిచ్ అన్నాడు.

మరోవైపు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్న మాజీ నంబర్‌వన్ రాఫెల్ నాదల్ తొలి రౌండ్ పోరులో ఆస్ట్రేలియా ఆటగాడు జేమ్స్ డక్‌వర్త్‌తో తలపడనున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సన్నాహకంగా బ్రిస్బేన్ టోర్నీలో ఆడాల్సిన 32 ఏళ్ల నాదల్ చివరి నిమిషంలో గాయం కారణంగా తప్పుకున్నాడు. 'ప్రస్తుతం ఫిట్‌గా ఉన్నాను. లేకుంటే ఇక్కడకు వచ్చేవాణ్ని కాదు' అని 32 ఏళ్ల నాదల్ తెలిపాడు.

ముర్రే... చివరిసారిగా...

కొన్నాళ్లుగా తుంటి గాయంతో బాధపడుతున్న బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే చివరిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడనున్నాడు. నేడు జరిగే తొలి రౌండ్‌లో అతను 22వ సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్)ను 'ఢీ' కొంటాడు. ప్రస్తుతం 230వ ర్యాంక్‌లో ఉన్న ముర్రే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఐదుసార్లు (2010, 2011, 2013, 2015, 2016) ఫైనల్‌కు చేరి ఐదుసార్లూ రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకోవడం గమనార్హం.

టైటిల్ రేసులో వీరూ ఉన్నారు...

గత రికార్డు, ఫామ్ దృష్ట్యా ఫెడరర్, జొకోవిచ్, నాదల్ టైటిల్ ఫేవరెట్స్‌గా కనిపిస్తున్నా... యువ ఆటగాళ్లు అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), థీమ్ (ఆస్ట్రియా), కొరిచ్ (క్రొయేషియా), ఖచనోవ్ (రష్యా), సిలిచ్ (క్రొయేషియా), అండర్సన్ (దక్షిణాఫ్రికా), వావ్రింకా (స్విట్జర్లాండ్) సంచలన ప్రదర్శన చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక భారత్ తరఫున పురుషుల సింగిల్స్‌లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ పోటీపడనున్నాడు. క్వాలిఫయింగ్‌లో మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. నేడు తొలి రౌండ్‌లో 39వ ర్యాంకర్ టియాఫో (అమెరికా)తో ప్రజ్నేశ్ ఆడనున్నాడు.

సెరెనా సాధించేనా?

మహిళల సింగిల్స్ విభాగంలో ఎప్పటిలాగే కచ్చితమైన ఫేవరెట్స్ కనిపించడం లేదు. ఏడుసార్లు చాంపియన్, మాజీ నంబర్‌వన్ సెరెనా విలియమ్స్ (అమెరికా) మరో టైటిల్ సాధిస్తే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలిచిన మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా-24) సరసన నిలుస్తుంది. ఇప్పటికే 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన సెరెనాకు గతేడాది రెండుసార్లు ఈ అవకాశం వచ్చినా ఆమె చేజార్చుకుంది. వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లలో సెరెనా రన్నరప్ ట్రోఫీలతో సంతృప్తి పడింది.

డిఫెండింగ్ చాంపియన్ వొజ్నియాకి (డెన్మార్క్), టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ హలెప్ (రొమేనియా), మాజీ విజేత షరపోవా (రష్యా), ముగురుజా (స్పెయిన్), నాలుగో సీడ్ నయోమి ఒసాకా (జపాన్), ఒస్టాపెంకో (లాత్వియా), స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా), రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ), పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్), మాడిసన్ కీస్ (అమెరికా) టైటిల్ రేసులో ఉన్నారు.



శుభ్‌వార్త...

- భారత జట్టులోకి తొలిసారి శుబ్‌మన్ గిల్‌కు చోటు
- వన్డేల్లో విజయ్ శంకర్‌కు అవకాశం
- పాండ్యా, రాహుల్ స్థానాల్లో ఎంపిక



న్యూఢిల్లీ: యూత్ క్రికెట్‌తో పాటు రంజీ ట్రోఫీలో సంచలన ప్రదర్శనతో పరుగుల వరద పారించిన పంజాబ్ బ్యాట్స్‌మన్ శుబ్‌మన్ గిల్‌కు తొలిసారి భారత సీనియర్ జట్టు పిలుపు లభించింది. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే, టి20 సిరీస్ కోసం 19 ఏళ్ల గిల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. నిషేధం ఎదుర్కొంటున్న కేఎల్ రాహుల్ స్థానంలో అతడికి అవకాశం దక్కింది. తాజా రంజీ సీజన్‌లో గిల్ 10 ఇన్నింగ్స్‌లలో కలిపి 98.75 సగటుతో 790 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 5 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇటీవలే భారత 'ఎ' జట్టు తరఫున న్యూజిలాండ్‌లో పర్యటించిన అనుభవం కూడా గిల్‌కు కలిసొచ్చింది. వాస్తవానికి సెలక్టర్లు టెస్టు సిరీస్‌లో రాణించిన మయాంక్ అగర్వాల్‌నే ఎంపిక చేయాలని భావించారు. అయితే ఇటీవల అతని వేలికి అయిన గాయం తగ్గకపోవడంతో గిల్ వైపు మొగ్గు చూపారు. నిషేధానికి గురైన మరో ఆటగాడు హార్దిక్ పాండ్యా స్థానంలో తమిళనాడు ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు పిలుపు దక్కింది. భారత్ తరఫున శంకర్ ఇప్పటి వరకు 5 టి20 మ్యాచ్‌లు ఆడగా, వన్డేల్లో అవకాశం లభించడం ఇదే మొదటి సారి. అతను నేరుగా ఆస్ట్రేలియా వెళ్లి రెండో వన్డేకు ముందు జట్టుతో చేరతాడు. భారత్ 'ఎ' తరఫున న్యూజిలాండ్ 'ఎ'తో జరిగిన వన్డే సిరీస్‌లో 3 మ్యాచ్‌లు ఆడిన విజయ్ శంకర్ 94.00 సగటుతో 188 పరుగులు చేశాడు.

'గిల్‌లో ప్రత్యేక ప్రతిభ ఉంది. చాలా కాలం తర్వాత నేను ఇష్టంగా ఒక కుర్రాడి బ్యాటింగ్ చూస్తున్నాను. 2019 ప్రపంచ కప్ తర్వాత అతను భారత జట్టులోకి రావడం ఖాయం'... గిల్ పంజాబ్ సహచరుడు, భారత స్టార్ యువరాజ్ సింగ్ వారం రోజుల క్రితమే చేసిన వ్యాఖ్య ఇది. అయితే అనూహ్య పరిణామాల నేపథ్యంలో చాలా ముందుగా శుబ్‌మన్‌కు భారత జట్టులో అవకాశం దక్కింది. టీనేజర్‌గా అద్భుత ప్రదర్శన కనబర్చి 'భవిష్యత్తు తార'గా ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్న భారత యువ ఆటగాళ్లలో శుబ్‌మన్ గిల్ కూడా ఒకడు. అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో పంజాబ్ తరఫున మొదటి మ్యాచ్‌లోనే డబుల్ సెంచరీతో తొలిసారి గుర్తింపు తెచ్చుకున్న గిల్ వరుసగా రెండేళ్ల పాటు బీసీసీఐ 'బెస్ట్ జూనియర్ క్రికెటర్' అవార్డు అందుకున్నాడు. ముఖ్యంగా కెరీర్ పరంగా అతనికి గత ఏడాది కాలం అద్భుతంగా సాగింది. ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌లోనే జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో 5 ఇన్నింగ్స్‌లలోనే 124 సగటుతో 372 పరుగులు చేసిన గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచి జట్టుకు టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందే ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై జరిగిన అండర్-19 వన్డే సిరీస్‌లో కూడా 4 ఇన్నింగ్స్‌లలోనే 351 పరుగులు, ఆ తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లి మరో 278 పరుగులు చేయడం గిల్‌పై అందరి దృష్టి పడేలా చేసింది. ఆ తర్వాత ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.1.8 కోట్లకు గిల్‌ను తీసుకుంది. అప్పటి నుంచి ఇక సీనియర్ విభాగంలో ఎలా రాణిస్తాడనే దానిపైనే ఆసక్తి నెలకొంది. సాంప్రదాయ శైలిలో బ్యాటింగ్ చేస్తూనే ప్రతీ ఫార్మాట్‌కు అనుగుణంగా ఆటను మార్చుకొని అన్ని రకాల షాట్లు ఆడగలగడం గిల్ ప్రత్యేకత. రంజీ ట్రోఫీలో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడిన శుబ్‌మన్ ప్రతీ మ్యాచ్‌లో కనీసం అర్ధ సెంచరీ చేయడం విశేషం. ముఖ్యంగా తమిళనాడుపై చేసిన 268 పరుగుల ఇన్నింగ్స్ అతని సాధికారితను చాటితే... హైదరాబాద్‌పై 338 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 154 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సర్లతో చేసిన 148 పరుగులు అతని కెరీర్‌లో ఇప్పటివరకు అతి పెద్ద హైలైట్.

> తుది జట్టులో అవకాశం లభిస్తే భారత్ సీనియర్ జట్టు తరఫున ఆడుతున్నాననే ఒత్తిడిని నేను ముందుగా అధిగమించాలి. ఇది కొంత కష్టమే కానీ నేను మానసికంగా సిద్ధంగా ఉన్నా. ఏడాది క్రితం అండర్-19 ప్రపంచకప్ ఆడాను. ఇటీవలే పర్యటించిన న్యూజిలాండ్ గడ్డపై తొలి సిరీస్‌కు ఎంపిక కావడం మంచిదే. అక్కడ బాగా రాణించాను కాబట్టి నా టెక్నిక్‌లో పెద్దగా మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. టీమిండియా చాన్స్‌ను అసలు ఊహించ లేదు. అయితే ఎలాంటి పరిస్థితుల్లో ఎంపిక య్యానో నాకు తెలుసు. ఇప్పటి వరకు ఆడిన అన్ని స్థాయిలలో రాణించాను కాబట్టి అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా బాగా ఆడగలననే నమ్మకముంది.
>
> – శుబ్‌మన్ గిల్

ఫుట్‌బాల్ దిగ్గజం జుల్ఫికర్ అస్తమయం

1956 ఒలింపిక్స్‌లో ఆడిన హైదరాబాదీ

సాక్షి, హైదరాబాద్: భారత ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న మొహమ్మద్ జుల్ఫికరుద్దీన్ (83) ఆదివారం కన్ను మూశారు. సుదీర్ఘ కాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో సెమీఫైనల్ చేరిన భారత జట్టులో జుల్ఫికర్ సభ్యుడుగా ఉన్నారు. ఈ టీమ్‌లో 17 ఏళ్ల జుల్ఫికర్ సహా మొత్తం ఆరుగురు హైదరాబాద్‌కు చెందిన వారు ఉండటం విశేషం. మలేసియాలో జరిగిన మెర్డెకా కప్‌తో తొలిసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన జుల్ఫికర్ 1958 టోక్యో ఆసియా క్రీడల్లో కూడా పాల్గొన్నారు.



హైదరాబాద్ సిటీ పోలీస్ తరఫున...

జుల్ఫికర్ 1954లో హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్ తరఫున కెరీర్ ప్రారంభించి ప్రఖ్యాత కోచ్ సయ్యద్ అబ్దుల్ (ఎస్ఏ) రహీమ్ శిక్షణలో రాటుదేలారు. ఆ తర్వాత ఆయన హైదరాబాద్ సిటీ పోలీస్ జట్టులో చేరారు. 1954 నుంచి 1967 మధ్య కాలంలో ఆయన వరుసగా అటు ఆంధ్రప్రదేశ్ జట్టుకు, ఇటు హైదరాబాద్ సిటీ పోలీస్ జట్టుకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించారు. జుల్ఫికర్ నాయకత్వంలో ఏపీ మూడు సార్లు (1956, 1957, 1965) జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీని గెలుచుకుంది. ఓవరాల్‌గా ఆయన 15 గోల్స్ చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ జట్టుకు కూడా కెప్టెన్‌గా ఐఎఫ్ఏ షీల్డ్, డ్యురాండ్ కప్, రోవర్స్ కప్‌వంటి ప్రఖ్యాత టైటిల్స్‌ను అందించారు. జుల్ఫికర్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్... ఆటకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఫత్ అలీ, జి.ఫల్గుణలతో పాటు మాజీ క్రీడాకారులు ఎస్ఏ హకీమ్, విక్టర్ అమల్‌రాజ్, అక్బర్, హబీబ్, అలీమ్ ఖాన్ సంతాపం ప్రకటించారు.



రాయుడు బౌలింగ్ సందేహాస్పదం!

అభ్యంతరం వ్యక్తం చేసిన ఐసీసీ

దుబాయ్: భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు బౌలింగ్ శైలిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సందేహం వ్యక్తం చేసింది. శనివారం సిడ్నీలో జరిగిన తొలి వన్డే అనంతరం మ్యాచ్ అధికారులు తమ నివేదికలో రాయుడు ఆఫ్‌స్పిన్ బౌలింగ్ యాక్షన్‌ను తప్పు పట్టారు. ఈ నివేదికను ఐసీసీ భారత టీమ్ మేనేజ్‌మెంట్‌కు అందజేసింది. అతను 14 రోజుల్లోగా పరీక్షకు హాజరు కావాలని తేల్చి చెప్పింది. అయితే తుది ఫలితం వచ్చే వరకు మాత్రం రాయుడు తన బౌలింగ్‌ను కొనసాగించవచ్చు. పార్ట్‌టైమ్ స్పిన్నర్ రాయుడు తన 46 మ్యాచ్‌ల వన్డే కెరీర్‌లో 20.1 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 3 వికెట్లు తీశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌తో పాటు దేశవాళీ వన్డేలు, టి20ల్లో అతను ఒక్కసారి కూడా బౌలింగ్ చేయలేదు. సిడ్నీ వన్డేలో 2 ఓవర్లు వేసిన రాయుడు 13 పరుగులిచ్చాడు.

రాయల్స్ కోచ్‌గా ఆప్టన్



ముంబై: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్ కోచ్‌గా మళ్లీ ప్యాడీ ఆప్టన్‌ను నియమించారు. గతంలో నాలుగేళ్ల పాటు రాయల్స్‌కు ఆయన కోచ్‌గా పనిచేశారు. 2013 ఐపీఎల్‌లో శ్రీశాంత్ సహా ముగ్గురు స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన సీజన్‌లో ఆప్టనే కోచ్‌గా ఉన్నారు. అలాగే భారత జట్టు మెంటల్ కండిషనింగ్ కోచ్‌గా విజయవంతమైన పాత్ర పోషించారు. టీమిండియా వన్డే ప్రపంచకప్ (2011) ఘనతలో అప్పటి హెడ్ కోచ్ కిర్‌స్టెన్‌తో పాటు ఈయనకు భాగముంది. ఐపీఎల్‌తో పాటు బిగ్‌బాష్, పాకిస్తాన్ సూపర్ లీగ్‌ల్లోనూ పలు జట్లకు కోచ్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఆప్టన్ మార్గదర్శనంలోనే సిడ్నీ థండర్స్ 2016లో బిగ్‌బాష్ విజేతగా నిలిచింది. అప్టన్ మళ్లీ తమ జట్టుతో కలవడం సంతోషంగా ఉందని రాయల్స్ సహాయజమాని మనోజ్ తెలిపారు.

చైనా అమ్మాయిలు 14 ఆలౌట్

అంతర్జాతీయ టి20లో అనూహ్యం

బ్యాంకాక్: చైనా వస్తువుల నాణ్యత, మన్నిక గురించి మనకు సాధారణంగా ఎన్నో సందేహాలు! ఇప్పుడు చైనా క్రికెట్ జట్టు కూడా అలాగే ఉన్నట్లుంది. ఇటీవలే ఆ జట్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టగా... మహిళల టీమ్ అంతర్జాతీయ టి20ల్లో అత్యల్ప స్కోరు రికార్డును మూటగట్టుకుంది. ఆదివారం ఇక్కడ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో జరిగిన మ్యాచ్‌లో చైనా 10 ఓవర్లలో 14 పరుగులకే ఆలౌటైంది. జట్టు ఇన్నింగ్స్ 48 నిమిషాలకే ముగిసింది. ఏడుగురు ప్లేయర్లు 'సున్నా'తో సరిపెట్టగా... లిలి 4, యాన్ లింగ్, యింగ్‌జూ చెరో 3, జాంగ్ చాన్ 2 పరుగులు చేశారు. మరో 2 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. థాయ్‌లాండ్ ఉమెన్స్ టి20 స్మాష్ టోర్నీలో భాగంగా ఈ మ్యాచ్ జరిగింది. అంతకుముందు యూఏఈ 20 ఓవర్లలో 3 వికెట్లకు 203 పరుగులు చేసింది. ఫలితంగా టి20ల్లో అత్యధిక పరుగుల తేడాతో (189) గెలిచిన జట్టుగా రికార్డులకెక్కింది.


టాస్ సందర్భంగా చైనా, యూఏఈ కెప్టెన్లు

క్రికెట్‌కు ఆదరణ పెంచేందుకు గత ఏడాది జూలై 1 నుంచి సభ్యదేశాలు ఆడే టి20 మ్యాచ్లన్నింటికీ ఐసీసీ అంతర్జాతీయ హోదా ఇచ్చింది. ప్రస్తుత టోర్నీలో భూటాన్, మయన్మార్‌లాంటి జట్లు కూడా బరిలో ఉన్నాయి. మరోవైపు ఈ జనవరి 1 నుంచి పురుషుల క్రికెట్‌లో కూడా ఇదే తరహాలో 'అంతర్జాతీయ మ్యాచ్‌ల'నిబంధన అమలు కానుంది. ఫలితంగా ఈ తరహా 'సిత్రాలు'మున్ముందు మరిన్ని కనిపించవచ్చు. పురుషుల క్రికెట్‌లో భారత్ వర్సెస్ చైనా మ్యాచ్ స్కోర్లను ఊహించుకోండి!



చాంపియన్ ప్రణవ్

స్వర్ణం గెలిచిన తెలంగాణ షట్లర్

పుణే: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ కుర్రాడు గంధం ప్రణవ్ రావు పసిడి పతకాన్ని గెల్చుకున్నాడు. ఆదివారం జరిగిన బ్యాడ్మింటన్ ఈవెంట్ అండర్-17 బాలుర సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ ప్రణవ్ 15-21, 21-18, 21-11తో రెండో సీడ్ రవి (హరియాణా)పై విజయం సాధించాడు.

మేఘనకు మూడు పతకాలు

రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో తెలంగాణ అమ్మాయి గుండ్లపల్లి మేఘన రెడ్డి స్వర్ణం సహా రెండు రజతాలు కలిపి మొత్తం మూడు పతకాలను సొంతం చేసుకుంది. 'హూప్' ఈవెంట్‌లో మేఘన 11.05 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని దక్కించుకోగా... 'బాల్' ఈవెంట్‌లో ఆమె 12.35 పాయింట్లు... 'రిబ్బన్' ఈవెంట్‌లో 10.50 పాయింట్లు సాధించి ఆమె రజత పతకాలను కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్‌లో మహిళల 76 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చుక్కా శ్రీలక్ష్మి 139 కేజీలు బరువెత్తి కాంస్య పతకాన్ని సాధించింది.

భారత్ x బహ్రెయిన్

షార్జా: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్ నాకౌట్ బెర్తే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గ్రూప్ 'ఎ'లో సోమవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో బహ్రెయిన్‌తో సునీల్ ఛెత్రి సేన తలపడుతుంది. కెప్టెన్‌గా ఛెత్రికిది 107వ మ్యాచ్. మాజీ సారథి బైచుంగ్ భూటియా (107) రికార్డును సమం చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ మ్యాచ్‌లో కనీసం 'డ్రా' చేసుకున్నా టీమిండియా నాకౌట్ దశకు చేరుతుంది. బహ్రెయిన్‌తో ఒకవేళ ఓడినా భారత్‌కు నాకౌట్ అవకాశాలున్నాయి. మొత్తం ఆరు గ్రూపుల్లో నాలుగు జట్లు అత్యుత్తమ మూడో స్థానం ద్వారా నాకౌట్ చేరొచ్చు. ఇప్పటివరకు బహ్రెయిన్‌తో ఏడుసార్లు ముఖాముఖీగా తలపడిన భారత్ కేవలం ఒక్కసారి (1979లో) మాత్రమే గెలిచింది. బహ్రెయిన్ ఐదింట గెలుపొందగా... మరో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
14-1-2019

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

	సెన్సెక్స్	నిఫ్టీ
మార్పు	97 ▼	27 ▼
ముగింపు	36,010	10,794

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	6,971	▼ 15
డోజోన్స్	23,995	▼ 6
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,918	▼ 25
డాక్స్	10,887	▼ 34
షాంఘై	2,554	▲ 19
నికాయ్	20,360	▲ 196

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.65	71.29
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	88.28	91.43
€	యూరో	ఎస్‌బీఐ	79.75	82.7
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.84	66.29
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.63	51.86
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.21	53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.45	20.55
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.4	11.1

ఒక పెట్టుబడి.. రెండు ప్రయోజనాలు

పన్ను ఆదా కోసం... పది మార్గాలు



- పన్ను ఆదా కోసం చివరి నెలల్లో యోచన తగదు
- ముందస్తు ప్రణాళికతో రెండింతలా లాభం
- పన్ను, ఆదాయాల పరంగా ప్రయోజనం
- ఈక్విటీ అనుసంధాన పథకాలతోపాటు అందుబాటులో పలు సాధనాలు
- దీర్ఘకాలిక వ్యూహంతోనే ఆర్థిక లక్ష్యాల సాధన

శివరామ్ ఉద్యోగంలో చేరిన కొత్తలో... పదేళ్ల క్రితం సంప్రదాయ జీవిత బీమా పాలసీ తీసుకున్నాడు. ఏటా ప్రీమియం రూపంలో రూ.40,000 వరకు చెల్లిస్తున్నాడు. ఇటీవల గృహ రుణం తీసుకోవడంతో... జీవిత బీమా పాలసీ ప్రీమియం చెల్లించడం కష్టంగా మారింది.

శ్రీరామమూర్తి ఏడాది క్రితం ఎన్‌పీఎస్‌లో చేరాడు. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ప్రయోజనంలో భాగంగా ఎన్‌పీఎస్‌లో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. దీనికి అదనంగా ఇన్వెస్ట్ చేయాలని ఉంది. కానీ, పన్ను మినహాయింపు ఉంటుందా? అన్నది సందేహం.

పన్ను ఆదా సాధనాల విషయంలో వేతన జీవులకు పక్కా ప్రణాళిక ఉండాలి. శివరామ్ పన్ను ఆదా కోసం ఎండోమెంట్ పాలసీ తీసుకుని పొరపాటు చేశానని అనుకుంటున్నాడు. ఎందుకంటే కవరేజీ తక్కువ, రాబడులు కూడా స్వల్పమే. పైగా ప్రీమియం ఎక్కువ. దీనివల్ల ఇతర పెట్టుబడుల ప్రణాళిక దెబ్బతింటుంది. ఏటా మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి పన్ను పడకుండా ఉండేందుకు ఎక్కువ మంది చివరి మూడు నెలల్లోనే పెట్టుబడుల గురించి ఆలోచిస్తుంటారు. ఆ తరహా వారికి అందుబాటులో ఉన్న పన్ను ఆదా సాధనాలు, వాటి ప్రయోజనాలు వివరించేదే ఈ కథనం.



1 ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) పథకాలు పన్ను ఆదా విభాగంలో మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఈక్విటీ ఫండ్స్‌పై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆదాయ పన్ను ఆదా కోసం దీన్ని మెరుగైన సాధనంగానే చూడొచ్చన్నది నిపుణుల అభిప్రాయం. ఒక ఆర్థిక సంవత్సరంలో మూలధన లాభాల పన్ను రూ.లక్ష మించినప్పుడే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 2018లో స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు ఉండగా... ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితులే ఉండొచ్చు. అయితే, దీర్ఘకాలం కోసం క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేసే వారు వీటి గురించి ఆందోళన చెందనక్కర్లేదు. అయితే, మొదటిసారి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తే అంతా ఒకేసారి ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయకుండా జనవరి నుంచి మార్చి వరకు మూడు సమాన వాయిదాల్లో ఇన్వెస్ట్ చేయడం మంచిదని ఇన్వెస్ట్రోగ్రఫీ సీఈవో శ్వేతా జైన్ సూచించారు.

ఫండ్స్ పేరు	3 ఏళ్ల రాబడులు
మిరే అస్సెట్ ట్యాక్స్ సేవర్	19.06
ఇన్వెస్కో ట్యాక్స్ ప్లాన్	12.67
ఆదిత్య బిర్లా ట్యాక్స్ రిలీఫ్96	12.48
ప్రిన్సిపల్ ట్యాక్స్ సేవింగ్	12.59
యాక్సిస్ లాంగ్‌టర్మ్ ఈక్విటీ	12.38
డీఎస్‌పీ ట్యాక్స్‌సేవర్	12.13



2 ఎన్‌పీఎస్



జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో గత ఐదేళ్ల కాలంలో సగటు వార్షిక రాబడులు 10.84 శాతంగా ఉన్నాయి. రిటైర్మెంట్ సమయంలో వెనక్కి తీసుకునే 60 శాతం మొత్తంపైనా పన్నును రద్దు చేస్తూ ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం... ఈక్విటీల్లో యాక్టివ్ చాయిస్ కింద 75 శాతం వరకూ ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తూ పీఎఫ్ఆర్‌డీఏ తీసుకున్న నిర్ణయాలతో ఎన్‌పీఎస్ ఆకర్షణీయంగా మారిపోయింది. ఇప్పటి వరకు ఎన్‌పీఎస్‌లో 60 ఏళ్ల సమయంలో ఉపసంహరించుకునే 60 శాతంలో 20 శాతం పైన పన్ను చెల్లించాలన్న నిబంధన ఉంది. దీన్ని తొలగించడం పెద్ద ముందడుగుగా క్లియర్ ట్యాక్స్ సీఈవో అర్చిత్‌గుప్తా పేర్కొన్నారు. 70 ఏళ్ల వరకు ఇన్వెస్ట్ చేసుకునే అవకాశాన్ని కూడా పీఎఫ్ఆర్‌డీఏ కల్పించింది. వీటిల్లో ఫండ్స్ పనితీరును గమనిస్తే...

ఈక్విటీలో 50 శాతం ఇన్వెస్ట్ చేసే విభాగం

ఫండ్ మేనేజర్	ఏడాది రాబడి	మూడేళ్ల రాబడి	ఐదేళ్ల రాబడి
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ పెన్షన్	3.37	9.56	11.31
ఎస్‌బీఐ పెన్షన్ ఫండ్	4.12	9.98	11.45
యూటీఐ రిటైర్మెంట్ సొల్యూషన్స్	3.19	9.85	11.41
కోటక్ పెన్షన్ ఫండ్	1.37	9.58	11.22
హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ ఫండ్	3.71	10.22	-

3 పెన్షన్ ప్లాన్లు



పెన్షన్ ప్లాన్లు కూడా సెక్షన్ 80సీ కింద పెట్టుబడి ప్రయోజనం అందించేవే. అయితే, ఎన్‌పీఎస్, యులిప్‌లతో పోలిస్తే ఇవి అంత ఆకర్షణీయం కావు. ప్రస్తుతం ఎన్‌పీఎస్‌లో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలకు అదనంగా రూ.50,000 ఇన్వెస్ట్‌మెంట్‌కు పన్ను మినహాయింపు ఉంది. పని చేస్తున్న కంపెనీ ఉద్యోగి పెన్షన్ కోటా కింద జమ చేస్తే అదనపు పన్ను మినహాయింపు కూడా ఉంది. కానీ బీమా కంపెనీలు అందించే పెన్షన్ ప్లాన్లకు ఈ ప్రయోజనాలు లేవు. కొత్త యులిప్ పాలసీల్లో చార్జీలు చాలా వరకు దిగొచ్చాయి. బీమా కంపెనీల పెన్షన్ ప్లాన్లలో మాత్రం చార్జీలు ఇప్పటికీ ఎక్కువగానే ఉన్నాయి. యులిప్‌ల మాదిరే బీమా పెన్షన్ ప్లాన్లలోనూ చార్జీల విషయమై పారదర్శకత తక్కువ.

4 నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్



జాతీయ పొదుపు పత్రాల్లో పెట్టుబడులకూ సెక్షన్ 80సీ పన్ను మినహాయింపు ఉంది. దీనిలో ప్రస్తుత వడ్డీ రేటు 8%. ఈక్విటీల గురించి అర్థం చేసుకునే ఓపిక, తీరిక లేని వారు, పెట్టుబడి పెట్టి నిశ్చితంగా ఉండాలనుకునే వారు దీన్ని పరిశీలించొచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగైనది. దీనిలో వచ్చే వడ్డీ ఆదాయం తదుపరి ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపునకు వీలుంటుంది. ఉదాహరణకు 2019 జనవరిలో ఎన్ఎస్‌సీలో రూ.50,000 ఇన్వెస్ట్ చేశారనుకుంటే, 2020 జనవరి నాటికి రూ.4,000 వడ్డీ ఆదాయం లభిస్తుంది. దీంతో 2019–20 ఆర్థిక సంవత్సరంలో దీనిపై మినహాయింపు పొందొచ్చు. 60 ఏళ్లు దాటిన వారికీ ఇది అనువైనదే. బ్యాంకుల్లో వీటిని పొందొచ్చు.

5 బ్యాంకు ఎఫ్‌డీలు



బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీలు) వడ్డీ 7.5–8.25% మధ్య ఉంది. సెక్షన్ 80 సీ పన్ను ఆదా కోసమయితే, ఐదేళ్ల ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీ చేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు తిరిగి ఈ డిపాజిట్‌ను రద్దు చేసుకోవడానికి ఉండదు. నెట్ బ్యాంకింగ్ ఉన్న వారు ఆన్‌లైన్‌లోనే కొన్ని క్లిక్‌లతో ఈ డిపాజిట్ చేసుకోవచ్చు. డిపాజిట్‌పై వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుందని మర్చిపోవద్దు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ

ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీ	వడ్డీ రేటు
ఐడీఎఫ్‌సీ బ్యాంకు	8.25
ఏయూస్మాల్ ఫైనాన్స్	8.00
లక్ష్మీ విలాస్ బ్యాంకు	7.75
డీసీబీ బ్యాంకు	7.75
ఆర్‌బీఎల్ బ్యాంకు	7.60

6 బీమా పాలసీలు



ఆర్జించే వ్యక్తికి మరణ ప్రమాదం ఎదురైతే, అతడు లేదా అతనిపై ఆధారపడిన వారికి ఆర్థిక ఇక్కట్లు ఎదురవుతాయి. అందుకే తమపై ఆధారపడిన వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బీమా పాలసీ తీసుకోవాలి. కానీ, అది టర్మ్ ప్లాన్ రూపంలో ఉంటే మంచిది. సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలు ఓ వ్యక్తి కుటుంబానికి సరిపడా బీమా రక్షణ అందించలేవు. ఎందుకంటే వార్షికంగా రూ.5 లక్షల ఆదాయం కలిగిన 30 ఏళ్ల వ్యక్తికి వార్షికంగా కనీసం రూ.40–50 లక్షల కవరేజీ అవసరం. ఎండోమెంట్ పాలసీ అయితే ఇంత కవరేజీ కోసం రూ.ఏడాదికి రూ.4–5 లక్షల ప్రీమియం చెల్లించాలి. కానీ రూ.5,000లోపు ప్రీమియంతోనే 30 ఏళ్ల ఆరోగ్యవంతుడైన వ్యక్తి రూ.50 లక్షల టర్మ్ పాలసీని పొందొచ్చు. టర్మ్ ప్లాన్‌కు చెల్లించే ప్రీమియానికి కూడా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం లభిస్తుంది.

7 పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్...(పీపీఎఫ్)



2019 జనవరి–మార్చి నెలకు వడ్డీ 8 శాతంగా ఉంది. వడ్డీ రేట్లు ఇటీవలి కాలంలో కాస్త తగ్గినప్పటికీ... పీపీఎఫ్ సాధనం ఇప్పటికీ మంచి సాధనంగా ఆర్థిక సలహాదారుల అభిప్రాయం. రాబడి పూర్తిగా పన్ను రహితం. దీంతో ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే మెరుగైన సాధనం అవుతుంది. ఎందుకంటే ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయం పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుందని తెలిసిందే. అయితే, ఇప్పటికే ప్రావిడెండ్ ఫండ్‌కు కొంత కేటాయించే వారు పన్ను ఆదా కోసం మరింతగా అదే బాస్కెట్‌లో ఇన్వెస్ట్ చేయడం వివేకం అనిపించుకోదు. దీనికి బదులు ఇక్కడి ప్రత్యామ్నాయ సాధనాల్లో మీకు అనువైనది ఎంచుకోవచ్చు. పీపీఎఫ్ పథకంలో పెట్టుబడులు, రాబడులకు హామీదారు కేంద్ర ప్రభుత్వం. కాబట్టి పూర్తి భద్రత ఉంటుంది. ఏ పోస్టాఫీసు శాఖ లేదా బ్యాంకు శాఖలో అయినా పీపీఎఫ్ ప్రారంభించుకోవచ్చు. ఆన్‌లైన్ సదుపాయం కలిగిన బ్యాంకులో ఎంచుకుంటే సౌలభ్యంగా ఉంటుంది.

8 సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్




వడ్డీ రేటు ప్రస్తుతం 8.7 శాతంగా ఉంది. 60 ఏళ్లు పైబడిన వారికి పన్ను ఆదా సాధనంగా ఇది ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు వార్షికంగా రూ.50,000 వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు కల్పిస్తూ గతేడాది నిర్ణయం తీసుకుంది. దీంతో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం మరింత ఆకర్షణీయత సంతరించుకుంది. దీంతో 60 ఏళ్లు దాటిన వారికి వార్షికంగా రూ.3.5 లక్షలకు పన్ను లేనట్టు అవుతుంది. 80 ఏళ్లు దాటిన వారికి రూ.5.5 లక్షలకు పన్ను ఉండదు. చిన్న మొత్తాల పొదుపు పథకాలు అన్నింటిలోకీ అధిక వడ్డీ రేటు ఉన్నది ఈ పథకంలోనే. ఈ పథకం కాల వ్యవధి ఐదేళ్లు. ఆ తర్వాత మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఒకరు గరిష్టంగా రూ.15 లక్షల వరకే ఇన్వెస్ట్ చేసుకోగలరు. స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని, మరో ఉద్యోగంలో చేరని వారు 58 ఏళ్లకే ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకునేందుకు అవకాశం ఉంది.

9 సుకన్య సమృద్ధి యోజన




కుమార్తెల పేరిట పొదుపు చేసుకుని పన్ను ఆదా పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ప్రస్తుత వడ్డీ రేటు 8.5 శాతం. వడ్డీ రేటును ప్రభుత్వ బాండ్ ఈల్డ్‌తో ముడిపెట్టినందున ప్రతీ క్వార్టర్‌కు మారుతుంటుంది. పీపీఎఫ్ పథకంలో కంటే అధిక వడ్డీ రేటు ఇందులో లభిస్తోంది. పీపీఎఫ్‌లో మాదిరే గరిష్ఠ పెట్టుబడి పరిమితి రూ.1.5 లక్షల వరకు ఉంది. పెట్టుబడి, రాబడి, ఉపసంహరణపైనా పన్ను మినహాయింపు లభిస్తుంది. కనీసం రూ.250 పెట్టుబడితో పోస్టాఫీసు లేదా ఎంపిక చేసిన బ్యాంకుల్లో దీన్ని ఆరంభించొచ్చు. తల్లిదండ్రులు తమ ఇద్దరు కుమార్తెల పేరిటే పెట్టుబడికి అవకాశం ఉంటుంది. ఇద్దరు కుమార్తెల పేరిట రెండు ఖాతాలు ప్రారంభించిన వారు రెండింటిలోనూ కలిపి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకే ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. పిల్లల వివాహాలు, ఉన్నత విద్య అవసరాలకు ఉపయోగపడే పథకం.

10 యులిప్‌లు



యూనిట్ లింక్డ్ బీమా పథకాలను 'యులిప్'లుగా పిలుస్తారు. ఈక్విటీల్లో పెట్టుబడులపై దీర్ఘకాలంలో లాభాలు గడించే వారు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, యులిప్‌లు బీమాతో కూడిన పెట్టుబడి పథకాలు కావడంతో వీటికి మినహాయింపు ఉంది. యులిప్‌ల్లో కేవలం ఈక్విటీలే కాకుండా డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం కూడా ఉంది. యులిప్ పాలసీల్లో ఈక్విటీ నుంచి డెట్ ఫండ్స్‌కు మారినా పన్ను వర్తించదు. ఫండ్స్‌లో మాదిరిగా కాకుండా, యులిప్ పాలసీల్లో డెట్ అయినా ఈక్విటీ ఫండ్స్‌లో అయినా ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా ఆర్జించే మొత్తంపైనా పన్ను ఉండదు. కాగా ఐదేళ్ల పాటు లాకిన్. గడువు లోపు ముందుగానే తప్పుకుంటే సరెండ్ చార్జీల వంటివి ఉంటాయి. యులిప్‌ల్లోనే చైల్డ్ ప్లాన్లు కూడా ఉన్నాయి. పిల్లల పేరిట తీసుకుంటే, పాలసీ గడువు లోపు సంరక్షణ చూసే తల్లి లేదా తండ్రి అకాల మరణం చెందితే, పిల్లల పేరిట పెట్టుబడి ఆగకుండా కొనసాగుతుంది.



తగ్గుతున్న ఎల్ఐసీ ఆధిపత్యం!

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మార్కెట్ వాటా 70 శాతం లోపునకు పడిపోయింది. 2018 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఎల్ఐసీ వాటా అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఉన్న 71.81 శాతం నుంచి 69.36 శాతానికి తగ్గింది. ఈ వివరాలను ఐఆర్‌డీఏ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు బీమా సంస్థల మార్కెట్ వాటా 30.64 శాతానికి పెరిగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు బీమా కంపెనీల వాటా 28.19 శాతంతో పోలిస్తే రెండు శాతానికి పైగా ఇవి వాటాను పెంచుకున్నాయి. నూతన వ్యాపార ప్రీమియం (కొత్త పాలసీల నుంచి) విభాగంలోనూ ప్రైవేటు కంపెనీలు వృద్ధిని నమోదు చేశాయి. నూతన పాలసీల్లో 8.47 శాతం వృద్ధి నమోదు చేశాయి. అదే సమయంలో ఎల్ఐసీ కొత్త పాలసీల వృద్ధి 5.99%గా ఉంది. పాత పాలసీల రెన్యువల్ ప్రీమియంలో ఎల్ఐసీ వాటా 72.31 శాతం నుంచి క్రితం ఆర్థిక సంవత్సరంలో 69.35 శాతానికి తగ్గింది.

ఎల్ఐసీ ఓపెన్ ఆఫర్‌కు పరిమిత స్పందన

ఐడీబీఐ బ్యాంకులో ఎల్ఐసీ ఇచ్చిన ఓపెన్ ఆఫర్ (వాటాల కొనుగోలు) ను మైనారిటీ వాటాదారుల్లో 22 శాతం మంది వినియోగించుకున్నారు. మెజారిటీ వాటాదారులు మాత్రం ఎల్ఐసీ యాజమాన్యంపై నమ్మకంతో ఆఫర్‌కు దూరంగా ఉన్నట్టు తెలుస్తోంది.

పసిడి... అక్కడక్కడే అయినా పటిష్టం!



నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర పటిష్టంగా కొనసాగుతోంది. వారం వారీగా ఒక్క డాలరే పెరిగి 1,286 డాలర్లకు చేరినా, సమీప కాలానికి పటిష్టమేనన్నది నిపుణుల వాదన. 11వ తేదీతో ముగిసిన వారంలో పసిడి 1,296 డాలర్ల స్థాయిని తాకడం ఇందుకు ఊతమిస్తోందని విశ్లేషణ. 4వ తేదీతో ముగిసిన వారంలో ధర 1,300 స్థాయిని చూసిన సంగతి తెలిసిందే. పసిడి ధర ఈ స్థాయిపైన రెండు, మూడు రోజులు ముగిస్తే, తిరిగి ఈ మెటల్ పూర్తి బులిష్ ధోరణిలోకి వచ్చినట్లేనని అంచనా. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, అమెరికా ఫెడ్ ఫండ్ రేటు పెంపు స్పీడ్ తగ్గినట్లేనన్న విశ్లేషణ, అమెరికా–వాణిజ్య యుద్ధం భయాలు పసిడికి కలిసి వచ్చే అంశాలు.

దేశీయంగా 472 అప్... రూపాయి కారణం!

ఇక దేశీయంగా ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో చూస్తే, పసిడి ధర 11వ తేదీతో ముగిసిన వారంలో 10 గ్రాముల ధర రూ.472 పెరిగింది. రూ.31,928కి చేరింది. అంతర్జాతీయంగా కేవలం ఒక డాలర్ ధర పెరిగినా, దేశీయంగా పసిడి ధర ఈ స్థాయిలో ఎగయడానికి డాలర్ మారకంలో రూపాయి బలహీనత కారణం. ఈ వారంలో రూపాయి విలువ 69.72 స్థాయి నుంచి 70.48 స్థాయికి పడిపోయింది. క్రూడ్ ధరలు మళ్లీ పెరుగుతాయన్న భయాలు దీనికి కారణం. ఇదే సమయంలో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ కూడా కీలక మద్దతు స్థాయిపైన 95.50 వద్ద ముగిసింది.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జనవరి-11- 2019 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	3–5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	7.1	7.35	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.5	6.85	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.7	6.5
కెనరా బ్యాంక్	6.4	7.1	6.2
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.5	6.6	6.5
కార్పొరేషన్ బ్యాంక్	6.35	6.8	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.1	7.3	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	6.75	7.1	7.5
ఐడీబీఐ బ్యాంక్	6.5	7.05	7.2
ఇండస్‌ఇండ్ బ్యాంక్	7.5	8	7.5
కోటక్ మహీంద్రా బ్యాంక్	7	7.4	7.1
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5	6.75	6.75
ఎస్‌బీఐ	6.4	6.8	6.85
సిండికేట్ బ్యాంక్	6.35	6.8	6.6
పీఎన్‌బీ	6.35	6.85	6.25
యస్ బ్యాంక్	7	7.85	7.5

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

దీర్ఘకాలం ఇన్వెస్ట్ చేయదలిస్తే...

ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఈక్విటీ



దీర్ఘకాలంలో స్థిరమైన పనితీరు చూపించిన పథకాల్లో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఈక్విటీ ఒకటి. మోస్తరు రిస్క్‌కు సిద్ధపడే వారు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు. 20 ఏళ్ల నుంచి ఈ పథకం పెట్టుబడులకు అందుబాటులో ఉన్నది. వార్షికంగా చూస్తే ఈ పథకం తన ప్రయాణాన్ని ప్రారంభించిన దగ్గర్నుంచి ప్రతీ ఏటా సగటున 23.9 శాతం చొప్పున ఇప్పటి వరకు రాబడులను అందించింది. ఈ పథకం పోర్ట్‌ఫోలియోను చూస్తే... ఎన్నో స్టాక్స్ మధ్య పెట్టుబడులు విస్తరించి ఉంటాయి. మల్టీక్యాప్ విధానంలో పనిచేస్తుంది. అయినప్పటికీ ఈ పథకంలో అధిక శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేసి ఉన్నాయి. ఇది ఒక విధంగా పెట్టుబడుల పరంగా రిస్క్ తగ్గిస్తుంది. కనీసం ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం కోసం పెట్టుబడులు పెట్టాలనుకునే వారు ఈ పథకాన్ని తప్పకుండా పరిశీలించొచ్చు.

రాబడులు..: మూడేళ్లు, ఐదేళ్ల కాలంలో ఈ పథకం పనితీరు పరంగా బెంచ్ మార్క్ నిఫ్టీ 200ను అధిగమించింది. ఏడాది కాలంలో మాత్రం నిఫ్టీ 200 కంటే వెనుకబడింది. గత ఐదేళ్ల కాలంలో కాంపౌండెడ్‌గా వార్షికంగా 24.1 శాతం రిటర్నులు ఇచ్చింది. ఫ్రాంక్లిన్ ఇండియా ఈక్విటీ, డీఎస్‌పీ ఈక్విటీ, హెచ్‌డీఎఫ్‌సీ ఈక్విటీ ఫండ్స్ కంటే పనితీరు పరంగా ముందుంది. వార్షిక రాబడులను చూస్తే... ఏడాది కాలంలో మైనస్ 6 శాతం, మూడేళ్లలో 14.81 శాతం, ఐదేళ్లలో 19 శాతం, పదేళ్లలో 18.50 శాతం చొప్పున ఇచ్చింది. గత ఏడాది కాలంలో ఈక్విటీ మార్కెట్లలో ఎక్కువ స్టాక్స్ నష్టాల్లోనే ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ పథకం పనితీరు ప్రతికూలంగా ఉంది. ఏడాది కాలంలో నిఫ్టీ 200 రాబడులు మైనస్ 2 శాతం, మూడేళ్లలో 13.88 శాతం, ఐదేళ్లలో 14.50 శాతం, పదేళ్లలో 18.50 శాతం చొప్పున ఉన్నాయి. ఒక్క ఏడాది కాలం మినహాయిస్తే దీర్ఘకాలంలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఈక్విటీ ఫండ్ తన పనితీరును నిరూపించుకుంది.

ఫండ్ రివ్యూ

పెట్టుబడుల విధానం

మోస్తరు రిస్క్‌కే పరిమితం అవుతుంది. 70 స్టాక్స్‌పైనే పోర్ట్‌ఫోలియోలో ఉండేలా చూస్తుంది. మార్కెట్లలో అస్థిరతలు పెరిగిన సమయాల్లో నగదు నిల్వలు పెంచుకోవడం, డెట్ సాధనాల్లోకి పెట్టుబడులు మళ్లించడం చేస్తుంది. అటువంటి సమయాల్లో ఈ రెండింటిలో పెట్టుబడుల శాతం 5–11 శాతం మధ్య ఉంటుంది. పెట్టుబడుల పరంగా బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. అందుకే గత ఏడాది కాలంలో ఈ పథకం పనితీరు ప్రతికూలంగా ఉండేందుకు కారణం. కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగానికీ అధిక ప్రాముఖ్యం ఇచ్చింది. సాఫ్ట్‌వేర్ స్టాక్స్ తక్కువ ధరలకు లభిస్తుండడంతో వాటిల్లో ఎక్స్‌పోజర్ పెంచుకుంది. లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో 67% వరకు పెట్టుబడులు ఉండగా, మిడ్‌క్యాప్‌లో 27 శాతం వరకు, స్మాల్ క్యాప్‌లో 4 శాతం వరకు పెట్టుబడులు ప్రస్తుతం ఉన్నాయి.

టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	9.05
ఐసీఐసీఐ బ్యాంకు	8.38
డాక్టర్ రెడ్డీస్	4.54
ఐటీసీ	4.45
టెక్ మహీంద్రా	3.95
ఇన్ఫోసిస్	3.25
టాటా స్టీల్	3.06
హిందాల్కో ఇండస్ట్రీస్	2.78
పీవీఆర్	2.64
టాటా కెమికల్స్	2.51



“ గొప్ప ఆలోచన చేస్తే సరిపోదు...
ఆ ఆలోచనను వాస్తవంలోకి తీసుకుని రావడమే గొప్పతనం!
- స్కాట్ బెల్కీ, అమెరికా వ్యాపారవేత్త ”

బొమ్మ-బొరుసు



కార్పొరేట్ ట్యాక్స్ తగ్గాలి: ఫిక్కీ

టర్నోవర్‌తో సంబంధం లేకుండా కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి రానున్న బడ్జెట్‌లో తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పారిశ్రామిక సంఘం ఫిక్కీ కోరింది. ఆర్థిక వృద్ధి పుంజుకోవడానికి, పన్నుల ఆదాయం పెరిగేందుకు ఈ చర్యను సూచించింది. అలాగే, వ్యక్తిగత ఆదాయపన్నులో గరిష్ట రేటు 30 శాతాన్ని వార్షికాదాయం రూ.20 లక్షలు దాటినవారికే వర్తింపచేయాలని బడ్జెట్ ముందస్తు సూచనల్లో భాగంగా కోరింది. ఉద్యోగుల ఒక్కో భోజనం రూ.50పైన ఇస్తున్న పన్ను మినహాయింపును రూ.200కు చేయాలని కోరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 14-1-2019

విశాఖ	445-00
చిత్తూరు	443-00
వరంగల్	435-00
చెన్నై	450-00
ముంబై	495-00
విజయవాడ	443-00
నమక్కల్	435-00
గోదావరి	443-00
13-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	433-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.00
బెంగళూరు	445-00
కోల్‌కతా	480-00
ఢిల్లీ	465-00

ద్రవ్యోల్బణం, క్యూ3 ఫలితాలతో దిశా నిర్దేశం..

- సోమవారం వెల్లడికానున్న తాజా ధరల పెరుగుదల పరిస్థితులు..
- శుక్రవారం విదేశీ మారక నిల్వల సమాచారం వెల్లడి
- ఈ వారంలోనే ఆర్ఐఎల్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాలు



ముంబై: ఐటీ దిగ్గజం టీసీఎస్‌తో ఈ ఏడాది క్యూ3 (అక్టోబర్–డిసెంబర్) ఫలితాల సీజన్ ప్రారంభమైంది. అయితే, ఇప్పటివరకు వెల్లడైన కంపెనీల గణాంకాలు .. సూచీలకు నూతన ఉత్సాహాన్ని ఇవ్వలేకపోయాయి. కానీ, అంతక్రితం రెండు వారాలు నష్టాల్లో ముగిసిన ప్రధాన సూచీలు.. ఫలితాల నేపథ్యంలో గతవారం పాజిటివ్ ముగింపును నమోదుచేశాయి. ఇక ఈ వారంలో.. ఫలితాలు ప్రకటించే దిగ్గజాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందూస్తాన్ యునిలివర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నాయి. ఈ ఫలితాలతో పాటు ద్రవ్యోల్బణ సమాచారం, అంతర్జాతీయ అంశాలు ఈ వారంలో దేశీ మార్కెట్‌కు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి.

80 కంపెనీల ఫలితాలు..

బీఎస్‌ఈలో లిస్టైన 80 కంపెనీలు ఈవారంలో (జనవరి 14–19) క్యూ3 ఫలితాలను ప్రకటించనున్నాయి. సోమవారం ఇండియా బుల్స్ వెంచర్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఫలితాలను వెల్లడించనుండగా.. మంగళవారం జీ ఎంటర్‌టైన్‌మెంట్, డెన్ నెట్‌వర్క్స్, కేపీఐటీ టెక్నాలజీస్, ట్రైడెంట్.. బుధవారం డీసీబీ బ్యాంక్, హెచ్‌టీ మీడియా, మైండ్‌ట్రీ ఫలితాలు వెల్లడికానున్నాయి. గురువారం ఆర్ఐఎల్, హెచ్‌యూఎల్, ఫెడరల్ బ్యాంక్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్, ర్యాలీస్ ఇండియా, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఫలితాలు ఉండగా.. శుక్రవారం విప్రో, ఐసీఐసీఐ లాంబార్డ్, ఎస్‌బీఐ లైఫ్, అతుల్, ఎల్ అండ్ టి ఇన్ఫోటెక్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్ ఫలితాలను ప్రకటించనున్నాయి. శనివారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాలను ప్రకటించనుంది. ఈ వారంలో వెల్లడికానున్న ఫలితాలు, ద్రవ్యోల్బణ డేటా వెల్లడి మార్కెట్ ట్రెండ్‌ను నిర్ణయించనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ వ్యాఖ్యానించారు.

స్థూల ఆర్థిక అంశాలపై దృష్టి ..

డిసెంబర్ నెల టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం, వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలు సోమవారం వెల్లడికానున్నాయి. వాణిజ్య శేషాన్ని ప్రభుత్వం మంగళవారం వెల్లడించనుండగా.. జనవరి 11 నాటికి ఉన్నటువంటి విదేశీ మారక నిల్వల సమాచారాన్ని శుక్రవారం ఆర్‌బీఐ తెలియజేయనుంది. ఇదే రోజున జనవరి 4 నాటికి మొత్తం డిపాజిట్లు, బ్యాంక్ రుణాల వృద్ధి సమాచారాన్ని ఆర్‌బీఐ వెల్లడించనుంది.

ముడిచమురు ధరల ప్రభావం..

గతవారంలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 6 శాతం ర్యాలీ చేశాయి. గతేడాది డిసెంబర్‌లో నమోదైన 50.5 డాలర్ల వద్ద నుంచి చూస్తే.. 20 శాతం పెరిగాయి. శుక్రవారం 60.55 వద్ద ముగియగా.. క్రూడ్ ధరల్లో ర్యాలీ కొనసాగితే దేశీ సూచీలకు ప్రతికూల అంశంకానున్నట్లు ఎక్సెల్ మ్యూచువల్ ఫండ్ సీఐఓ విరల్ బెరవాలా విశ్లేషించారు. ఇక ముడిచమురు ధర పెరుగుదల కారణంగా డాలరుతో రూపాయి మారకం విలువ 70.49 వద్దకు చేరుకుంది.

అంతర్జాతీయ అంశాలు ఏంచేస్తాయో..

అమెరికా–మెక్సికో సరిహద్దు వెంట గోడ నిర్మాణానికి నిధుల విషయమై ప్రతిపక్ష డెమోక్రాట్లతో విభేదాల కారణంగా మొదలైన అమెరికా షట్‌డౌన్ రికార్డు స్థాయిలో 22వ రోజుకు చేరుకుంది. ఈ షట్‌డౌన్ ముగింపు ఎప్పుడనే విషయంపై ఇంకా స్పష్టతరాలేదు. మరోవైపు యురోపియన్ యూనియన్ నుంచి యూకే వైదొలిగే ప్రక్రియకు సంబంధించి మంగళవారం కీలక సమాచారం వెల్లడికానుంది. యూకే ప్రధాని థెరిసా మే బ్రెగ్జిట్ ఉపసంహరణ డీల్‌పై బ్రిటిష్ పార్లమెంట్ ఓటు వేయనుంది. ఇక గతవారంలో అమెరికా–చైనాల మధ్య చర్చలు జరిగినప్పటికీ.. ఈ చర్చల సారాంశం ఏంటనే విషయంపై స్పష్టతలేదు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.

ఎఫ్ఐఐల నికర విక్రయాలు..




ఈనెలలోని గడిచిన తొమ్మిది సెషన్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ.3,600 కోట్లను ఉపసంహరించుకున్నారు. జనవరి 1–12 కాలంలో రూ.3,677 కోట్లను వీరు వెనక్కుతీసుకున్నట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది.

తక్షణ అవరోధశ్రేణి 36,200-36,285

మార్కెట్ పంచాంగం

జనవరి తొలివారంలో భారత్‌తో సహా ప్రపంచ ప్రధాన ఈక్విటీ మార్కెట్లన్నీ...వాటి ఇటీవలి గరిష్టస్థాయిల వద్ద పరిమితశ్రేణిలో కదిలాయి. అమెరికా–చైనా ట్రేడ్‌వార్ చర్చలు సానుకూలంగా ముగిసాయన్న వార్తలు కూడా మార్కెట్లను పెద్దగా ఉత్తేజపర్చలేకపోయాయి. ఇక్కడ ప్రధాన ఐటీ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్‌లతో పాటు ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాలు సైతం మార్కెట్ అంచనాలకంటే దిగువస్థాయిలోనే వున్నాయి. ఇన్ఫోసిస్ భారీ బైబ్యాక్ ప్రకటించినందున, ఫలితాలు నిరుత్సాహపర్చినా, షేరు గరిష్టస్థాయిలోనే ట్రేడ్‌కావొచ్చు. అయితే ఇన్ఫోసిస్, ఐటీసీ, కొన్ని కార్పొరేట్ బ్యాంకులు మినహా మిగిలిన హెవీవెయిట్ షేర్లన్నీ ముందడుగు వేయలేకపోవడం ఇన్వెస్టర్లను ఆందోళనపర్చే అంశం. సంవత్సరాంతపు సెలవుల తర్వాత సాధారణంగా జనవరి రెండోవారం నుంచి మన మార్కెట్లో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించే విదేశీ ఇన్వెస్టర్లు, ఫెడ్ తాజా ప్రకటనతో భారత్ మార్కెట్‌లో పెట్టుబడుల్ని పునఃప్రారంభిస్తారా, అమ్మకాలకు తెరతీస్తారా అనే అంశం సమీప భవిష్యత్తులో మన మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశించగలదు. ఇక సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే,

సెన్సెక్స్ సాంకేతికాలు..



జనవరి 11తో ముగిసిన వారంలో 36,270–35,750 పాయింట్ల గరిష్ట, కనిష్టస్థాయిల మధ్య ఊగిసలాడిన బీఎస్‌ఈ సెన్సెక్స్ చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 315 పాయింట్ల లాభంతో 36,010 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మార్కెట్ పెరిగితే సెన్సెక్స్‌కు 36,200–36,285 శ్రేణి గట్టిగా నిరోధించవచ్చు. గతవారంలో పలుదఫాలు అవరోధం కలిగించిన ఈ శ్రేణిపైన ముగిస్తే 36,285–36,560 పాయింట్ల నిరోధశ్రేణిని అధిగమించడం సెన్సెక్స్ భవిష్యత్ ట్రెండ్‌కు కీలకం. ఈ స్థాయిపైన ముగిస్తే క్రమేపీ 36,800–37,050 పాయింట్ల శ్రేణిని అందుకోవచ్చు. ఈ వారం పైన ప్రస్తావించిన తొలి నిరోధశ్రేణిని దాటలేకపోయినా, సోమవారం మార్కెట్ నిస్తేజంగా ప్రారంభమైనా 35750 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువన ముగిస్తేక్రమేపీ 35,380 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఈ లోపున ముగిస్తే తిరిగి 35000 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

నిఫ్టీ నిరోధశ్రేణి 10830-10,870



గతవారం 10,870– 10,733 పాయింట్ల మధ్య పరిమితశ్రేణిలో ఊగిసలాడిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 68 పాయింట్ల లాభంతో 10,795 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ పెరిగితే 10830–10,870 శ్రేణి తొలుత తీవ్ర నిరోధాన్ని కల్పించవచ్చు. అటుపైన కీలక నిరోధ శ్రేణి 10925–10,985 పాయింట్లు. గత మూడువారాలుగా పలుదఫాలు ఈ శ్రేణి అవరోధాన్ని కల్గించినందున, ఈ శ్రేణిని దాటితేనే తదుపరి అప్‌ట్రెండ్ సాధ్యపడుతుంది. ఈ వారం పైన సూచించిన తొలి నిరోధశ్రేణిని దాటలేకపోయినా, ఈ సోమవారం నిఫ్టీ బలహీనంగా ప్రారంభమైనా 10,730 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభిస్తున్నది. గత వారంరోజులుగా మద్దతునిచ్చిన ఈ స్థాయిలోపున ముగిస్తే 10,630 పాయింట్ల వద్ద క్రమేపీ తగ్గవచ్చు. ఈ స్థాయి దిగువన ముగిస్తే 10,535 పాయింట్ల స్థాయిని తిరిగి పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్

2018లో ఇళ్ల విక్రయాల్లో 7 శాతం వృద్ధి

- హైదరాబాద్‌లో అమ్మకాలు 17% డౌన్
- తొమ్మిది ప్రధాన పట్టణాలపై ప్రాప్ ఈక్విటీ నివేదిక



నివాసానికి సిద్ధంగా ఉన్న ఫ్లాట్లకు డిమాండ్ నెలకొనడంతో... 2018లో ప్రముఖ పట్టణాల్లో ఇళ్ల విక్రయాలు 7% పెరిగాయి. ప్రాప్ ఈక్విటీ అనే సంస్థ పరిశోధనలో ఈ వివరాలు తెలిశాయి. దీనిప్రకారం... దేశవ్యాప్తంగా 9 పట్టణాల్లో కొత్త యూనిట్ల ప్రారంభం 22 శాతం తగ్గి గతేడాదిలో 1.46 లక్షల యూనిట్లకు పరిమితం అయ్యాయి. 2017లో 1.87 లక్షల యూనిట్లు కొత్తగా ప్రారంభం కావడం గమనార్హం. అమ్ముడుపోని ఇళ్లు 2018లో 6 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, థానే, చెన్నై, పుణె, కోల్‌కతా, ముంబై, నోయిడా, గురుగ్రామ్‌పై ఈ నివేదిక విడుదలైంది. అంతకుముందు సంవత్సరంలో ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అసంతృప్తి ఉంది.

హైదరాబాద్‌లో..: బెంగళూరులో ఇళ్లు/ఫ్లాట్ల అమ్మకాలు 19% వృద్ధితో 38,525 యూనిట్లుగా ఉన్నాయి. చెన్నైలోనూ 40% అధికంగా 14,920 యూనిట్లు అమ్ముడుపోయాయి. కానీ, హైదరాబాద్‌లో మాత్రం అమ్మకాలు 2018లో 17 శాతం తగ్గి 15,486 యూనిట్లుగానే ఉన్నాయి. అలాగే, గురుగ్రామ్ మార్కెట్లోనూ అమ్మకాలు 16% తగ్గాయి.

స్టాక్స్ వ్యూ

టైటాన్ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.959 టార్గెట్ ధర: రూ.1,065

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో అన్ని విభాగాల్లో మంచి అమ్మకాలు సాధించామని, ఆదాయం బాగా పెరగగలదని ఈ కంపెనీ క్వార్టర్లీ ప్రీవ్యూ పేర్కొంది. దసరా దీపావళి పండగల సందర్భంగా డిమాండ్ జోరుగా కనిపించింది. ఆభరణాల విభాగం మార్కెట్ వాటా మరింతగా పెరిగింది. కొత్త స్టోర్లను జోరుగా ఏర్పాటు చేయడం, సేమ్ స్టోర్స్ సేల్స్ గ్రోత్(ఎస్ఎస్ఎస్‌జీ) పటిష్టంగా ఉండటం దీనికి ప్రధాన కారణాలు. ఈ ఆర్థిక సంవత్సరం ఆభరణాల విభాగం ఆదాయం 22 శాతానికి పెరుగుతుందని (గతంలో అంచనాలు 20 శాతం మాత్రమే) కంపెనీ అంచనా వేస్తోంది. స్మార్ట్ వాచ్ కేటగిరీలో రెఫ్లెక్స్ వావ్, ఎస్ఎఫ్ రష్ స్మార్ట్ బాండ్ వంటి కొత్త మోడళ్ల కారణంగా వాచ్‌ల విభాగం కూడా మంచి ఆదాయాన్నే సాధించనున్నది. వరుసగా ఐదేళ్ల పాటు ఒక అంకె ఆదాయ వృద్ధినే సాధించిన వాచ్‌ల విభాగం ఈ ఆర్థిక సంవత్సరంలో 16 శాతం ఆదాయ వృద్ధిని, టర్న్ అరౌండ్‌ను కూడా సాధించగలదని అంచనా. మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో 17 శాతంగా ఉన్న ఆదాయ వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం ఆరు నెలల కాలంలో 30 శాతానికి పెరగగలదని అంచనాలు ఉన్నాయి. కొత్త స్టోర్ల ఏర్పాటు షెడ్యూల్ ప్రకారమే జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ వరకూ కొత్తగా 24 తనిష్క్ స్టోర్లను ప్రారంభించింది. ఈ కంపెనీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఉత్సవ్, ప్రీన్ కలెక్షన్‌లకు మంచి స్పందన లభిస్తోంది. ఈ ఏడాది జనవరి–మార్చి క్వార్టర్లలో పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉండటం, ఖరీదు అధికంగా ఉండే వజ్రాభరణాల అమ్మకాలు పెరుగుతుండటం సానుకూలాంశాలు. రెండేళ్లలో ఆదాయం 20 శాతం, నికర లాభం 26 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధిస్తాయని అంచనా. ప్రస్తుతం 29 శాతంగా ఉన్న రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్(ఆర్ఓసీఈ) 2020–21 ఆర్థిక సంవత్సరానికల్లా 34 శాతానికి పెరుగుతుందని అంచనా.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.1,515 టార్గెట్ ధర: రూ.1900

ఎందుకంటే: ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు దాదాపు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. నికర లాభం 5 శాతం మాత్రమే పెరిగి రూ.980 కోట్లకు వృద్ధి చెందింది. ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారడం, వీటికి కేటాయింపులు జరపడం వల్ల నికర లాభం స్వల్పంగానే పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 21 శాతం వృద్ధి చెందింది. ఫీజు ఆదాయం 18 శాతం, ఇతర ఆదాయం 24 శాతం చొప్పున పెరిగాయి. మొత్తం ఆదాయం 22 శాతం ఎగసింది. వాహన రుణాలు, కార్పొరేట్ రుణాల జోరుతో రుణ వృద్ధి 35 శాతంగా నమోదైంది. రుణ నాణ్యత ఒకింత తగ్గింది. సీక్వెన్షియల్‌గా చూస్తే, స్థూల మొండి బకాయిలు 10.5 శాతం, నికర మొండి బకాయిలు 30.7 శాతం పెరిగాయి. ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాలకు కేటాయింపులు మరికొన్ని క్వార్టర్ల పాటు కొనసాగనున్నాయి. కరంట్, సేవింగ్స్ ఖాతాలు జోరుగా పెరగడంతో కాసా నిష్పత్తి 43.6 శాతానికి చేరింది. మిడ్ సైజ్ ప్రైవేట్ బ్యాంక్‌ల్లో కాసా నిష్పత్తి అధికంగా ఉన్న బ్యాంక్ ఇదే. కాసా నిష్పత్తి అధికంగా ఉంటే, నిధుల వ్యయం తక్కువగా ఉంటుంది. భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్(భాఫిన్) విలీనం వచ్చే నెలలో పూర్తికానున్నది. ఫలితంగా నికర లాభం మరింతగా పెరిగే అవకాశం ఉంది. రాబడి నిష్పత్తులు మరింతగా మెరుగుపడతాయి. రానున్న రెండు ఆర్థిక సంవత్సరాల్లో రుణ వృద్ధి 31 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలదని అంచనా. భాఫిన్ విలీనంతో మార్జిన్లు అధికంగా ఉండే సూక్ష్మ రుణ ఖాతాలు అధికంగా ఉండటంతో నికర వడ్డీ మార్జిన్ మరింతగా మెరుగుపడనున్నది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

బోర్డ్ మీటింగ్స్

ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఇండియాబుల్స్ వెంచర్స్, టాటా మెటాలిక్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్,

త్వరలో టయోటా 'బాలెనో'



న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రీమియం కారు 'బాలెనో'కి సంబంధించి తమ వెర్షన్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. జపాన్‌కే చెందిన సుజుకీ భారత విభాగం మారుతీ సుజుకీ ప్రస్తుతం బాలెనో బ్రాండుతో ఇప్పటికే దేశీ మార్కెట్లో కార్లను విక్రయిస్తోంది. అయితే, భారత మార్కెట్లో హైబ్రిడ్, ఇతర వాహనాలను పరస్పరం సరఫరా చేసుకునేందుకు సుజుకీతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో టయోటా తన సొంత వెర్షన్ బాలెనోను ప్రవేశపెట్టనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది చాలా మటుకు ప్రస్తుత వెర్షన్ తరహాలోనే ఉన్నా.. బయటి వైపు కొన్ని మార్పులు చేయొచ్చని వివరించాయి. మారుతీ సుజుకీ వెర్షన్ రేటు రూ. 5.42–రూ. 8.53 లక్షలుగా ఉంది. ఒప్పందం ప్రకారం టయోటాకు సుజుకీ.. తమ బాలెనో, ఎస్‌యూవీ విటారా బ్రెజాలను సరఫరా చేయనుండగా, ప్రతిగా టయోటా తమ సెడాన్ కారు కరోలాను సుజుకీకి సరఫరా చేస్తుంది.

కాంపోజిషన్ డీలర్లు జీఎస్టీ వసూలు చేయకుండా చర్యలు!



న్యూఢిల్లీ: కాంపోజిషన్ స్కీమ్ పరిధిలోని డీలర్లు, కొనుగోలుదారుల నుంచి జీఎస్టీ వసూలు చేయకుండా చర్యలు తీసుకునే అంశాన్ని కేంద్ర రెవెన్యూ విభాగం పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా కాంపోజిషన్ స్కీమ్ పరిధిలోని డీలర్లు, సర్వీస్ ప్రొవైడర్లు తమ ఇన్‌వాయిస్‌లలో జీఎస్టీ స్టేటస్‌ను వెల్లడించడాన్ని తప్పనిసరి చేయనుంది. జీఎస్టీ కాంపోజిషన్ స్కీమ్ కింద ట్రేడర్లు, తయారీదారులు కేవలం 1 శాతమే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ కింద 1.17 కోట్ల మంది వ్యాపారుల్లో 20 లక్షల మంది కాంపోజిషన్ స్కీమ్ ఎంచుకున్నవారే. వీరిలో ఎక్కువ మంది డీలర్లు వినియోగదారుల నుంచి అధిక జీఎస్టీ వసూలు చేస్తూ, ప్రభుత్వానికి జమ చేయడం లేదని తమ దృష్టికి వచ్చినట్టు ఓ అధికారి తెలిపారు.

ఈసారీ 3.5 శాతం స్థాయిలోనే..

ద్రవ్య లోటుపై నిపుణుల అంచనాలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యాలకు మించి ద్రవ్య లోటు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. 2018–19లో ద్రవ్య లోటును స్థూల దేశీయోత్పత్తిలో 3.3 శాతానికి పరిమితం చేయాలని నిర్దేశించుకున్నప్పటికీ ఇది ఈసారి కూడా 3.5 శాతం స్థాయిలో ఉండొచ్చని పేర్కొన్నారు. జీఎస్‌టీ వసూళ్లు అంతంతమాత్రంగా ఉండటం, వ్యయాలు పెరుగుతుండటం, పారిశ్రామికోత్పత్తి మందగిస్తుండటం తదితర అంశాలు ఇందుకు కారణంగా నిలవొచ్చని అభిప్రాయపడ్డారు. ఇక ఎన్నికల వేళ ప్రభుత్వం పలు ప్రజాకర్షక పథకాలు ప్రకటిస్తుండటం సైతం.. ద్రవ్య లోటు లక్ష్య సాధనకు అవరోధాలు కల్పించవచ్చని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ విలియం ఫాస్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్య లోటు 3.5 శాతానికి పెరగవచ్చని వివరించారు. రైతు రుణాల మాఫీ, ఇతరత్రా సబ్సిడీల రూపంలో వ్యయాలు పెరిగిపోవడం వల్ల ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై పెనుభారం పడొచ్చని తెలిపారు. 2018–19లో ద్రవ్య లోటు రూ.6.24 లక్షల కోట్లుగా ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేసినప్పటికీ.. ఇది రూ. 6.67 లక్షల కోట్ల స్థాయికి పెరగొచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ పేర్కొంది. దీంతో వరుసగా మూడో ఏడాది ద్రవ్య లోటు 3.5 శాతం స్థాయిలో నమోదైనట్లవుతుందని వివరించింది. క్రూడాయిల్ రేట్ల తగ్గుదల రూపంలో కొంత వెసులుబాటు ఉంటున్నప్పటికీ.. ద్రవ్య లోటు ఒత్తిళ్లు పెరుగుతునే ఉన్నాయని క్రిసిల్ చీఫ్ ఎకానమిస్ట్ డీకే జోషి చెప్పారు.

యాక్సిస్, ఐటీసీలో షేర్ల విక్రయం


'సూటీ' వాటాలపై కేంద్రం యోచన





న్యూఢిల్లీ: స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (సూటీ) ద్వారా యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో తనకున్న వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించడంపై కేంద్ర ఆర్థిక శాఖ దృష్టి పెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. బల్క్ లేదా బ్లాక్ డీల్స్ రూపంలో ఇది ఉండొచ్చని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 30 నాటికి సూటీకి యాక్సిస్ బ్యాంక్‌లో 9.63 శాతం, ఐటీసీలో 7.97 శాతం, ఎల్ అండ్‌టీ లో 1.80 శాతం వాటాలు ఉన్నాయి. ఎల్ అండ్‌టీ షేర్ల బైబ్యాక్ ప్రకటిస్తే పాల్గొనవచ్చని భావిస్తున్న కేంద్రం.. మిగతా రెండింటిలో మాత్రం ఆఫ్–మార్కెట్ డీల్స్ రూపంలో వాటాలు పాక్షికంగా విక్రయించే అవకాశం పరిశీలించవచ్చని అధికారి వివరించారు. ఇన్‌ఫ్రా దిగ్గజం ఎల్‌అండ్‌టీ ఇప్పటికే షేర్ల బైబ్యాక్ ప్రకటించేందుకు అనుమతుల కోసం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీని కోరుతోంది. ఈ బైబ్యాక్‌లో పాల్గొంటే దాదాపు రూ. 700 కోట్లు సమకూర్చుకోవచ్చని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 80,000 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ప్రభుత్వం ఇప్పటిదాకా రూ. 34,000 కోట్లు సమీకరించగలిగింది. గత శుక్రవారం యాక్సిస్ బ్యాంక్ షేరు 0.53 శాతం పెరిగి రూ. 666.50 వద్ద, ఐటీసీ 2.02 శాతం పెరిగి రూ. 295.40 వద్ద ముగిశాయి.

ఇంటర్నేషనల్ ఫండ్స్ మంచివేనా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్‌పై సూచనలు ఇవ్వండి..
–మృణాళిని, సికింద్రాబాద్

ఎఫ్ఎంపీలు ఎప్పుడైనా మంచి ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలే. ప్రస్తుతం ఇవి మంచి రాబడులనిస్తున్న మాట వాస్తవమే. కానీ వీటికి ఉన్న ఏకైక సమస్య లిక్విడిటీ. వీటికి లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. ఇవి స్టాక్ మార్కెట్లో లిస్టైనప్పటికీ, వీటి వాల్యూమ్స్ చాలా తక్కువగా ఉంటాయి. ట్రేడింగ్ చాలా మందంగా ఉంటుంది. ఒక నిర్దేశిత కాలానికి ఇన్వెస్ట్ చేసి, ఆ కాల పరిమితి పూర్తయిన తర్వాతనే మీరు డబ్బులు తీసుకునేట్లయితే, ఎఫ్‌పీఎమ్‌లు మంచి సాధనాలే. అలా కాకుండా ఇప్పుడు ఇన్వెస్ట్ చేసి, అవసరమైనప్పుడు తీసుకోవాలనుకుంటే కుదరదు. వడ్డీరేట్లలో హెచ్చుతగ్గుల నుంచి ఎఫ్ఎమ్‌పీలు మీరు రక్షణ కల్పిస్తాయి. మార్కెట్ రిస్క్ ప్రభావం తక్కువగానే ఉంటుంది. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఒకింత అధికంగా రాబడులు రావచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోల్చితే పన్ను ప్రయోజనాలూ పొందవచ్చు. ఎఫ్ఎమ్‌పీల్లో ఇన్వెస్ట్ చేసే ముందు స్కీమ్ ఇన్ఫర్మేషన్ డాక్యుమెంట్(ఎస్ఐడీ)ని క్షుణ్నంగా పరిశీలించండి. ఎఫ్ఎమ్‌పీని నిర్వహిస్తున్న మ్యూచువల్ ఫండ్ సంస్థ ట్రాక్ రికార్డ్‌ను కూడా మదింపు చేయండి. మీరు ఇన్వెస్ట్ చేయాలనుకున్న ఎఫ్ఎమ్‌పీ గత పనితీరు భవిష్యత్ రాబడులకు గ్యారంటీ ఇవ్వనప్పటికీ, సదరు ఫండ్ మేనేజర్ సామర్థ్యాన్ని మీరు అంచనా వేయవచ్చు.

రిటైర్మెంట్ కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో కన్నా ఎన్‌పీఎస్‌లోనే ఇన్వెస్ట్ చేయడం మంచిదని అనుకుంటున్నాను. నా నిర్ణయం సరైనదేనా?
–శ్రీనివాస్, విశాఖపట్టణం

నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) ఇప్పుడు కొంచెం మెరుగైంది. తాజా మార్పుల ప్రకారం మీరు 60 సంవత్సరాల వయస్సులో రిటైరైతే, అప్పటివరకూ ఎన్‌పీఎస్‌లో పోగుపడిన మొత్తంలో 60 శాతం వరకూ మీరు విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగిలిన 40 శాతం మొత్తంతో యాన్యుటీని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇక మీరు విత్‌డ్రా చేసుకునే 60 శాతం మొత్తంపై గతంలో కొంత వరకూ పన్ను చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు ఎలాంటి పన్ను భారం ఉండదు. అయితే ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌కు, ఎన్‌పీఎస్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చాలా తేడా ఉంది. మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు మీరే పూర్తిగా యజమాని. కానీ ఎన్‌పీఎస్‌లో అలా కాదు. ఎన్‌పీఎస్‌లో పోగుపడిన దాంట్లో 60 శాతం వరకూ మాత్రమే మీరు తక్షణం విడ్‌డ్రా చేసుకోగలరు. మిగిలిన 40 శాతం మొత్తంతో యాన్యుటీని కొనుగోలు చేయాలి. మ్యూచువల్ ఫండ్స్‌లో అయితే పెట్టుబడి కేటాయింపులు మీరు కోరుకున్న విధంగా చేసుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో పెట్టుబడుల కేటాయింపులకు పరిమితులుంటాయి. ఎన్‌పీఎస్‌లో ఒక ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే... నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉంటాయి. దేశంలో అత్యంత తక్కువ నిర్వహణ వ్యయాలు ఉన్న ఇన్వెస్ట్‌మెంట్ సాధనం బహుశా ఇదే. తాజా మార్పుల కారణంగా ఎన్‌పీఎస్ మెరుగుపడినప్పటికీ, మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై నిర్ణయాధికారం ఇతరులకు ఉంటుంది. అయితే రానున్న 10–15 ఏళ్లలో ఎన్‌పీఎస్ మరింతగా మెరుగుపడే అవకాశాలున్నాయి. అయితే ఇలాంటి పథకాలకు సంబంధించి ఇంగ్లాండ్‌లో చాలా మార్పులు వచ్చాయి. అక్కడ తమ అవసరాలకు అనుగుణంగా విత్‌డ్రాయల్ ప్లాన్‌ను మార్చుకోవచ్చు. యాన్యుటీ కొనుగోలు తప్పనిసరి కాదు. ఇక మన దేశం విషయానికి వస్తే... ఎన్‌పీఎస్ తాజా మార్పులు.. చెప్పుకోదగిన మార్పులు కావని చెప్పవచ్చు. అయితే రానున్న రోజుల్లో మరిన్ని మార్పులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే మంచిదేనా? ఇక్కడి మంచి మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేసి మంచి రాబడులు పొందవచ్చు కదా?
–జాన్, బెంగళూరు

ఇంటర్నేషనల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయడానికి ముఖ్యమైన కారణాలు రెండు. మొదటిది నాణ్యమైన కంపెనీల్లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయడం ద్వారా మంచి రాబడులు సాధించడం.రెండోది...డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందడం. ఇంటర్నేషనల్ ఫండ్స్ ద్వారా అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ కంపెనీలు అమెరికా స్టాక్ మార్కెట్లో లిస్టయినప్పటికీ, అంతర్జాతీయంగా ఆదాయాన్ని ఆర్జిస్తాయి. మన దేశంలో కూడా దిగ్గజ కంపెనీలున్నాయి. కానీ, అమెజాన్, గూగుల్.. స్థాయి దిగ్గజ కంపెనీలు లేవు కదా ! ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల డాలర్‌తో రూపాయి మారకం క్షీణత ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఇంటర్నేషనల్ ఫండ్స్‌ల్లో ఒక్క రంగానికే చెందిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ ఉన్నాయి. వాటిని వదిలేయండి. భారత, విదేశీ ఫండ్స్‌ల్లో కూడా ఇన్వెస్ట్‌చేసే ఫండ్స్ ఉన్నాయి. వాటిని పరిశీలించవచ్చు. మీరు మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు కొత్త అయితే మీ పోర్ట్‌ఫోలియోలో కనీసం 10–20 శాతం పెట్టుబడులు ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో ఉండేలా చూసుకుంటే మంచిది. మీరు ఇప్పటికే మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తున్నవారైతే, మీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు 30–40 శాతం వరకూ ఉండొచ్చు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.



Cell Point
CELEBRATING 90+ STORES IN AP
Connecting People
సంక్రాంతి
ధమాకా ఆఫర్స్
NEW ARRIVELS NEW OFFERS
Buy 1GB 8GB Get FREE @ ₹3,990
Buy NOKIA 2.1 Get FREE NOKIA 105 SS Worth ₹1,199 @ ₹7,490
Buy LAVA Z60s Get FREE @ ₹4,990
Buy 2GB 16GB Get FREE @ ₹6,490
LG K9 2GB 16GB ₹7,990 ₹5,990
micromax Covese Tab P702 2GB 16GB ₹7,990 ₹5,990
oppo A83 ₹9,990 ₹7,990
SAMSUNG J7 Duos 4GB Dual Camera ₹16,990 ₹11,490
Xiaomi NEVER BEFORE PRICE
Redmi 6 Pro ₹11,499 ₹10,299
Note 5 Pro ₹15,999 ₹13,499
Mi A2 ₹17,499 ₹14,499
Redmi 6 ₹8,999 ₹8299
vivo V11 | V11 Pro In-Display Fingerprint Scanning
సంక్రాంతి శుభాకాంక్షలు
This Sarada Sankarnthi Buy Vivo Smartphone and Get Chance to Win Gold & Exciting Gifts.
0% DOWN PAYMENT
CASH BACK UPTO 10% ON ALL LEADING BANKS
SAMSUNG సంక్రాంతి సంబరాలు
Galaxy A7 ₹21990 ₹18990
Galaxy J6 ₹11499 ₹10490
Galaxy J6+ ₹14490 ₹12990
Galaxy J4+ ₹9990 ₹8490
Galaxy A9 ₹36990 ₹33990
NOKIA Triple Joy Offer
This Sankranti, let joy overflow with the amazing finance offers.
0 Down payment 0 Interest 0 Processing fee
moto E5 Plus ₹11,999 ₹9,999 paytm mall OFFER ₹7,999
ASSURED GIFT
ASSURED GIFT
Jodi Offer @ ₹1,299
Jio కేవలం ₹501*
Cell Point
EMI FACILITY WITH BAJAJ FINSERV HDFC BANK HDB Pine Labs CAPITAL FIRST Paytm HOME CREDIT
ALL ORIGINAL ACCESSORIES AVAILABLE
విజయవాడ 0866 6629888, 6672888, 6642888 • మసీద్ స్ట్రీట్, ఏలూరు రోడ్ • విజయ టాకీస్ ఎదురుగా, ఏలూరు రోడ్ • M&M షోరూం ఎదురుగా ఎమ్.జి రోడ్డు • కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎదురుగా, పటమట • పి.టి. కాలనీ ఎదురుగా, బందరు రోడ్
గుడివాడ 08674242066 • ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా
హనుమాన్ జంక్షన్ 08656-242635 • పోలీస్ అవుట్ పోస్ట్ ప్రక్కన, విజయవాడ రోడ్డు
LACKS OF HAPPY CUSTOMERS
మా బ్రాంచీలు : • విశాఖపట్నం • శ్రీకాకుళం • పార్వతీపురం • బొబ్బిలి • రాజాం • విజయనగరం • కాకినాడ • రాజమండ్రి • అమలాపురం • తుని • తణుకు • తాడేపల్లిగూడెం • జంగారెడ్డిగూడెం • భీమవరం • ఏలూరు • విజయవాడ • గుంటూరు • గుడివాడ • హనుమాన్‌జంక్షన్ • ఒంగోలు • నెల్లూరు • తిరుపతి
*conditions apply
Designmouse 9885974411

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
14-1-2019

భోగి మంట

స్ఫూర్తిజ్వాల

బద్ధకాన్ని కాచి ఉత్తేజంగా మారుస్తున్నట్టు.. జీవిత లక్ష్యాన్ని రగులుస్తున్న భావన! భోగి మంట చుట్టూ ఉన్న అక్క, అన్న, తమ్ముడు, చెల్లి.. అందరం ఉత్సాహంగా.. ఉత్తేజంగా!

ఇంకా సూర్యుడు పలకరించని ఉదయం.. అయినా ఇంట్లో వాళ్లంతా లేచారు.. నువ్వుల నూనె మస్సాజ్ వాసన.. కాగులో వేడినీళ్లు మరుగుతున్న చప్పుడు.. వాకిట్లో భోగిమంటకు సిద్ధం చేస్తున్న సందడి.. నిద్రను సాగనంపాలని చూస్తున్నా.. వణికించే చలి.. నిద్రను దుప్పట్లో దూర్చి జోగొట్టే ప్రయత్నం చేస్తోంది. అందుకే కళ్లు తెరిచి చూసి అటు తిరిగి ఏ డిస్టర్బెన్స్‌ను చెవిన పడనివ్వకుండా దిండును చెవులకు అడ్డం పెట్టుకొని మళ్లీ కళ్లు మూసుకుంటుంటే.. నానమ్మ ఊరుకోలేదు. సర్రున దుప్పటి లాగేసింది. అత్తొచ్చి అమాంతం ఎత్తుకొని తీసుకెళ్లి వాకిట్లో కూర్చోబెట్టింది. అమ్మ



వచ్చేసి తలకు కొబ్బరి నూనె రాసింది. పిన్ని నువ్వుల నూనె పట్టించడానికి సన్నద్ధమైంది. అన్న, అక్క, తమ్ముడు, చెల్లి, బాబాయ్‌లు, నాన్న, తాతయ్య ఒకటే హడావిడి.

''నాన్నమ్మా.. నిన్న నేను ఏరి తెచ్చిన రేగు కంప కనపడట్లేదే?'' ఏడుపు గొంతుతో అన్న.

''అక్కడే ఉంటుంది నాన్నా.. సరిగ్గా చూ..'' నాన్నమ్మ పూర్తి చేసేలోపే ''ఆ.. దొరికింది దొరికింది'' అంటూ దాన్ని లాక్కొచ్చే అన్నయ్య.

రెండు చేతులను చాపి వాటి మీద చిన్న చిన్న కర్రపుల్లల్ని మోసుకొస్తున్న తమ్ముడు.

''అమ్మడూ.. ఆ పిడకల దొంత తీసుకురా...'' అక్కకు అత్త పురమాయింపు.

లోపలి నుంచి కాళ్లు విరిగిపోయిన కుర్చీని తీసుకొస్తూ ఆయాసపడుతున్న తాతను చూసి ''ఏ మండీ.. మామగారి చేతుల్లోంచి ఆ కుర్చీని లాక్కోండి'' నాన్నకు అమ్మ అప్పగించిన బాధ్యత.

''రంగమ్మా.. ఇద్దరం తీసుకెళ్దాం గొబ్బెమ్మలను'' చెల్లి (బాబాయ్ కూతురు) రిక్వెస్ట్.. మా ఇంట్లో పనులకు సహాయంగా ఉన్న రంగమ్మత్తతో .. పిడకలుగా మారిన గొబ్బెమ్మల గురించి.

ఎవరూ ఖాళీగా లేరు. అందరూ కలిసి చేస్తున్న పని. సహాయం.

భోగి మంట రాజుకుంది. అంతెత్తున లేచింది. అప్పటిదాకా ఒంట్లో ముసుగేసుకున్న చలి పారిపోయింది. భోగి మంట రిఫ్లెక్షన్‌లో అందరి మొహాలు వెలుగుతున్నాయి. ఆ ఫ్లేమ్‌నే తదేకంగా చూస్తుంటే.. నాలోనూ ఏదో ఉత్సాహం.. నాలో ఉన్న బద్ధకాన్ని కాచి ఉత్తేజంగా మారుస్తున్నట్టు.. జీవిత లక్ష్యాన్ని రగులుస్తున్న భావన!

భోగి మంట చుట్టూ ఉన్న అక్క, అన్న, తమ్ముడు, చెల్లి.. అందరినీ చూశా. అందరూ నాలాగే ఉన్నారు. ఉత్సాహంగా.. ఉత్తేజంగా!

భోగి అనగానే ఇదే సీన్ రిపీట్ అవుతూ వస్తోంది కొన్నేళ్లుగా. ఇప్పుడు అందరం పెద్దవాళ్లమయ్యాం. ఒకరి మీద ఆధారపడకుండా.. ఇంకొకరికి సాయపడేంత! అన్నట్టు మేమంతా చిన్నప్పుడు పెట్టుకున్న గోల్స్‌ని రీచ్ అయ్యాం. అయినా ప్రతి భోగి కొత్త లక్ష్యాన్ని నిర్దేశిస్తూనే ఉంది. సమష్టి కృషిని బోధిస్తూనే ఉంది. ఇంకా ఏదో సాధించాలన్న తపనను రగిలిస్తూనే ఉంది. ఎక్కడున్నా ప్రతి సంక్రాంతికి ఊరెళ్తాం. నానమ్మ, తాతల ఆశీస్సుల కోసం.. ఆ వాకిట్లో భోగిజ్వాల పంచే స్ఫూర్తి కోసం!

– సరస్వతి రమ

బ్యూటిప్స్

మొటిమలు తగ్గాలంటే...

ముఖ చర్మం జిడ్డుగా మారుతుంటే మొటిమలు, యాక్నె సమస్య బాధిస్తుంటాయి. ఈ సమస్య దరిచేరకుండా ఉండాలంటే ఇంట్లోనే కొన్నిరకాల ప్యాక్స్‌ని తయారుచేసుకొని వాడుకోవచ్చు.



- మూడు టీ స్పూన్ల దోసరసం, రెండు టీ స్పూన్ల అలోవెరా జెల్, టీ స్పూన్ పెరుగు కలిపి ముఖానికి, మెడకు పట్టించి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. రసాయనాల వల్ల ర్యాష్ ఏర్పడిన చర్మానికి కూడా ఈ ప్యాక్ సహజమైన సౌందర్యలేపనంలా పనిచేస్తుంది. మొటిమలు తగ్గుతాయి.
- దోస లేదా కీరా రసంలో పచ్చి పాలు కలిపి చర్మానికి రాయాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. అలసిన ముఖ చర్మం తాజాగా మారుతుంది.
- రెండు టీ స్పూన్ల క్యారెట్ తురుము, టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ జత చేర్చి ముఖానికి పట్టించాలి. మృదువుగా రబ్ చేసి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి జీవకాంతి లభిస్తుంది.

భోగి స్పెషల్



ఫొటో: గుంటుపల్లి స్వామి

అగ్నిదేవుడికి నమస్కారం

నాయనా.. భౌతికమైన మంటల్లో భౌతికమైనవాటిని వేస్తాం. అభౌతికమైన వాటిని అభౌతికమైన మంటల్లో వెయ్యాలి. 'అభౌతికమైన మంటలా? ఎక్కడ ఉంటాయవి?' మన ఇన్‌సైడ్. లోపల. మనమే రాజేసుకోవాలి. ఆత్మ సంస్కారంతో, ఆత్మ సంఘర్షణతో, ఆత్మ విమర్శతో, ఆత్మ సాక్షాత్కారంతో అగ్నిని రాజేసుకుని... ఇదిగో ఈ ప్రవచనకారులు ఇలాగే చెప్తారు కానీ.. భోగిమంట వేశారా? అయితే అగ్నిదేవుడికి ఒక నమస్కారం చేసెయ్యండి. ఎందుకంటారా?

● మాధవ్ శింగరాజు

నేడొక్కరోజే సూర్య ఇక్కడుండేది. 'ఏంటి!, అల్లుడుగారు అప్పుడే డ్యూటీకి హైదరాబాద్ వెళ్లిపోతాడా! సంక్రాంతికి అరిసెల పని పట్టకుండా, కనుమకు నాన్వెజ్‌ను చీల్చి చెండాడకుండా!'.

అల్లుడు సూర్య సంగతి కాదు. లోకానికి కాంతినిచ్చేవాడు, తొమ్మిదివేల యోజనాల పొడవైన రథం గలవాడు, రథానికి సప్తాశ్వాలు ఉన్నవాడు, విశ్వకర్మ కుమార్తె సంజ్ఞను వివాహమాడినవాడు, హనుమంతుడికి యాజ్ఞవల్క్యుడికి వేదశాస్త్రాలు నేర్పినవాడు.. ఆ సూర్యుడు. అతడు వెళ్లిపోతున్నాడు నేడు. దక్షిణాయనం నుంచి ఉత్తరాయణానికి ఏగుతున్నాడు. ఏం గొప్ప? భూమధ్య రేఖ మీద ఇటు సౌత్‌లో అడుగు తీసి అటు నార్త్‌లో అడుగు వెయ్యడమేగా. టోల్‌గేట్‌లు ఉంటాయా, ట్రాఫిక్‌జామ్‌లు ఉంటాయా? గగన విహారమే కదా లార్డ్ సూర్య చేసేది. అల్లుడుగారొచ్చిన రూట్‌లో జర్నీ చేస్తే తెలుస్తుంది.. అల్లుడు గొప్పో, సూర్యుడు గొప్పో.

'ఓ గొప్ప అల్లుడుగారు.. లేవండి, లేవండి, అమ్మాయి భోగి మంటలు రాజేస్తోంది. మీరూ ఒక ఎండు పుల్ల వేసి భగ్గుమనిపిద్దురు రండి. మంచుకు చలి కాపుదాం రండి, చేతులు రుద్దుకుని వేకువ చెవులకు అద్దుదాం రండి. ఎంత మంచి సంప్రదాయమో నండీ..'

ఇంకెక్కడి అల్లుడుగారు. చలిలో ఇంద్రా బస్సు దిగి, నేరుగా పడమటి దిక్కున పడగ్గదిలో వాలిపోయాడు. లేపండి లేపండి. అగ్ని లేకుండా భోగి లేదు. అల్లుడు లేవకుండా చిటపటల్లేవు.

●●●

'భోగి మంటలు ఎందుకేస్తారు?' ఎవర్రా అడిగింది? అల్లుడు గారు కాదు. ఎవరో పిలగాడు. అల్లుడుగారు మాత్రం పిలగాడు కాదా. పిలగాడేంటి? పెద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీరైతేనూ. ఇంజనీరే, సాఫ్టువేరే. అయినా పిలగాడే. ఎందుకయ్యాడు పిలగాడు? భోగి మంటలు ఎందుకేస్తారని అడిగింది అల్లుడుగారేనట. ఎవర్నడిగారట? అమ్మాయినడిగాడట. అమ్మాయి ఏం చెప్పిందట. అడిగి చెప్తానందట. ఎవర్నడిగి చెప్తానందట? భోగిమంటను అడిగి, అగ్నిదేవుళ్లను అడిగి. అగ్నిదేవుళ్లా. ఒక్కడే కదా అగ్నిదేవుడు. అతడే కదా అష్టదిక్పాలకులలో ఒకడు. 'మరి అగ్నికేతుడు, అగ్నితీర్థుడు, అగ్నిదత్తుడు, అగ్నిదేశ్యుడు, అగ్నిద్యోతనుడు, అగ్నిపూర్ణుడు, అగ్నిముఖుడు, అగ్నివేశుడు, అగ్నివర్ణుడు, అగ్నిసంభవుడు, అగ్నిసోముడు, అగ్నిహోత్రుడు .. వీళ్లంతా ఎవరు? సూర్యుడికి సినానిమ్స్ కాదా!' కాదు. పేరులో ఫైర్ ఉంటే, తీరులో ఫైర్ ఉన్నట్లేనా? అగ్నిదేవుడు ఒక్కడే. ఫైర్ ఉన్నది ఆ ఒక్కడిలోనే. మరి జమదగ్ని ఎవరు? గాడ్.. అతడు సన్నాఫ్ సత్యవతి, రుచీక. విశ్వామిత్రుడికి మేనల్లుడు. జమదగ్ని భార్య రేణుక. చిత్రరథుడు అనే వ్యక్తి మీద ఆమె మనసు పడిందని అనుమానించి, 'ఏరా బళ్లా. మీ అమ్మణి చంపాలని నీకెప్పుడైనా అనిపించిందా' అని నాజర్, రానాని 'బాహుబలి 2'లో అడిగినట్లు తన కొడుకుల్ని అడిగాడు జమదగ్ని. 'అనిపించలేదు' అన్నారు కొడుకులంతా. 'అనిపించింది' అన్నాడు ఇంకో కొడుకు పరశురాముడు. 'అయితే వధించు' అన్నాడు జమదగ్ని. తల్లిని వధించాడు పరశురాముడు. తర్వాత బోరుమన్నాడు. 'ఏడ్వకు. వరం కోరుకో' అన్నాడు జమదగ్ని పరశురాముడితో. 'నా తల్లిని బతికించు నాన్నా. అదే నాకు వరం' అన్నాడు పరశురాముడు. రేణుక బతికింది.

'అవునా! దెన్, హూ ఈజ్ జటాగ్ని?' జటాగ్ని ఎవరూ లేరు. జటాయువు ఉన్నాడు. జటాలిక ఉంది. జటాసురుడు ఉన్నాడు. వీళ్లెవరిలోనూ ఫైర్ లేదు. జఠరాగ్నిలో ఫైర్ ఉంది కానీ, అది కడుపులోని అగ్ని. డైజెస్టివ్ ఫైర్. కడుపులో ఏదైనా పడితేనే అది చల్లారుతుంది. ఏది అందుబాటులో ఉంటే అది వేసేయాలి. పిజ్జా ఉంటే పిజ్జా. బర్గరుంటే బర్గర్. వేరేదీ దొరక్కపోతే మ్యారీగోల్డ్.

'అయితే ఈ స్వామీజీలంతా ఏంటి మరీ.. కడుపులో ఇంత పడేయండి అనకుండా, కడుపులో ఉన్న దాన్ని తీసి బయట పడేయండి అంటారు!'

ఎవరు? జగ్గీ వాసుదేవ్, శ్రీశ్రీశ్రీ రవిశంకర్ వీళ్లేనా? వీళ్ల స్వామీజీలు కాదు. జ్ఞానాగ్ని పుత్రులు. అహాన్ని దగ్ధం చేసుకుని.. మహోన్నతిని, మహోజ్వలతను, సాక్షాత్కారం చేయిస్తున్నవారు.

అవును వీళ్లే. భోగి వచ్చిన ప్రతిసారీ ఇదే ప్రవచనం, ఇదే ప్రబోధన. ఇంట్లో పనికిరాని వస్తువులన్నీ భోగి మంటల్లో వేస్తాం కదా, అలాగే ఒంట్లోని పనికిమాలిన ఫీలింగ్స్ అన్నిటినీ మంటల్లో వేయమంటారు? ఎలా సాధ్యం? ఎండు పుల్లల్ని, పాత చీపుళ్లను, పిడకల్ని, చెక్క ముక్కల్ని వేసినట్లు మనసు లోపలి భావాలను అగ్నికి ఎలా ఆహుతి చెయ్యగలం? అవి భౌతికమైనవి కావే... చేత్తో పట్టుకుని, మంటల్లో వెయ్యడానికి!

నాయనా.. భౌతికమైన మంటల్లో భౌతికమైన వాటిని వేస్తాం. అభౌతికమైన వాటిని అభౌతికమైన మంటల్లో వెయ్యాలి. అభౌతికమైన మంటలా? ఎక్కడ ఉంటాయవి? మన ఇన్‌సైడ్. లోపల. మనమే రాజేసుకోవాలి. ఆత్మ సంస్కారంతో, ఆత్మ సంఘర్షణతో, ఆత్మ విమర్శతో, ఆత్మ సాక్షాత్కారంతో అగ్నిని రాజేసుకుని.. మనలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాలను అందులో కాల్చి బూడిద చేసుకోవాలి. అప్పుడు క్లీన్ అయిపోతాం. న్యూ లుక్ వచ్చేస్తుంది. కొత్త సంక్రాంతి లుక్. పండక్కి అల్లుడొచ్చాక ఇంటికి వస్తుంది కదా ఆ లుక్. రైతులు పాడి పశువులకు స్నానం చేయించి, ఎండకు మిలమిల్లాడిస్తారు కదా ఆ లుక్.

జఠరాగ్నిలో ఫైర్ ఉంది కానీ, అది కడుపులోని అగ్ని. డైజెస్టివ్ ఫైర్. కడుపులో ఏదైనా పడితేనే అది చల్లారుతుంది. ఏది అందుబాటులో ఉంటే దాన్ని వేసేయాలి. పిజ్జా ఉంటే పిజ్జా. బర్గరుంటే బర్గర్. వేరేదీ దొరక్కపోతే మ్యారీగోల్డ్.

కానీ ఆ తల్లిని అనుమానించడం బాధగా ఉంది. ఏ తల్లి? జమదగ్ని భార్య రేణుకేనా? మళ్లీ అక్కడికెందుకు వెళ్లాల్సి వచ్చింది? రేణుక చేసిందని జమదగ్ని అనుమానించిన తప్పు కన్నా, రేణుకను అనుమానించడం జమదగ్ని చేసిన పెద్ద తప్పుగా అనిపిస్తోంది. ముందు అనుమానాన్ని మంటల్లో వెయ్యాలి. అనుమానం నుంచే ఈ చెడంతా. భర్త భార్యను అనుమానిస్తాడు. పెద్దలు పిల్లల్ని అనుమానిస్తారు. యజమాని సేవకుడిని అనుమానిస్తాడు. మంచిని చెడు అనుమానిస్తుంది. లేమిని కలిమి అనుమానిస్తుంది. ద్వేషం ప్రేమను అనుమానిస్తుంది. ఒక దేశం ఇంకో దేశాన్ని అనుమానిస్తుంది.

ఎటు వెళ్తున్నాం. వెళ్లడం లేదు. వచ్చేశాం. ముంగిట్లోని భోగిమంటల దగ్గరికి. ఈ మంటల వెలుగుల్లో ముఖాలు ఎంత స్వచ్ఛంగా మారుతున్నాయి! వెలుగు స్నానం మురికిని తొలగిస్తోంది. మెల్లిగా వేకువ అవుతోంది. ఇక చాలు లేవండి, నేనొచ్చేస్తున్నాను కదా అంటున్నాడు ఆదిత్యుడు. అవునవునని తలూపుతూ వస్తున్నాయి.. ఆవూ లేగదూడ.

అవునూ.. భోగి మంటలు ఎందుకు వేస్తారు? కడుపులో ఉన్న కోపం, అసూయ, ద్వేషం.. ఇలాంటివి తీసి పడేయడానికి అని చెప్పారు నిజమే. ఫిలసాఫికల్‌గా కాకుండా, పిలకాయలకు అర్థమయ్యేలా చెబుదురూ.

పంటొచ్చే వేళ ఇంటికి పురుగూ వస్తుంది. సూర్యుడు మకరరాశిలోకి వెళ్లే వేళ చలి శిఖరానికి చేరుతుంది. పురుగును తరిమికొట్టడానికి, సంక్రాంతి నుంచి మొదలయ్యే 'కొత్త వేడి'కి అలవాటు పడటానికే భోగి మంట.

'అమ్మా.. అల్లుడుగారు లేచారా?'

'లేచారు నాన్నా.. స్నానం చేశాక భోగి మంట దగ్గరికి వస్తారట. ఈలోపు కర్పూరం తెమ్మని పంపించారు.'

అవును. అదే సంప్రదాయం. స్నానం చెయ్యకుండా దేవుడి పటం ముందుకు వెళ్లం. స్నానం చేయకుండా భోగిమంటల దగ్గరికి వెళ్లకూడదు.

భోగిమంటల్ని కర్పూరంతో వెలిగించాలి. కిరోసిన్‌తో, పెట్రోల్‌తో కాదు.

మరి ఇంత తెలిసినవాడు భోగిమంటలు ఎందుకేస్తారని అమ్మాయిని ఎందుకు అడిగాడు!

అమ్మాయికి తెలుసో లేదో తెలుసుకుందామనీ.

కొక్కొరొకోడింగ్

ఆరేళ్ల ప్రాయంలోనే కోడింగ్ నేర్చుకుని వండర్ కిడ్ అనిపించుకున్న సమైరా మెహతా.. ఎనిమిదేళ్లు వచ్చేసరికే ఓ ప్రత్యేకమైన బోర్డ్ గేమ్ రూపొందించి ఔరా అనిపించింది. తనకున్న నైపుణ్యాన్ని ఇతర పిల్లలకు కూడా అందించేందుకు గూగుల్ 'కీనోట్ స్పీకర్'గా మారి సిలికాన్ వ్యాలీలో చిన్నారుల చురుకుదనాన్ని మేలుకొలుపుతూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ఈ ఇండో- అమెరికన్.

వండర్ కిడ్



సమైరా

'కోడర్‌బన్నీజ్' సీఈఓ

ఐఐటీ– ఢిల్లీ పూర్వ విద్యార్థి అయిన రాకేశ్ మెహతా (ప్రస్తుతం ఇంటెల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్‌మెంట్ హెడ్– కాలిఫోర్నియా) తన ఇద్దరు పిల్లలు సమైరా, ఆదిత్‌లకు బాల్యం నుంచే టెక్ పాఠాలు నేర్పించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో కోడింగ్‌పై పట్టు సాధించిన సమైరా ఎనిమిదేళ్ల ప్రాయంలోనే.. తోటి పిల్లలకు కోడింగ్ పాఠాలు నేర్పించేందుకు వీలుగా 'కోడర్‌బన్నీజ్' బోర్డ్ గేమ్‌ను రూపొందించింది. తద్వారా 2016లో థింక్ ట్యాంక్ నిర్వహించిన 'పిచ్‌ఫెస్ట్'లో రెండో బహుమతి గెలుపొంది 2500 డాలర్ల ప్రైజ్‌మనీ సొంతం చేసుకుంది. ఆ తర్వాత 'కోడర్‌బన్నీజ్' పేరు మీదుగానే ఓ సంస్థను స్థాపించి తన బోర్డ్ గేమ్‌ను అమెజాన్‌లో అమ్మడం మొదలుపెట్టింది. దీనికి అనూహ్య స్పందన లభించడంతో యంగ్ సీఈఓ సమైరా జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది.

ప్రస్తుతం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ) కోడింగ్‌పై దృష్టి సారించిన సమైరా ప్రస్తుతం 'కోడర్‌మైండ్స్' అనే కొత్త బోర్డ్ గేమ్‌ను రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఈ గేమ్ ద్వారా రోబోట్స్ తయారుచేసేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలను (ఏఐ మోడల్ అభ్యాసం) సులభంగా నేర్చుకోవచ్చు. అయితే ఈ గేమ్ రూపకల్పనలో సమైరా తమ్ముడు ఆదిత్ (6) కూడా తన వంతు సహాయం చేస్తుండటం విశేషం.

రియల్ లైఫ్ పవర్‌పఫ్ గర్ల్

సమైరా ప్రతిభకు ఫిదా అయిన దిగ్గజ సంస్థ గూగుల్ ఆమెను సిలికాన్ వ్యాలీలో తమ కీనోట్ స్పీకర్‌గా నియమించుకుంది. పిల్లలకు కోడింగ్ పాఠాలు నేర్పేందుకు ఆమె చేత వర్క్‌షాపులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గూగుల్ హెడ్‌క్వార్టర్స్ మౌంటేన్ వ్యూ (కాలిఫోర్నియా)లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సంస్థ చీఫ్ కల్చరల్ ఆఫీసర్ స్టాసీ సలీవన్ సమైరాను కలిశారు. ఆమె వాక్చాతుర్యం, నైపుణ్యానికి ముచ్చటపడిన స్టాసీ.. 'సమైరా ప్రతిభావంతురాలు. తొందర్లోనే గూగుల్‌లో పూర్తి స్థాయిలో ఆమె పనిచేసే అవకాశం ఉంది' అంటూ కొనియాడారు. ఇక కార్టూన్ నెట్‌వర్క్ మార్కెటింగ్ విభాగం తమ చానల్ రూపొందించిన 'యంగ్ ఇన్‌స్పైరింగ్ గరల్స్' అనే కార్యక్రమంలో సమైరాకు చోటు కల్పించి.. 'ద రియల్ పవర్‌పఫ్ గర్ల్'గా సమైరాను అభివర్ణించింది. మైక్రోసాఫ్ట్ కంపెనీ కూడా సమైరా ప్రతిభను గుర్తించింది.

ఆసక్తే తనను నిలిపింది

''సమైరా ఇండియాస్ వండర్ కిడ్ అని నా స్నేహితులు అంటూ ఉంటారు. కానీ తను కూడా అందరిలాంటిదే. కాకపోతే కోడింగ్ పట్ల ఉన్న ఆసక్తి ఆమెను ప్రత్యేకంగా నిలిపింది. అయితే చిన్నతనంలోనే తను ఇంతటి పేరు ప్రతిష్టలు సంపాదించడం నాకు ఆనందంగా ఉన్నప్పటికీ.. కీర్తి తాలూకూ ప్రభావం తన మీద పడకూడదు అనుకుంటాను. ఒత్తిడి లేకుండా పనిచేస్తేనే సమైరా మరిన్ని విజయాలు సాధిస్తుంది'' అని రాకేశ్ మెహతా కూతురి గురించి చెప్పారు.

– సుష్మారెడ్డి యాళ్ల, సాక్షి వెబ్ డెస్క్



సమైరా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ (ఫైల్ ఫోటో)

వంద కోట్ల మందికి నేర్పుతా

''ప్రస్తుతం చాలామంది తల్లిదండ్రులు కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్లకు దూరంగా ఉంటూనే తమ పిల్లలు కోడింగ్ టెక్నిక్స్ నేర్చుకోవాలని భావిస్తున్నారు. అటువంటి వారికి కోడర్ బన్నీజ్ వంటి నాన్– డిజిటల్ బోర్డ్ గేమ్స్ ఎంతో ఉపయోగకరం. ఈ ప్రపంచంలో ఉన్న సుమారు వంద కోట్ల మంది పిల్లలకు నా సంస్థ ద్వారా కోడింగ్ నైపుణ్యాలు నేర్పించడం నా ఉద్దేశం. నాకు తెలిసీ వాళ్లంతా కోడింగ్ చేయగలిగే సామర్థ్యం కలిగిన వారే. కాకపోతే వారి కోసం కొంచెం సమయం కేటాయించడంతో పాటుగా కోడర్‌బన్నీజ్ వంటి ఈజీ గేమ్‌ల అవసరం ఉంది. అమెజాన్ ద్వారా ఏడాదిలో వెయ్యి బాక్సుల బోర్డ్ గేమ్స్ అమ్మాను. దాని ద్వారా 35 వేల డాలర్ల ఆదాయం పొందాను. నేను ఆరేళ్ల వయసులోనే కోడింగ్ నేర్చుకున్నాను. ప్రస్తుతం కీనోట్ స్పీకర్‌గా కోడింగ్ మెళకువలు నేర్పుతున్నాను. ఈ క్రమంలో అమెరికా మాజీ ప్రథమ మహిళ మిషెల్లీ ఒబామా, ఫేక్‌బుక్ సీఈఓలను కలవడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. కోడర్‌బన్నీజ్ ఐడియాను వారిరువురూ మెచ్చుకున్నపుడు ఎంతో గర్వంగా అన్పించింది. ప్రస్తుతం మా వెబ్‌సైట్‌లో రోబోటిక్స్, గేమ్, ఎడ్యుకేషన్ సెక్టార్లలో వివిధ అంశాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. వీటన్నింటిలో మా నాన్న పాత్ర ఎంతగానో ఉంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడమే నా ఆశయం'' అంటూ పదేళ్ల సమైరా తన అనుభవాలను పంచుకుంది. అంతేకాదు తన కంపెనీ పేరిట విరాళాలు సేకరించి అనాథలకు ఆశ్రయం కల్పిస్తూ పెద్ద మనసు చాటుకుంటోంది కూడా.

– సమైరా (10), 'కోడర్‌బన్నీజ్' సీఈఓ

పాశుర ప్రభాతం 30వ రోజు

గోదాప్రణీత పాశుర ప్రభాతంతో మేల్కొని శ్రీమహావిష్ణువు ధనుర్మాసమంతా భక్తుల హృదయ సామ్రాజ్యాలను ఏలుకునే ప్రభాభాసుడు. సర్వదా ఆనందాన్ని ప్రసాదించే పుండరీకాక్షునికి భక్తిరసభావ నీరాజనం తిరుప్పావై.

"వఙ్గక్కడల్ కడైన్ద మాదవనై క్కేశవనై
తిఙ్గళ్ తిరుముగత్తు చ్చేయిళైయార్ శెన్రిఱైఞ్జి
అఙ్గప్పఱై కొణ్డవాత్తై, యణిపుదువై
పైఙ్గమల త్తణ్డెరియల్, పట్టర్ పిరాన్ కోదైశొన్న
శఙ్గత్తమిళ్ మాలై ముప్పదుమ్ తప్పామే
ఇఙ్గిప్పరిశురైప్పారీరిరణ్డు మాల్వరైత్తోళ్
శెఙ్గణ్, తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్
ఎఙ్గుమ్ తిరువరుళ్ పెత్తిన్బురువ రెమ్బావాయ్".


భావం: క్షీరజలధిని మధించి దేవదేవతలు సాధించిన మహాలక్ష్మిని వరించిన మాధవుడు, బ్రహ్మరుద్రులకు నిర్వహణ చేయగల పురుషోత్తముడు. అనంతజీవకోటిలో అణువణువూ నిండిన పరంధాముడు గోకులంలో



జన్మించి పామరులను చరితార్థులను గావించి, వ్రతసాధనం పరను అనుగ్రహించినవాడై, తనను చేరిన వారిని తరింపజేసిన సద్గుణం గలవాడై గోదాదేవి పాశురాలలో వెలుగొందాడు. పవిత్రమైన ఆలోచనలకూ, భక్తిభావనలకూ సుహృదయ క్షేత్రంలో అలరారే అంతర్యామిత్వమే ఆలంబనయనే ప్రబోధం గోదాదేవి పాశుర ప్రభాతం.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
14-1-2019

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఫస్ట్ ఇయర్‌లో ఒక అబ్బాయిని లవ్ చేశాను కానీ కొన్ని కారణాల వల్ల విడిపోయాం. తర్వాత ఇంకెప్పుడు లవ్ జోలికి పోవద్దని అనుకున్నా. కొన్నాళ్ల తర్వాత నా టెన్త్ క్లాస్‌మేట్ నా లైఫ్‌లోకి వచ్చాడు. తనకి నా స్టోరీ మొత్తం చెప్పాను. 'ఈ రోజుల్లో పాస్ట్ లేనివాళ్లే ఉండరు. నాకు వాటితో సంబంధం లేదు' అన్నాడు. తన మాటలని గుడ్డిగా నమ్మినా. త్రీ మంత్స్ మంచిగా ఉన్నాడు. కానీ తర్వాత నుంచి 'ఎవరితోనూ మాట్లాడొద్దు, అది చెయ్యొద్దు. ఇది చెయ్యొద్దు' అని టార్చర్ మొదలుపెట్టాడు. మా క్లాస్ అబ్బాయిలతో పిక్ దిగినా ఊరుకోడు. జూనియర్ అబ్బాయిలతో మాట్లాడినా ఒప్పుకోడు. రోడ్డుమీద నిలబెట్టి బూతులు తిడతాడు. అందరూ చూస్తుండగానే కొడతాడు. 'నువ్వు అట్ల చేస్తావ్, ఇట్ల చేస్తావ్.. నీ పాస్ట్ ఇట్లా..' అంటూ చాలా గలీజ్‌గా మాట్లాడతాడు. వదిలేద్దామంటే నా వల్ల అయితలేదు. నన్ను ఏం చెయ్యమంటారు అన్నయ్యా?

- సుష్మ

గట్ల మాట్లాడుతున్నాడా పిల్లా... గలీజ్ గాడు...!
అమ్మాయి మీద చెయ్యి లేపుతడా..
ఆడి చేతులు వడా..
నోటికొచ్చినట్టు మాట్లాడుతుండు చిల్లరగాడు....
అసలేమనుకుంటుండు సచ్చినోడు...
ఒక్క గుద్దు గుద్దిన్నంటే దిమాగ్ ఖల్లాస్ అయితది కొడుకుది..
గిరా గిరా తిప్పి కిందకేసి ఉతికితే....
'ఉతికితే ఏమైతది సార్??'
నీలూ..! ఉతకాలి ఇలాంటి కొడుకుల్ని ఉతకాలి.
బండకేసి కొట్టాలి...!
వాషింగ్ పౌడర్ వేసి బకెట్లో సటా సట్ కొట్టాలి...
నురుగులు కక్కే దాకా గుంజాలి.. రపారప్ గుంజాలి..
అప్పుడు కౌంపౌన్డ్ వాలికి దిగబెట్టి కొడుకును ఆరెయ్యాలి.
'అప్పుడేమౌవుద్ది సార్!'
అర్థమయ్యిద్ది నీలూ! సుష్మకి బ్రదర్ ఉన్నాడని.. తిత్తి తీస్తాడని... తాట ఏరేత్తడని... ఏమనుకుంటుండు బద్మాష్.. ఆడపిల్లను బూతులు తిడ్తాడు...చెయ్యి ఎత్తుతాడు.. సాడిస్ట్ కొడుకు! అనుమానం ఉంటే దొబ్బెయ్యాలి. హౌలాగాడు.. ప్రేమ పేరుతో టార్చర్ పెడతాడు.. ఖబర్దార్!!
'అట్లగాద్సార్! నామాటినండి సార్.. ఈ ఉతకడంలో ఎక్స్‌పర్ట్స్ సార్ పోలీసోళ్లు! పోలీస్టేషన్‌కి తీసుకెళ్లి ఆ జింక్‌చకా జింక్‌చకా... జింక్‌చకా.. జింక్‌చకారే....'

lovedoctorram@sakshi.com


● రవితేజ

టైమ్ మిషన్ ఎక్కుతున్నారు

పుట్టినరోజుకి ఎవరైనా ఒక సంవత్సరం ముందుకెళ్తారు. కానీ రవితేజ మాత్రం ఓ 20 ఏళ్లు వెనక్కి వెళ్లబోతున్నారట. టైమ్ మిషన్ కానీ ఎక్కబోతున్నారా? అంటే.. అలాంటిదే. దాని పేరే 'డిస్కో రాజా'. రవితేజ లేటెస్ట్ చిత్రం ఇది. ఈ సినిమా 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగనుందని సమాచారం. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాలో రవితేజ తండ్రీ కొడుకుల్లా ద్విపాత్రాభినయం చేయనున్నారు. రవితేజ పుట్టినరోజు (జనవరి 26)న ఈ చిత్రం ప్రారంభం కానుందట. రవితేజతో 'నేల టిక్కెట్టు' నిర్మించిన రామ్ తాళ్లూరి ఈ చిత్రానికి నిర్మాత. ఇందులో పాయల్ రాజ్‌పుత్, నభా నటేశ్, ప్రియాంకా జవాల్కర్ హీరోయిన్లుగా నటించనున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్‌పుత్ అంధురాలి పాత్రలో కనిపించనుండటం విశేషం. ఈ చిత్రం ఈ ఏడాది ద్వితీయార్ధంలో రిలీజ్ కానుంది.

పాంచ్ పటాకా

గతేడాది సిల్వర్ స్క్రీన్ మీద ఒక్కసారే కనిపించారు క్యాథరీన్. అదీ తమిళ చిత్రం 'కలకలప్పు 2'లో. 2018లో తనను స్క్రీన్ మీద బాగా మిస్ అయిన ఫ్యాన్స్‌కు ఈ ఏడాది పాంచ్ పటాకా ఇవ్వనున్నారు. ఈ ఏడాది క్యాథరీన్‌కు 5 రిలీజులున్నాయి. 'అత్తారింటికి దారేది' తమిళ రీమేక్ 'వందా రాజావాదాన్ వరువేన్'లో హీరోయిన్‌గా చేస్తున్నారు. 'నీయా' సీక్వెల్ 'నీయా 2', 'అరువమ్', ఏడేళ్ల తర్వాత మలయాళంలోకి కమ్‌బ్యాక్ ఇస్తూ చేసిన 'అన్నెకిల్లమ్ అల్లెన్‌కిల్లమ్' సినిమాలు రిలీజ్‌కు రెడీ అయ్యాయి. ఇంకా తెలుగులో సంతోష్ శివన్, రవితేజ కాంబినేషన్‌లో చేయనున్న సినిమాలో హీరోయిన్‌గా సెలెక్ట్ అయ్యారు. ఇవే కాకుండా విజయ్ దేవరకొండ సినిమాలోనూ చాన్స్ కొట్టేశారని టాక్. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో రాశీ ఖన్నా, తమిళ భామ ఐశ్వర్యా రాజేశ్, బ్రెజిల్ మోడల్ ఇసబెల్లా హీరోయిన్స్‌గా కనిపించనున్నారు. ఇందులో మరో హీరోయిన్‌గా క్యాథరీన్ కూడా ఎంపికైనట్టు సమాచారం. మొత్తానికి గతేడాది వచ్చిన గ్యాప్‌ని ఈ ఏడాది గ్యాప్ లేకుండా సినిమాలతో నింపేసినట్టున్నారు క్యాథరీన్.


● సూర్య


● కేథరీన్

మనసు బంగారం

సూర్య లేటెస్ట్ సినిమా 'యన్‌జీకే' షూటింగ్ పూర్తయింది. కొన్ని నెలలుగా తనతో పాటు సినిమా అద్భుతంగా రావడానికి కృషి చేసిన టీమ్ అందర్నీ అభినందించాలని భావించారు సూర్య. ఈ సినిమాకు పని చేసిన దాదాపు 120 మందికి గోల్డ్ కాయిన్స్‌ను బహుమతిగా అందించారు. దాంతో 'మీ మనసు బంగారం' అని సూర్యకు కితాబులు ఇస్తోంది కోలీవుడ్. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో సూర్య, సాయి పల్లవి జంటగా యస్ఆర్ ప్రభు నిర్మించిన చిత్రం 'యన్‌జీకే' (నంద గోపాల కుమార్). పొలిటికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది.


● రాజ్‌కుమార్ హిరానీ

హిరానీ టూ?

'మీటూ' ఉద్యమంలో ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలలో చాలామంది లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొన్నారు. తాజాగా '3 ఇడియట్స్, సంజు' వంటి చిత్రాలను తెరకెక్కించిన అగ్రదర్శకుడు రాజ్ కుమార్ హిరానీపై 'సంజు' సినిమాకి దర్శకత్వ శాఖలో పని చేసిన ఓ మహిళ ఆరోపించారు. ''సంజు' నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో హిరానీ నన్ను లైంగికంగా వేధించారు. ఆయన్ని ఓ తండ్రిలా భావించాను. మా నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు. ఆ పరిస్థితుల్లో ఉద్యోగం పోతే మళ్లీ ఉద్యోగం సంపాదించడం కష్టం అవుతుందని సైలెంట్‌గా ఉండిపోయాను'' అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని హిరానీ ఫిల్మ్ మేకింగ్ పార్ట్‌నర్ విదూ వినోద్ చోప్రా, ఆయన భార్య అనుపమా చోప్రాలు రచయిత అభిజిత్ జోషీకు మెయిల్ చేశారామె. అయితే ఈ ఆరోపణలు అసత్యమని, తన ఇమేజ్‌ని డ్యామేజ్ చేసే ప్రయత్నమే అని కొట్టిపారేశారు హిరానీ.టాప్ డైరెక్టర్‌పై ఇలాంటి ఆరోపణ రావడం బాలీవుడ్‌కి పెద్ద షాకే.


● శ్రీ రితిక

రహస్యం ఏంటో?

సాగర్ శైలేష్, శ్రీ రితిక జంటగా సాగర శైలేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రహస్యం'. తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మించారు. ఈ సినిమా ప్రమోషన్ పోస్టర్‌ను శ్రీకాంత్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''రామ సత్యనారాయణగారు మంచి నిర్మాత. మంచి ప్లానింగ్‌తో సినిమాని విడుదల చేస్తారు. 'రహస్యం' ట్రైలర్ చాలా బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు.''వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిది. 'రహస్యం' టైటిల్ ఎందుకు పెట్టామన్నది తెరపైనే చూడాలి. సాగర్ శైలేష్ ప్రాణం పణంగా పెట్టి తీశారు. దర్శకులు రామ్‌గోపాల్ వర్మ, పూరి జగన్నాథ్, మారుతి, నిర్మాత రాజ్ కందుకూరి గార్లు విడుదల చేసిన ట్రైలర్లకు మంచి స్పందన వచ్చింది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు రామసత్యనారాయణ.

ఫెయిల్యూర్ రాకూడదని పని చేస్తాను

''ఎవరైనా సక్సెస్ కోసం పని చేస్తారు. నేను ఫెయిల్యూర్ రాకూడదని పని చేస్తాను. ఫెయిల్యూర్ భయం నాకు ప్రతి క్షణం ఉంటుంది. డైరెక్టర్‌గా నేను సక్సెస్ అయ్యాను. రైటర్‌గా ఉన్నప్పుడు నేను చాలా ఫెయిల్యూర్స్ చూశా. మనం చేసిన పనికి ప్రశంస రాకపోతే ఉండే బాధను అనుభవించాను. ఇప్పుడు ఆ బాధ లేకుండా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నా'' అని అనిల్ రావిపూడి అన్నారు. వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన మల్టీస్టారర్ మూవీ 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' అనేది ఉపశీర్షిక. 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి చెప్పిన విశేషాలు...


● అనిల్ రావిపూడి

'ఎఫ్ 3' చేయాలనే కోరిక ఉంది. 'ఎఫ్ 2' కి ఆడియన్స్ సక్సెస్ ఇచ్చారు కాబట్టి నా కోరికకు బలం కూడా వచ్చింది. వెంకీగారు, వరుణ్ కూడా ఎగ్జైట్‌గా ఉన్నారు. వెంకీగారు, వరుణ్‌కి తోడుగా ఇంకో హీరో వస్తారా? లేక అసలు ఎలా ఉండబోతుందన్న వివరాలు భవిష్యత్‌లో తెలుస్తాయి.

- ఈ సినిమాకు ముందు మూడు యాక్షన్ సినిమాలు (పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్) చేశాను. యాక్షన్ సన్నివేశాలు లేకుండా ఓ ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా చేద్దామనుకున్నాను. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి, పెళ్లాం ఊరెళితె' తరహాలో ఉండే సినిమా చేద్దామని 'ఎఫ్ 2' చేశాను. 'రాజా ది గ్రేట్' సినిమా చిత్రీకరణ చివరి దశలో 'ఎఫ్ 2' ఆలోచన వచ్చింది.
- జంధ్యాలగారు గొప్ప రైటర్. గొప్ప దర్శకులు. బోర్ కొడితే ఆయన సినిమాలు చూస్తాను. ఆయన్ను ఫాలో అవుతాను కానీ ఆయన్ని కాపీ కొట్టను. అలాగే ఈవీవీగారు, కృష్ణారెడ్డిగారి సినిమాలు కూడా బాగా ఇష్టం. వీరిని ఇన్‌ఫ్లూయెన్స్ అవుతున్నానన్న మాట మాత్రం వాస్తవం. కానీ నా స్టైల్ ఆఫ్ నరేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాను.
- నాది తక్కువ.. నీది ఎక్కువ, ఒకరికి ఎక్కువ డైలాగ్స్ ఉన్నాయి. ఒకరికి తక్కువ ఉన్నాయి అన్న తలనొప్పి నాకు లేదు ఈ సినిమా సెట్‌లో. అందరూ నమ్మి ఈ సినిమా చేశారు. మంచి ఫలితం వచ్చింది. వెంకటేశ్‌గారు కొన్ని ఐడియాస్ ఇచ్చారు. సినిమాలో వెంకీ ఆసనం, డాగ్ ఎపిసోడ్‌కి ఆడియన్స్ బాగా కనెక్ట్ అయ్యారు. వెంకీగారు గ్రేట్ యాక్టర్. రిజల్ట్ పట్ల ఆయన ఫుల్‌హ్యాపీ. వరుణ్ ఇప్పటివరకు కామెడీ జానర్ చేయలేదు. వెంకీగారితో వరుణ్ కామెడీ టైమింగ్ ఎలా ఉంటుందా? అనుకున్నాం. బాగా చేశారు. తెలంగాణ డైలాగ్స్ బాగా పలికారు. సినిమాలో ప్రకాష్‌రాజ్‌గారికి 'గుండమ్మ కథ' అంటే ఎంత పిచ్చో నాకు అంత పిచ్చి. అదే సినిమాలో పెట్టాను. ఈ సినిమాలో ముందుగా 'అంతేగా.. అంతేగా..' డైలాగ్స్ అనుకోలేదు.
- నీ సినిమాల్లో గ్లామర్ ఉండదేంటి? అన్నారు కొందరు. అలాంటి ఆడియన్స్ కూడా ఉన్నారని రియలైజ్ అయ్యి ఈ సినిమాలో కొంచెం గ్లామర్ సీన్స్ పెంచాను. కానీ బోర్డర్ దాటి చేయలేదు. నా పెళ్లి తర్వాతే రాసుకున్నాను ఈ సినిమా స్క్రిప్టని (నవ్వుతూ). నా వైఫ్ చూసి చాలా స్పోర్టివ్‌గా తీసుకుంది.
- నేను న్యూస్, కరెంట్ అఫైర్స్ బాగా ఫాలో అవుతాను. సినిమానే నాకు లైబ్రరీ. సినిమానే నాకు పుస్తకం. అందుకే నేను చేసే సినిమాల్లో కరెంట్ అఫైర్స్ ట్రెండ్ కనిపిస్తుంది. బాల్యంలో ఎంత బాగా చదివేవాడినో అంతే బాగా సినిమాలు చూసేవాడిని. నా గురించి ఇప్పుడు అరుణ్ ప్రసాద్‌గారు గర్వంగా ఫీల్ అవుతున్నారు. ఆయన తీసిన 'గౌతమ్ ఎస్ఎస్‌సి' సినిమాకు నేను వర్క్ చేశాను. ఆయనంటూ లేకపోతే నేనూ ఇండస్ట్రీలో లేను.
- కాస్త టైమ్ తీసుకుని తర్వాత సినిమా స్టార్ట్ చేస్తా. బాలకృష్ణ, వెంకటేశ్ గార్లకు ఐడియాలు చెప్పాను. బయోపిక్స్ పట్ల ఆసక్తి ఉంది. ప్రస్తుతం బాలీవుడ్‌కు వెళ్లే ఆలోచన లేదు.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
14-1-2019



ఏడు ఎకరాల పొలం. సగం చేపల చెరువు, సగం పచ్చని పంటలు. పొలం మధ్యలో చిన్న దీవి. ఆ దీవిలో అందమైన పొదరిల్లు. నిద్ర లేచేది పొలంలోనే, రోజంతా శ్రమించేది పొలంలోనే. విశ్రమించేదీ పొలంలోనే. హరిత విప్లవం, నీలివిప్లవాలను ఇరుగుపొరుగున నడిపిస్తున్న రైతు ఆమె. పేరు దంతులూరి సత్యవతి, వయసు డెబ్బై రెండేళ్లు. ఊరు గుంటూరు జిల్లా, అమర్తలూరు మండలం, పెదపూడి గ్రామం.

వనమాత

ఇల్లు చల్లన.. నేలతల్లి పచ్చన

భర్త వాసుదేవరాజు, సత్యవతి.. ఇద్దరే ఉంటారా ఇంట్లో. ఇంటి చుట్టూ ఉన్న పొలంలో ఎర్రచందనం, శ్రీగంధం చెట్లతోపాటు కొబ్బరి, అరటి, సపోటా, బత్తాయి, నిమ్మ, పైనాపిల్, మామిడి, పనస, బొప్పాయి, జామ, చెర్రీ వంటి పండ్ల చెట్లున్నాయి. వాటి మధ్యలో లవంగాలు, కలబంద, కొండపిండాకు, తిప్పతీగ, నేల ఉసిరి, వావిలాకు, తులసి, తుంగకాయలు, పిప్పళ్లు, కచోరాలు, నేలవేము, పెద్ద ఉసిరి వంటి ఔషధ మొక్కలున్నాయి. చింత, కర్రపెండలం, తమలపాకు, కందిమొక్కలు, రకరకాల కూరగాయల మొక్కలు అల్లం, పసుపు... ఇదీ అదీ అని చెప్పడానికి వీల్లేనన్ని రకాలున్నాయి. మామిడిలో ఆరు రకాలు, అరటిలో ఐదు రకాలున్నాయి. మామిడి అల్లం, నిమ్మగడ్డిని కూడా పెంచుతున్నారు. ఇంకా ఆశ్చర్యంగా కుంచె చీపుళ్ల గడ్డి చెట్లు కూడా గట్ల మీద ఉన్నాయి. కరివేపాకు, తోటకూర, పెరుగు ఆకు, పాల ఆకు, మెంతి ఆకు, పుదీన, కొత్తిమీర వంటి వంటల ఆకులతోపాటు దవనం, మరువం వంటి సువాసన భరితమైన ఆకులు కూడా ఉన్నాయి. ఇన్ని రకాల చెట్లుంటే తేనెటీగలు ఊరుకుంటాయా. తేనెపట్టు పెడతాయి. వాటి నుంచి తేనె తీయించి స్వయంగా మందులు తయారు చేస్తారు సత్యవతి. తన పొలంలో ఉన్న ఔషధ మొక్కల గింజలు, ఆకులతో (32 రకాల దినుసులు) ఔషధనూనె తయారు చేయడంలో నేర్పరి ఆమె. ఒళ్లునొప్పులు, కీళ్ల నొప్పులు తగ్గడానికి, జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి, చుండ్రు, సోరియాసిస్ పోవడానికి రకరకాల ఔషధాల కాంబినేషన్‌లో నూనెలు చేస్తారామె. ఔషధాల ఆకులను మూడు గంటల సేపు ఉడికించి చల్లార్చి తైలాన్ని తీస్తారు. ముఖం మీద మచ్చలు పోవడానికి కూడా ఆమె దగ్గర ఓ ఫార్ములా ఆయిల్ ఉంది. దేహారోగ్యం కోసం మాదీఫల రసాయనం చేసి రుచి చూపిస్తారు. మేధో వికాసానికి సరస్వతి లేహ్యం చేసిస్తారు. అడిగిన వారికి వీటన్నింటినీ చేసివ్వడం ఆమెకిష్టమైన వ్యాపకం. ''ఉచితంగా చేసివ్వడం ఎందుకు, ముంబయిలో వీటికి మంచి మార్కెట్ ఉంది, కేరళ వాళ్లు అమ్మేది వీటినే. ముంబయికి రండి'' అని ఆహ్వానం వచ్చిందామెకి. ''నా పొలాన్ని వదిలి ఎక్కడికీ వచ్చేది లేదు. నేను వీటిని డబ్బు కోసం చేయడం లేదు. ఇష్టం కాబట్టి చేస్తున్నాను. వ్యాపారం కోసం కాదు'' అన్నారామె.

పిల్లల ఆరోగ్యం తల్లి చేతిలో



ప్రతి ఒక్కరూ కాలంతోపాటు మారాల్సిందే. అయితే ఆ మార్పు మనకు మంచి చేసేదై ఉండాలి. మా చిన్నప్పుడు పండ్లతో చేసే జామ్‌ల గురించి తెలియదు. ఇరవై ఏళ్ల నుంచి నేను మా పొలంలో పండిన పండ్లతో జామ్‌లు చేస్తున్నాను. ఉసిరి, బొప్పాయి జామ్‌లు ఎప్పుడూ ఉంటాయి. కలబంద గుజ్జు, పటిక బెల్లం, గోధుమపిండి, నెయ్యి కలిపి హల్వా చేసి ఆడపిల్లలకు పెడతాను. అది తింటే గర్భాశయ సమస్యలు ఇట్టేపోతాయి. నా దగ్గర లేని మొక్క ఎక్కడ కనిపించినా తెచ్చుకుంటాను. బళ్లారి నుంచి గాయం ఆకు, శ్రీశైలం అడవుల నుంచి సరస్వతి ఆకు తీగలు తెచ్చుకున్నాను. నా దగ్గర నల్లమందు ఆకు కూడా ఉంది. ప్రకృతి మనకు నల్లమందు ఆకునిచ్చింది మత్తు కోసం కాదు, వైద్యం కోసం. ఆ ఆకుని పూత మందుల్లో వాడితే గాయం ఇట్టే మాడిపోతుంది. నేలతల్లి మనకు అన్నీ ఇచ్చింది. ఆ నేలతల్లిని కాపాడుకోవాలి. మంచి పంటల్ని పండించుకుని, చక్కగా వండుకుని తిని హాయిగా బతకాలి. రోజంతా ఒంటిని కష్టపెట్టాలి. ఆరోగ్యంగా ఉండాలి. అంతే తప్ప... తల్లులు టీవీల ముందు కూర్చుని పిల్లలకు అడిగినంత డబ్బిచ్చి, బేకరీలకు పంపిస్తే వాళ్లు మంచి తిండి తింటారా? పిల్లల ఆయుష్షు పెంచడం, తుంచడం తల్లి చేతిలోనే ఉంది. సిటీల్లో నేల లేకపోతే కుండీలోనే చిన్న వేప మొక్కను పెట్టి, రోజూ నాలుగు ఆకులు తింటుంటే పిల్లలకు పళ్లు పాడవుతాయా?

ఒంటికి రోజూ పని

ఈ వయసులో ఇంత ఆరోగ్యంగా ఇన్ని పనులు చక్కబెట్టడం వెనుక ఆమె ఆరోగ్య రహస్యం రోజూ శ్రమించడమే. ఆమె ఉదయం ఐదు గంటలకు నిద్ర లేస్తారు. ఏడు గంటలకు రాగి జావ తాగుతారు. పదకొండు గంటలకు భోజనం, మధ్యాహ్నం మూడు గంటలకు రాగి లేదా జొన్న అట్టు, సాయంత్రం ఐదు గంటలు దాటితే భోజనం. ఇది ఆమె రాత్రి భోజనం. మధ్యలో పండ్లు తీసుకుంటారు. రాత్రి ఎనిమిదిన్నర తర్వాత తొమ్మిది లోపు నిద్రపోతారు. పాలిష్ పట్టని బియ్యపు వరి అన్నం, రాగి, జొన్న అన్నం తింటారా దంపతులు. ఎంత ఆశ్చర్యంగా అనిపించినా సరే. ఆమె మాంసం మానేసి యాభై ఏళ్లయింది, ఆరేళ్ల నుంచి చేపలు కూడా మానేశారు. ఏడాది కాలంగా గుడ్డునూ వదిలేశారు. ఇప్పుడామె పూర్తి శాఖాహారి. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల పొడ కూడా సోకని పూర్తి సేంద్రియ సేద్యం ఆమెది.

వ్యయసాయ ప్రస్థానం

ఈ వనమాత వ్యవసాయ కుటుంబంలో పుట్టి, వ్యవసాయ కుటుంబంలో అడుగుపెట్టి, సాగుతోనే జీవితాన్ని నిలబెట్టుకున్నారు. రెండు జతల ఎడ్లు, పాతిక గేదెలు, వంద గొర్రెలు, లెక్కపెట్టలేనన్ని కోళ్లు ఆమె ప్రపంచం. రాజుగారు (ఆమె భర్త) ప్రయాణించడానికి ఓ గుర్రం ఉండేది. ఆ జ్ఞాపకాలను ఇలా గుర్తు చేసుకున్నారామె. ''మాది బాపట్ల దగ్గర మంతెన వారి పాలెం. అన్ని రకాల పండ్లు తిన్న బాల్యం నాది. అత్తగారిల్లు తెనాలి దగ్గర చిన గాదెలవర్రు. నేను, నా భర్త 1967 నుంచి సొంతంగా సేద్యం చేస్తున్నాం. సత్తెనపల్లిలో పన్నెండెకరాలు కొని చెరకు, పసుపు వంటి రకరకాలు పండించాం. ఆ పొలాన్ని అమ్మేసి 1983లో పెదపూడికి వచ్చి ఏడెకరాల బంజరు భూమిని కొన్నాం. నేలను చదును చేసి, ఒక రూపానికి తెచ్చి సగం చేపల చెరువు పెట్టి, మిగిలిన పొలంలో సాగు చేస్తున్నాం. గట్ల వెంట నూట పాతిక కొబ్బరి చెట్లు పెట్టాం. రకరకాల పంటలతో నిత్యం సాగులోనే ఉంటుంది మా భూమి. సేంద్రియ వ్యవసాయం ఎలా చేయాలో సదస్సులు పెట్టినప్పుడు ఇద్దరం వెళ్తాం. ఆ పుస్తకాల్లో చెప్పిన పద్ధతుల్లో సాగు చేస్తున్నాం. అలా చేస్తున్నందుకు నాకు అవార్డు కూడా వచ్చింది. 'సంప్రదాయ విజ్ఞానాన్ని ఆచరిస్తున్న మహిళా రైతు' అని అవార్డు ఇచ్చారు. అంతకు ముందొకసారి మత్స్యశాఖ పరిజ్ఞాన సంస్థ (కాకినాడ) స్వర్ణోత్సవాల పుస్తకంలో (సావనీర్) ఉత్తమ మహిళారైతు అని నా గురించి రాశారు. నేను పుస్తకం చదవడానికి కంటి అద్దాలక్కర్లేదు. రోజంతా పొలంలో మరీ ఎక్కువగా తిరిగినప్పుడు మోకాళ్ల నొప్పులు వస్తాయి. నేను తయారు చేసుకున్న ఔషధ తైలంలో కర్పూరం కలిపి రాసుకుంటాను.





భర్త వాసుదేవరాజుతో...

సాగు పాఠాలు


మా సాగును చూడడానికి అధికారులు వస్తుంటారు. మేము ఏయే పంటలు సాగు చేస్తున్నాం, ఎలా చేస్తున్నామని అడుగుతారు. పొలాన్ని ఫొటోలు తీసుకుని పోతారు. వ్యవసాయం చేస్తున్న కొత్త పిల్లలు పని సులువు కోసం చేయరాని పనులన్నీ చేసి నేలతల్లిని క్షోభ పెడుతున్నారు. తెగుళ్లను ఆపడానికి గుళికలు వేస్తే మట్టి విషమైపోతుంది. కలుపు మొక్కలు తీయడానికి కూలీలకు డబ్బులు లెక్క చూసుకుని తక్కువ ఖర్చులో పనిపూర్తవుతుందని కలుపు మందులు చల్లుతున్నారు. మందు చల్లితే కలుపు మొక్క ఒక్కటే పోతుందా, మట్టిలో జీవం కూడా పోతుంది. మొలకెత్తే గుణాన్ని హరించి వేశామంటే భవిష్యత్తు ఏమవుతుంది? భూమిని ఇలాగే బీభత్సంగా నాశనం చేస్తుంటే కొన్నాళ్లకు మట్టిలో బీజం వేస్తే మొలకెత్తడం మానేస్తుంది. అప్పుడు జనం ఏం తిని బతుకుతారు? అందుకే మనకున్న మొక్కలన్నింటినీ కాపాడుకోవాలి, భూమి తల్లిని రక్షించుకోవాలి? నేను ఈ భూమితోనే పెరిగాను, ఇందులోనే బతికాను, హాయిగా జీవిస్తున్నాను'' అన్నారు సత్యవతి.

ఆమె పిల్లలు బెంగళూరు, బాపట్ల, హైదరాబాదుల్లో ఉన్నారు. వాళ్లు వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తూనే వ్యవసాయం కూడా చేస్తున్నారు. మనిషి ఎంత ఎదిగినా నేల విడిచి సాము చేయకూడదు. పాదాలు నేల మీదనే ఉండాలి, నేల ఆధారంతోనే ఎదగాలి. అప్పుడే జీవితాల్లో సంక్రాంతి వెల్లివిరుస్తుంది... అని సత్యవతి నమ్ముతారు, ఆమె మాటలను ఆమె పిల్లలు విశ్వసిస్తున్నారు. ''మా అమ్మలో మంచి రైతు, గొప్ప వైద్యురాలే కాదు సాగును ఆరోగ్యాన్ని కలగలిపి ఔషధాలతో ఆహారాన్ని తయారు చేసే ఎక్స్‌పర్ట్ కూడా ఉంది'' అంటారు.

– వాకా మంజులారెడ్డి


ఫొటోలు: **శివ మల్లాల, బీఎల్ నారాయణ**, తెనాలి

ముగ్గు-ముచ్చట




25 చుక్కలు, 1 వచ్చేవరకు (చుక్కలు చూసి పెట్టుకోవాలి)

దేవులపల్లి నవత
రెడ్డికాలనీ
హన్మకొండ



19 చుక్కలు, 1 వచ్చేవరకు (చుక్కలు చూసి పెట్టుకోవాలి)

కట్టమూరి సుభాషిణి
గుంటూరు





సుగుణ వైట్ల
దుబ్బాక, సిద్ధిపేట జిల్లా

27 చుక్కలు, 11 వరుసలు 4 వచ్చే వరకు, సరి చుక్క





ఎ.వర్ణ,
తంగేడుపల్లి, చౌటుప్పల్

36 చుక్కలు, 6 వరుసలు, 6 వచ్చేవరకు



వై. కల్యాణి
సూళ్ళూరుపేట, నెల్లూరు జిల్లా


17 చుక్కలు, 3 వరుసలు, 3 వచ్చేవరకు, సరిచుక్క





కె. హరిప్రియ
పెద్దచింతకుంట, మహబూబ్‌నగర్ జిల్లా

23 చుక్కలు, 3 వరుసలు, 3 వచ్చేవరకు





ఎమ్. సుమ
పులివెందుల, వైఎస్సార్ జిల్లా

11 చుక్కలు 6 వచ్చే వరకు, మధ్య చుక్క





ఎమ్. మోనిక చౌదరి
అనంతపురం

33 చుక్కలు 11 వరుసలు, 11 వచ్చేవరకు

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
14-1-2019



ఉద్యోగాలు

యూపీఎస్సీ-ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ (1) ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణతో పాటు త్రివిధ దళాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాల నియామకానికి నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (1)-2019 పరీక్ష ప్రకటనను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసింది. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

- **ఖాళీలు:** 392
  1. 143వ ఎన్‌డీఏ బ్యాచ్-342 (ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-92).
  2. 105వ ఇండియన్ నేవల్ అకాడమీ కోర్సు (ఐఎన్ఏసీ)-50.
- **అర్హత:** పన్నెండో (10+2) తరగతి ఉత్తీర్ణత. ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలకు పన్నెండో తరగతిలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ చదివుండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** జులై 2, 2000 నుంచి జులై 1, 2003 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, జనరల్ ఎబిలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా.
- **రాత పరీక్ష తేదీ:** ఏప్రిల్ 21, 2019.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 4, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఎస్‌బీఐలో 31 ఖాళీలు

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 31 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** డిప్యూటీ మేనేజర్ (స్టాటిస్టీషియన్)-2, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్-3, మేనేజర్-3, హెడ్ (లీగల్)-1, డీజీఎం (లా)-1, తదితర పోస్టులు...
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, పీజీ, బీఈ, సీఏ, పని అనుభవం ఉండాలి. డిప్యూటీ మేనేజర్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, మేనేజర్ పోస్టులను రెగ్యులర్ విధానంలో, మిగతా పోస్టులను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయనున్నారు.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.600; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 31, 2019.
- **వెబ్‌సైట్:** https://bank.sbi

బీటెక్.. తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఆ స్వప్న సాకారం కోసం ఇంటర్‌లో చేరిన తొలిరోజు నుంచే ఎంసెట్‌లో విజయం కోసం శ్రమిస్తుంటారు. ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించడమే లక్ష్యంగా ప్రిపరేషన్ సాగిస్తుంటారు. ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించి కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ ఎంపీసీ చదువుతూ.. మరోవైపు ఎంసెట్ కోచింగ్ కోసం వేలకువేలు ఫీజులు కడుతున్న విద్యార్థులు.. కష్టపడి చదివి ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించాక మరిన్ని ఫీజుల భారం మోయక తప్పని పరిస్థితి కనిపిస్తోంది!! 2019-2022 బ్లాక్ పిరియడ్‌కు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీల్లో పెరగనున్న ఫీజుల భారంపై నిపుణుల విశ్లేషణ...

ఇంజనీరింగ్ స్పెషల్



ఇంజనీరింగ్.. ఫీజులుం

- 2019-22 బ్లాక్ పిరియడ్‌కు ఫీజుల పెంపునకు కసరత్తు ప్రారంభం
- స్థానిక కళాశాలల్లో 60 వేల వరకు వార్షిక ఫీజు పెరిగే అవకాశం
- పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లలో ఫీజు రూ.రెండు లక్షలకు చేరే ఆస్కారం
- కళాశాలల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్న తెలుగు రాష్ట్రాల ఏఎఫ్ఆర్‌సీలు
- ఫీజులు పెరుగుతున్నా.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అరకొరే..

2019-2022 బ్లాక్ పిరియడ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల్లో.. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు దిశగా కసరత్తు మొదలైంది. రెండు తెలుగు రాష్ట్రాల ఏఎఫ్ఆర్‌సీ (అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ)లు.. ఆయా కళాశాలల నుంచి ప్రతిపాదనల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించాయి! ఈ ప్రతిపాదనల ఆధారంగా ఫీజుల నిర్ధారణ జరగనుంది. ఫీజుల పెంపుపై కాలేజీల డిమాండ్‌ల దృష్ట్యా 2019-2022 బ్లాక్ పిరియడ్‌కు భారీగా ఫీజులు పెరిగే అవకాశం కనిపిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రతి మూడేళ్లకోసారి పెంపు

తెలుగు రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రతి మూడేళ్లకు ఒకసారి ఫీజుల సవరణ విధానం అమలవుతోంది. ఇందుకోసం ఆయా కళాశాలల ఆదాయ, వ్యయ వివరాలను పరిగణనలోకి తీసుకొని.. ఫీజును నిర్ధారించాలనే విధానం 2013లో తొలిసారిగా అమల్లోకి వచ్చింది. ఇందుకోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఏఎఫ్ఆర్‌సీ పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఏఎఫ్ఆర్‌సీలోని నిపుణులు ఆయా కళాశాలలు పంపిన ఆదాయ, వ్యయ ప్రతిపాదనలను పరిశీలించి ఫీజులు నిర్ధారిస్తున్నారు. 2016-2019 బ్లాక్ పిరియడ్ గడువు ముగియనుంది. దీంతో 2019-2022కు గాను ఫీజుల సవరణకు కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే ఆయా కళాశాలల నుంచి ఆదాయ వ్యయ ప్రతిపాదనలను ఏఎఫ్ఆర్‌సీలు స్వీకరిస్తున్నాయి.

రూ.60 వేల నుంచి రెండు లక్షల వరకు?

2019-22 బ్లాక్ పిరియడ్‌కు సంబంధించి స్థానిక కళాశాలల్లో కనిష్ఠంగా బీటెక్ వార్షిక ఫీజు రూ.60వేల వరకు పెరిగే అవకాశముందంటున్నారు. కొంత పేరున్న కళాశాలల్లోనైతే ఈ ఫీజు రూ.రెండు లక్షల వరకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. 2016-19 బ్లాక్ పిరియడ్‌కు స్థానిక ఇంజనీరింగ్ కళాశాలల్లో రూ.35 వేలు వార్షిక ఫీజును నిర్ధారించగా.. పేరున్న కళాశాలల్లో గరిష్ఠంగా రూ.1.13 లక్షలు నిర్ణయించారు. పేరున్న ఆ కళాశాలలు సదరు రూ.1.13 లక్షల ఫీజు తమ వ్యయాలకు సరిపోవట్లేదని.. ఇంకా పెంచాలని కోరుతూ కోర్టుల్లో వాజ్యాలు సైతం వేశాయి. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లలో రూ.1.5 లక్షలకుపైగా వార్షిక ఫీజు చెల్లించేలా విద్యార్థుల నుంచి ఒప్పంద పత్రాలు రాయించుకున్న పరిస్థితి తెలిసిందే! ఇప్పుడిక తాజాగా 2019-2022 బ్లాక్ పిరియడ్‌కు సంబంధించి ఈ పేరున్న కళాశాలలు అధికారికంగానే రూ.రెండు లక్షల వరకు ఫీజును నిర్ధారించాలని ఒత్తిడి తెచ్చే పరిస్థితి కనిపిస్తోందని చెబుతున్నారు.

'భారీ' ఫీజులకు కారణం?

ఏఐసీటీఈ నిబంధనలకు అనుగుణంగా ఫ్యాకల్టీకి వేతనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకయ్యే వ్యయాల కోసం ప్రస్తుత ఫీజులు ఏ మాత్రం సరిపోవడం లేదని కాలేజీలు పేర్కొంటున్నాయి. ఇప్పుడున్న ఫీజులను దాదాపు రెట్టింపు చేస్తే తప్ప ఏఐసీటీఈ ప్రమాణాల మేరకు కాలేజీలు మనుగడ సాగించడం కష్టమని చెబుతున్నాయి. కాలేజీల ఇలాంటి వాదన కారణంగా 2019-2022 బ్లాక్ పిరియడ్‌కు ఫీజులు భారీగా పెరిగే అవకాశముందని నిపుణులు అంచనావేస్తున్నారు.

ఫీజుల పెంపు.. కాలేజీల అభిప్రాయాలు

- ఏఐసీటీఈ నిబంధనలు పాటించాలంటే ఫీజులు పెంచితేనే సాధ్యం.
- ఫ్యాకల్టీ వేతనాలకే ఆదాయంలో సగం వెచ్చించాల్సి వస్తోంది.
- మౌలిక సదుపాయాలకు రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది.

మూడు నుంచి పది లక్షలు ఖర్చు చేస్తేనే!

భారీ స్థాయిలో ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైన నేపథ్యంలో స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తిచేసేందుకు నాలుగేళ్ల కోర్సులో ట్యూషన్ ఫీజుకే దాదాపు మూడు లక్షలు కట్టాల్సి ఉంటుంది. దీనికి అదనంగా ఇతర ఖర్చులు ఉండనే ఉంటాయి. పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఏకంగా రూ.పది లక్షల వరకు వ్యయం చేస్తేనే బీటెక్ పట్టా చేతికందుతుంది.

ఫీజులు పెరిగినా.. నాణ్యత లభించేనా?

కళాశాలల డిమాండ్‌లకు అనుగుణంగా ఫీజులు పెరిగే అవకాశమున్నా.. విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్న గ్యారెంటీ ఉందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. పేరున్న కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కొంత మెరుగ్గా ఉన్నా.. మిగతా కాలేజీల్లో మాత్రం అర్హులైన ఫ్యాకల్టీ సంఖ్య ఏఐసీటీఈ నిబంధనలకు అనుగుణంగా ఉండట్లేదు. ఏఐసీటీఈ ఇటీవల విడుదల చేసిన నూతన కరిక్యులం ప్రకారం-ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి తన నాలుగేళ్ల కోర్సు కాలంలో మూడు ఇంటర్న్‌షిప్‌లు చేయాలని.. కాలేజీలో ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెల్స్‌ను ఏర్పాటుచేయాలని.. ప్రాక్టికల్ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని... మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటన్నింటినీ అమలు చేసే కళాశాలల సంఖ్యను వేళ్ల మీద లెక్కించొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి మండలంలోనూ ఇంజనీరింగ్ కళాశాలలు కనిపిస్తున్నాయి. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో సైతం ఇవి పుట్టుకొచ్చాయి. ఈ కళాశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన వంటివి కనుచూపుమేరలో కనిపించడంలేదు. ఇలాంటి కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు సైతం ఇష్ట పడటం లేదు. గత ఏడాది తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్, సీట్ల భర్తీ గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఫీజులు పెంచుకున్న కాలేజీలు ఆ మేరకు నిబద్ధతతో వ్యవహరిస్తే విద్యార్థులకు నాణ్యమైన బోధన, నైపుణ్యాలు లభిస్తాయని అంటున్నారు. అందుకు భిన్నంగా లాభాపేక్షే లక్ష్యంగా ఫీజులు పెంచుకుంటే మాత్రం.. నాణ్యతా ప్రమాణాల పరంగా నాలుగేళ్ల తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని చెబుతున్నారు.



మిగిలిపోతున్న సీట్లు

నాణ్యత ప్రమాణాలు లేని కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దాంతో ఆయా కళాశాలల్లో సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. గతేడాది కౌన్సెలింగ్ గణాంకాల ప్రకారం-ఏపీలో ప్రైవేటు కళాశాలల్లో కౌన్సెలింగ్ కోటాలో 92 వేలకు పైగా సీట్లు ఉంటే.. దాదాపు 34 వేల సీట్లు మిగిలిపోయాయి. తెలంగాణలో 66 వేల సీట్లకు గాను 17 వేల సీట్లు మిగిలిపోయాయి.

ప్రత్యామ్నాయ కోర్సులున్నాయ్

ఇంజనీరింగ్ ఫీజులు భారంగా మారుతుండటం... లక్షలు ఖర్చు చేసి ఇంజనీరింగ్ పట్టా సాధించినా... నైపుణ్యాల లేమితో ఉద్యోగాలు లభించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇంత ఖర్చు చేసి ఇంజనీరింగ్ కోర్సులోనే చేరాలా? ప్రత్యామ్నాయం లేదా అనే ప్రశ్న చాలామంది తల్లిదండ్రులకు విద్యార్థులకు ఎదురవుతోంది. ప్రస్తుతం అకడమిక్‌గా, ఆపై జాబ్ మార్కెట్ పరంగా పలు ఆకర్షణీయమైన కోర్సులను నిపుణులు సూచిస్తున్నారు. ఇవి తక్కువ ఖర్చుతో ఇంజనీరింగ్‌కు దీటుగా కెరీర్ అవకాశాలు, వేతనాలు కల్పిస్తాయని చెబుతున్నారు. ఆ కోర్సులివే..

- సీఏ, సీఎంఏ, సీఎస్
- లాంగ్వేజెస్
- 'లా'(న్యాయ శాస్త్రం)
- బ్యాచిలర్ ఆఫ్ సైన్స్
- స్టాటిస్టిక్స్
- మాస్ కమ్యూనికేషన్స్
- సోషల్ వర్క్/సోషియాలజీ
- సోషల్ మీడియా
- ఎకనామిక్స్
- అప్లైడ్ మ్యాథమెటిక్స్.

అవకాశాలు లేక.. దిక్కు తోచక

ఎలాగోలా ఫీజుల భారం మోసి.. కోర్సు పూర్తి చేసుకుని డిగ్రీ పట్టా అందుకుని.. క్యాంపస్ బయట కాలు పెట్టిన విద్యార్థులకు ఉద్యోగాల పరంగా దిక్కు తోచని పరిస్థితి ఎదురవుతోంది. స్థానిక కళాశాలల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అనే మాటే వినిపించట్లేదు. ఆ కాలేజీల్లో నాణ్యమైన బోధన లేక.. నైపుణ్యాల లేమి కారణంగా బయట కూడా జాబ్ మార్కెట్‌లో కొలువులు లభించడంలేదు. సొంతంగా ఉద్యోగ అన్వేషణలో జాబ్ మార్కెట్‌లో అడుగుపెట్టాక విద్యార్థులకు బీటెక్ పట్టాలు ఎందుకూ కొరగానివని.. అదనపు నైపుణ్యాలుంటేనే ఉద్యోగం లభిస్తుందని తెలిసి ఆవేదన చెందుతున్నారు.

నియంత్రణ పటిష్టంగా ఉంటేనే

ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలు పెరగాలంటే నియంత్రణ వ్యవస్థలు పటిష్ఠంగా పని చేయాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. సాంకేతిక విశ్వ విద్యాలయాలు తమ అనుబంధ కళాశాలల్లో ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని పేర్కొంటున్నారు. నిత్యం తనిఖీలు చేస్తుండటం.. లోపాలుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం వంటి చర్యల వల్ల కాలేజీల వైఖరిలో మార్పు వచ్చే అవకాశముందంటున్నారు. ప్రస్తుతం చాలా సందర్భాల్లో యూనివర్సిటీల అధికారిక బృందాలు ఆయా కళాశాలల్లో తనిఖీ చేసే సమయం గురించి ముందుగానే తెలియజేయడం.. పర్యవసానంగా యాజమాన్యాలు అప్పటికప్పుడు తనిఖీ బృందాలు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. కాబట్టి యూనివర్సిటీల అధీకృత బృందాలు ఆకస్మిక తనిఖీలు చేస్తే కళాశాలల వాస్తవ పరిస్థితులు తెలుస్తాయంటున్నారు.

ఫీజులు పెరిగినా.. పెరగని రీయింబర్స్‌మెంట్

ఇంజనీరింగ్ ఫీజుల పరంగా విద్యార్థులకు వరం.. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం. కానీ, గత కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం దారితప్పింది. ఆయా కోర్సుల్లో ఫీజులు భారీగా పెరుగుతున్నా...రీయింబర్స్‌మెంట్ మాత్రం పెరగడం లేదు. ఇస్తున్న ఆ కొద్ది మొత్తం కూడా సకాలంలో, సక్రమంగా చెల్లించక కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కాలేజీల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్న సంఘటనలు ఎన్నో! బీటెక్‌కు సంబంధించి 2016-19 బ్లాక్ పీరియడ్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. రెండు రాష్ట్రాల్లోనూ సీలింగ్ నిబంధన పేరుతో ఏడాదికి రూ.35 వేలు మాత్రమే రీయింబర్స్ చేస్తున్నారు. ఆపై మొత్తాన్ని విద్యార్థులే సొంతగా చెల్లించుకోక తప్పదు. బీసీ, ఈబీసీ వర్గాల విద్యార్థుల ర్యాంకు పదివేలు దాటితే.. ఫీజు ఎంతున్నా రూ.35వేల రీయింబర్స్‌మెంట్‌తో సరిపుచ్చుకోవాల్సిందే!

ప్రమాణాలు పాటించాలంటే తప్పదు.. కానీ..

ఏఐసీటీఈ ప్రమాణాలు పాటించాలంటే ఫీజుల పెంపు తప్పదు. కానీ.. ఫీజుల పెంపును డిమాండ్ చేసే కాలేజీలు.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంకిత భావంతో వ్యవహరించాలి. నియంత్రణ సంస్థలు ఆయా కళాశాలల పనితీరుపై కన్నేసి ఉంచాలి. అప్పుడే విద్యార్థులకు వ్యయ భారమైనా.. ఉద్యోగ నైపుణ్యాలు లభిస్తాయి.

– **డాక్టర్ డి.ఎన్.రెడ్డి**, డైరెక్టర్, సీఆర్ రావు ఏఐఎంఎస్‌సీఎస్, జేఎన్‌టీయూ-హెచ్ మాజీ వీసీ.

ఆన్‌లైన్ తనిఖీ వ్యవస్థ

కళాశాలలు తాము అందించిన ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా కళాశాలల్లో సదుపాయాలపై చర్యలు తీసుకుంటున్నాయా? లేదా? అనే విషయం నిరంతరం తెలుసుకునేలా ఆన్‌లైన్ తనిఖీ వ్యవస్థను రూపొందించాలి. ఎప్పటికప్పుడు కళాశాలల్లో చేపడుతున్న టీచింగ్, నాన్-టీచింగ్ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సంబంధిత యూనివర్సిటీకి ఆన్‌లైన్‌లో తెలియజేసే విధంగా పటిష్టమైన వ్యవస్థను రూపొందిస్తే పెరిగే ఫీజుల మేరకు విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

– **ప్రొ॥ వి.ఎస్.రావు**, ప్రెసిడెంట్, ఎన్ఐఐటీ యూనివర్సిటీ.

ఏపీపీఎస్సీ మెయిన్స్..

ప్రజాసేవలో నైతికత

గ్రూప్స్ స్పెషల్



గ్రూప్-1 రాసే అభ్యర్థులకు నైతిక అంశాలపై ముందుగా అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్‌లో వారి వృత్తి నిర్వహణలో వీటి ప్రభావం పడి.. మంచి అధికారులుగా తయారవడానికి దోహదపడుతుంది!!

భారతదేశ పరిపాలనలో కీలక పాత్ర పోషించే ఉద్యోగస్వామ్య వ్యవస్థలో.. ఉన్నత స్థాయి ఉద్యోగాలైన సివిల్ సర్వీసెస్‌లలో అభ్యర్థుల నైతిక సామర్థ్యాలను గుర్తించేందుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2013లో సిలబస్‌లో మార్పులు చేసి.. మెయిన్స్ జీఎస్-పేపర్4లో ''నైతికత, సమగ్రత, సహజ సామర్థ్యం'' అంశాలను పొందుపరించింది. ఇటీవల జరిగిన రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల సమావేశంలో.. రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్‌ల సిలబస్‌ను యూపీఎస్సీ సిలబస్‌కు అనుగుణంగా రూపొందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 సిలబస్‌లో మార్పులు చేసి.. మెయిన్స్ పేపర్-3, పార్ట్ సీలో... ప్రజాసేవలో నైతికత (ఎథిక్స్ ఇన్ పబ్లిక్ సర్వీస్) అనే అంశాన్ని సిలబస్‌లో చేర్చింది.

ప్రజాసేవలో నైతిక విలువలు

గ్రూప్-1 మెయిన్స్ పేపర్-3, పార్ట్-సీలో పేర్కొన్న.. ''ప్రజాసేవలో నైతిక విలువలు''లో నైతిక విలువలు, మానవ సమన్వయం; మానవ విలువలు; దృక్పథం; ప్రజాసేవ భావన ఉన్నాయి.

నైతిక విలువలు, మానవ సమన్వయం

- ఇందులో సారాంశం; మానవ చర్యలలో నైతికత నిర్ధారకాలు-పరిణామాలు; నైతికత కోణాలు; వ్యక్తిగత, ప్రజా సంబంధాలలో నైతిక విలువలు; ప్రజాసేవలో జవాబుదారీతనం; నైతికత-సమగ్రత; వంటి అంశాలున్నాయి.
- మానవ చర్యలలో నైతిక నిర్ధారకాలు అంశాన్ని పరిశీలిస్తే.. ఇక్కడ కొంత పదజాలం, కొన్ని నిజ జీవిత సంఘటనలు అవసరమవుతాయి. ముఖ్యంగా నైతికత అంటే ఏమిటి; నిజాయితీ, సానుభూతి, సహానుభూతి, నిస్వార్థం, హెడోనిజం, రుజువర్తనాన్ని కలిగి ఉండటం వంటి కొన్ని అంశాలకు సంబంధించిన పదాల వివరణలు అవసరం. ముఖ్యంగా నైతికత పరిణామాలు వంటి అంశాలను చర్చించేటప్పుడు భారతీయ పురాతన గ్రంథాలలోని; రామాయణ, మహాభారత, ఉపనిషత్తులు, బైబిల్, ఖురాన్ వంటి గ్రంథాల సారాంశం; భారతీయ, పాశ్చాత్య తత్వవేత్తల సూక్తులను రాయడం మంచిది. ఉదాహరణకు ధర్మోరక్షతి రక్షితః, ఆత్మదీపోభవ, కర్మఫల సిద్ధాంతం వంటి వాటి గురించి రాయడం అవసరం. ఈ సందర్భాలలో పురాతన గ్రంథాలలో నైతికతను కోల్పోయిన వ్యక్తులు ఏ విధంగా పతనమయ్యారు, వ్యక్తిగతంగా మంచివాడైనా చెడ్డవారితో సహవాసం వల్ల ప్రాణాలు కోల్పోయిన కర్ణుడి గాథ వంటి వివరణలు ఇవ్వడం మంచిదే!

Virtue is Knowledge
(సుగుణమే విజ్ఞానం)

ఈ వ్యాఖ్య ద్వారా మనిషి జీవితానికి నైతిక విలువలు ఎంత అవసరమో ప్లేటో తెలియజేశారు. వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలు పాటించినప్పుడు ఆ వ్యక్తి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుతాడు. వ్యక్తి తన వృత్తి జీవితంలో నైతికతను కలిగి ఉన్నప్పుడు మొత్తం వ్యవస్థలో మార్పునకు కారణమవుతాడు. వ్యవస్థలోని మిగతా వారందరికీ ఆదర్శప్రాయుడవుతాడు. వ్యవస్థను మంచి మార్గంలో నడిపించి.. మొత్తం సమాజ శ్రేయస్సుకు దోహదపడతాడు. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వృత్తి జీవితంలో వ్యక్తుల నైతిక విలువలకు పెద్దపీట వేస్తున్నాయి. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ మూడో పేపర్‌లో ''ప్రజాసేవలో నైతికత'' అనే అంశాన్ని ప్రవేశ పెట్టింది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ సిలబస్‌లోనూ 'పాలనలో నైతికత' అంశం భాగమైంది.

మానవ విలువలు

ఇందులో ప్రకృతి, సమాజంలో అంతర్లీనంగా ఉనికిలో ఉన్న సామరస్యాన్ని అర్థం చేసుకోవడం; మానవ సంబంధాలలో లింగ సమానత్వం; పౌరుల్లో విలువలు ఏర్పడటంలో కుటుంబం, సమాజం, విద్యాసంస్థల పాత్ర; గొప్పనాయకులు, సంస్కర్తలు, పాలకుల జీవితాలు, సందేశాల నుంచి స్ఫూర్తి పాఠాలు తదితర అంశాలు సిలబస్‌లో ఉన్నాయి. సిలబస్‌లో ఈ అంశం చాలా విస్తృతమైనదనే చెప్పాలి. ఎందుకంటే... భారతీయ సమాజంలో కుటుంబ పాత్ర, విద్యాసంస్థల పాత్ర వ్యక్తి ప్రవర్తనపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఈ అంశాలను వివరించేటప్పుడు గాంధీజీ వంటి వారి జీవిత చరిత్రలు ముఖ్యంగా ఆయన తల్లికి ఇచ్చిన ''మూడు వాగ్దానాలు''వంటి అంశాల ద్వారా కుటుంబ ప్రాధాన్యత వివరించవచ్చు. విద్య, విద్యాసంస్థలు వ్యక్తిలో విలువలు పెంపొందించే క్రమంలో.. వాటి పాత్రను వివరించేటప్పుడు నెల్సన్ మండేలా చెప్పిన సూక్తులు రాయాలి. ఉదాహరణకు ''ఈ ప్రపంచంలో విద్యకు మించిన ఆయుధం లేదు'' వంటివి.

- పాలకుల జీవితాల విషయానికి వస్తే... గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, సర్దార్ పటేల్, కలాంలతో పాటు శంకరన్ వంటి అధికారుల జీవిత అంశాల ద్వారా వివరణ ఇవ్వాలి. ఉదాహరణకు: కోర్టులో వాదిస్తున్న సమయంలో భార్య మరణ వార్త టెలిగ్రాం ద్వారా తెలిసినా.. కీలకమైన ఆ కేసు వాదనలు పూర్తయిన తర్వాతే కోర్టు నుంచి బయటకు వెళ్లిన ఉక్కు మనిషి పటేల్ జీవితం మనిషిలో స్థిత ప్రజ్ఞతకు, వృత్తి నిబద్ధతకు నిదర్శనంగా వివరించవచ్చు.

దృక్పథం (అటిట్యూడ్)

ఇందులో విషయ అవగాహన; మనిషి ఆలోచనలు, ప్రవర్తనకు దృక్పథానికి మధ్యసంబంధం, దాని ప్రభావం; నైతిక, రాజకీయ వైఖరులు, సామాజికంగా వాటి ప్రభావం; భావోద్వేగ ప్రజ్ఞ వంటి అంశాలున్నాయి. వీటిని పరిశీలిస్తే... దృక్పథం అంటే ఏమిటి; దాని లక్షణాలు ఏమిటి? అది మనిషి ప్రవర్తనను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది అనే అంశాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను వివరించేటప్పుడు ''అల్ పోర్ట్'' సూచించిన దృక్పథం లక్షణాలు రాయడం మంచిది. 'దృక్పథం-ప్రవర్తన'కు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు అడిగినప్పుడు.. ఐన్‌స్టీన్ చెప్పిన.. ''ఒక వ్యక్తి దృక్పథంలో లోపం ఉంటే.. అది అతని ప్రవర్తనలో ప్రతిబింబిస్తుంది'' వంటి మాటలను ప్రస్తావించాలి. వ్యక్తుల దృక్పథాలను ప్రభావితం చేసే పద్ధతులైన **"ETHOS, PATHOS, LOGOS"** వంటి అంశాలను వివరించడం అవసరం. ముఖ్యంగా కేస్‌స్టడీస్‌లో వీటిని ఉపయోగించి వివరిస్తే బాగుంటుంది.

భావోద్వేగ ప్రజ్ఞ

భావోద్వేగ ప్రజ్ఞ(ఎమోషనల్ ఇంటెలిజెన్స్), దాని ఉపయోగాలు; పాలనలో భావోద్వేగ ప్రజ్ఞ కలిగి ఉండటం వల్ల ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలి. భావోద్వేగ ప్రజ్ఞ అంటే.. వ్యక్తులు తమలోని ప్రేమ, ద్వేషం వంటి భావోద్వేగాలపై నియంత్రణ కలిగి ఉండటం. భారత్ వంటి అధిక జనాభా గల దేశంలో ప్రభుత్వ అధికారులు తీసుకునే ఏ చిన్న నిర్ణయం అయినా ఎక్కువ మంది ప్రజలపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ప్రజాసేవలో ఉండే అధికారులు మంచి పని సంస్కృతిని పెంపొందించడానికి భావోద్వేగ ప్రజ్ఞను కలిగి ఉండాలి. ప్రభుత్వాధికారులు బంధుప్రీతి, పక్షపాతం, స్వార్థపూరిత వైఖరి వంటి వాటికి దూరంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మానసిక స్థైర్యాన్ని కోల్పోకూడదు. పాలనలో భావోద్వేగ ప్రజ్ఞ వల్ల మంచి పని సంస్కృతి ఏర్పడుతుంది. ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వాధికారుల ప్రవర్తన మారుతుంది. ఫలితంగా ప్రజలకు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. వివాదాల పరిష్కారం, ఘర్షణ వాతావరణాన్ని నివారించడం, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి ఉద్యోగులకు భావోద్వేగ ప్రజ్ఞ అవసరం.

ప్రజాసేవ భావన

ఇందులో పాలనకు తాత్వికపరమైన సంపూర్ణ సాంకేతికతలపై దృష్టి, అవగాహనల నేపథ్యంలో వృత్తిపరమైన నైతికత, నైతికత నియమావళి, ప్రవర్తనా నియమావళి, ఆర్‌టీఐ, ప్రజా సేవా చట్టం, నాయకత్వ నైతికత, పని సంస్కృతి, సంస్థాగత పరమైన నైతిక సూత్రాలు, పాలనలో నైతిక, మానవ విలువలు, అంతర్జాతీయ సంబంధాలలో నైతిక అంశాలు, అవినీతి, లోక్‌పాల్, లోకాయుక్త తదితర అంశాలున్నాయి. ఈ అంశంలో ఎక్కువగా ప్రభుత్వ అధికారులకు గల చట్టబద్ధ పరిమితులు, వాటికి అనుగుణంగా వ్యక్తులు వృత్తి పరంగా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నోలాన్ కమిటీ సిఫార్సులు, సీసీఎస్ రూల్స్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండటం అవసరం. 'పాలనలో నైతికత'పై రెండో పరిపాలనా సంస్కరణల కమిషన్ నివేదికలోని ముఖ్య అంశాలపై దృష్టిసారించాలి.



బాలలత మల్లవరపు
సివిల్స్ ఫ్యాకల్టీ, హైదరాబాద్.